ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

# అధికార నివేదిక

# OFFICIAL REPORT

శనివారం, డిసెంబర్ 20, 2014,

ఇరవై రెండో సమావేశం, సంపుటం-1, నంబరు-3,

జయనామ సంవత్సరం, మార్గశిరం-13.

**SATURDAY, THE 20TH DAY OF DECEMBER, 2014,**

**TWENTY SECOND SESSION, VOLUME - 1, NO.3,**

**13TH MARGASIRAM, 1936 S.E.**

*****

శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

**ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు**

**శనివారం, డిసెంబరు, 20, 2014.**

## అధికార నివేదిక

---

<u>విషయ సూచిక</u>

---

(1) నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానాలు.

(2) సభా సమక్షంలో ఉంచే పత్రం

(3) అర్జీ సమర్పణ.

(4) హుద్ హుద్ తుఫాన్ పై లఘు చర్చ

---

# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL
# SATURDAY, THE 20TH DAY OF DECEMBER, 2014

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.)
(THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానాలు.

MR. CHAIRMAN: Now, Question Hour. 1st and 2nd questions are postponed at the request of the Members. 3rd question.

## డ్వాక్రా బృందాలకు ఇసుక త్రవ్వకం

ప్రశ్న నెం.7687 (23)
సర్వశ్రీ రుద్రరాజు పద్మరాజు, మహ్మద్ జానీ, ఎం.ఎల్.సిలు.,

గౌరవనీయులైన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) డ్వాక్రా సంఘాలకు 25 శాతం ఇసుక త్రవ్వకాలను కేటాయించే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా?

ఆ) అయితే, ఆ మార్గదర్శకాల వివరాలను తెలపండి?

గౌరవనీయులైన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, గనులు, భూగర్భ శాఖ మంత్రి (శ్రీమతి పీతల సుజాత):

అ) లేదండీ. అంటే మేము వంద శాతం ఇసుక రీచ్‌లన్నీ కూడా మహిళా సంఘాలకు ఇవ్వడం జరిగింది.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు. ఇవన్నీ కూడా 95, 97, 99 జీ.ఓల ద్వారా అన్నీ కూడా ఇవ్వడం జరిగింది.

SRI RUDRARAJU PADMARAJU: Sir, I totally disagree with the Hon'ble Minister's answer.

MR CHAIRMAN: Please put your supplementary.

శ్రీ రుద్రరాజు పద్మరాజు (శాసన సభ నియోజకవర్గం) : డ్వాక్రా గ్రూపులకు 25 శాతం మాత్రమే ఇస్తున్నారని మాకు అందిన సమాచారం. కానీ 100 శాతం కూడా వారికే ఇస్తున్నట్లు మీరు చెప్పారు. అయితే అక్కడ బోట్స్‌మెన్ అసోసియేషన్‌కు, వివిధ వర్గాలవారికి కూడా దీంట్లో ఇస్తున్నట్లు మాకు సమాచారముంది. దానిని క్లారిఫై చేయాల్సిన అవసరముంది. అధ్యక్షా, ఈ రోజుల్లో ఇసుక కొరత తీవ్రంగా ఉంది. ప్రకృతి వరంగా ఇచ్చిన ఇసుక ఇప్పుడు భవన నిర్మాణాలకు చాలా ఖర్చుతో కూడుకున్న ఉత్పత్తి అయిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రిగారు సదుద్దేశంతో ఇసుక రీచ్‌లను స్వయం సహాయక సంఘాలకు ఇవ్వడం ద్వారా

వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశం మంచిదై ఉండవచ్చు. అయితే ఆ సంఘాలే కాకుండా కొంతమంది కాంట్రాక్టర్స్, కొన్ని ముఠాలు, ఇసుక మాఫీయాలు దాంట్లో చొరబడడంవల్ల ఆ డ్వాక్రా సంఘాలకు లబ్ధి చేకూరని పరిస్థితులు ఇటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలోతోపాటు అనేక జిల్లాల్లోనూ ప్రస్తుతం కనబడుతున్నాయి. స్థానికంగా ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు వారితో లాలూచీపడి దీనిని నిర్వీర్యం చేసి, నిరాశపరిచే పరిస్థితులున్నాయి. అలాగే దీని రేటు కూడా ఒక యూనిట్‌కు రెండువేల రూపాయలు నిర్ధారిస్తే, దానిని ఐదు, పదివేల రూపాయలు వెళ్ళిపోయిన పరిస్థితి ఉంది. కిలో బియ్యం ఒక రూపాయికి దొరికితే ఇసుక రెండు రూపాయలకి కొనే పరిస్థితి ప్రస్తుతముంది. కాబట్టి అక్కడ జరుగుతున్న అవకతవకలు ప్రభుత్వ దృష్టికి వచ్చాయా? అలా వచ్చినట్లయితే ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారనేది మీద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీమతి పీతల సుజాత : అధ్యక్షా, ఇసుక త్రవ్వకాల్లో 25 శాతాన్ని డ్వాక్రా సంఘాలకు కేటాయించాలనే ప్రతిపాదన ఏదైనా ఉందా అని గౌరవ సభ్యులు అడిగారు. అయితే డ్వాక్రా సంఘాలకొరకు గౌరవ ముఖ్యమంత్రిగారు ఒక బృహత్తరమైనటువంటి మంచి ఆలోచన చేశారు. పేదరిక నిర్మూలన చేయాలనీ, పేదరికంపై గెలుపు సాధించాలంటే ఈ మహిళా సంఘాలద్వారానే అది బాగా సాధ్యపడుతుందనే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రిగారు ఒక మంచి నిర్ణయం తీసుకోవడం జరిగింది. అందులో భాగంగా సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులద్వారా వాళ్ళకి పని కల్పించి, వారు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతో, దానివల్ల వారి కుటుంబమంతా ఆనందంగా ఉంటారనే ఏకైక ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రిగారు డ్వాక్రా సంఘాలకు ఇసుక రీచ్‌లను ఇవ్వడం జరిగింది. మేము అన్ని రీచ్‌లను కూడా డ్వాక్రా సంఘాలద్వారానే పని చేయిస్తున్నాము. కేవలం లారీ నడిపే వాళ్ళు, కంప్యూటర్ మీద పనిచేసేవాళ్ళు మాత్రమే పురుషులుంటారు. మిగిలిన వారందరూ కూడా మహిళలే. అలాగే రీచ్ ఉన్న గ్రామంలో 12 నుండి 15మంది లోపు మ్యాక్ సొసైటీ ఏర్పాటుచేయడం, ఒకవేళ రెండు, మూడు సంఘాలుంటే అందరూ కలిసి కూర్చుని ఒక మ్యాక్ సొసైటీ ఏర్పాటుచేసుకుని ఆ సొసైటీ ద్వారా వారు పనిచేయడం జరుగుతుంది. ఇందులో అవకతవకలు మా దృష్టికి రాలేదు. గౌరవ సభ్యులు ఏదైనా ఆధారాలిస్తే తప్పనిసరిగా ప్రభుత్వపరంగా మేము చర్య తీసుకోవడం జరుగుతుంది.

అంతేగాక ఈరోజు మేము ఫిఫ్త్ ఆర్డర్‌కు మనకు గోదావరి, కృష్ణా, పెన్నా నదులు వస్తాయి. ఫోర్త్ ఆర్డర్‌కు శ్రీకాకుళం, నాగావళి, వంశధార నదులు వస్తాయి. థర్డ్ ఆర్డర్‌కు వచ్చేసరికి కాలువలు లాంటివి వస్తాయి. ఇప్పుడు చిత్తూరు జిల్లాలో చూస్తే అక్కడ నదులేవీ లేవు కాబట్టి కాలువలకు మేము క్యూబిక్ మీటర్ 350 ఇవ్వడం జరిగింది. థర్డ్ ఆర్డర్ ఉన్న ప్రాంతాలలోని కాలువలకు మాత్రమే ఆ విధంగా ఇవ్వడం జరిగింది. అయితే రివర్‌బెడ్ ఏదైతే ఫిఫ్త్ ఆర్డర్, ఫోర్త్ ఆర్డర్ ఉంటుందో క్యూబిక్ మీటర్ మేము 650 పెట్టడం జరిగింది. ఇది అన్ని జిల్లాల్లోనూ ఒకే రకంగా ఉంది. అయితే ఆధునిక సాంకేతికతను ఉపయోగించి జియో ఫెన్సింగ్ పెట్టి, జియో ట్యాగింగ్ పెట్టి ఈ సంవత్సరం సి.సి కెమెరాలు పెట్టి పకడ్బందీగా ఇసుక ఎక్కడా కూడా బయటికి తరలించకూడదు, రాష్ట్ర సరిహద్దులు దాటకూడదనీ, అది ప్రజలందరి అవసరాలకు ఉపయోగపడాలనీ, అదేవిధంగా ఇసుక తక్కువ ధరలో లభించే విధంగానూ, అందుబాటులో ఉండే విధంగానూ, వాళ్ళు ఎన్ని లారీల ఇసుకను అడిగినా వాళ్ళకి వెంటనే అందించేలాగా చాలా ప్రత్యేక శ్రద్ధతో ముఖ్యమంత్రిగారు చేయడం జరిగింది. దానికనుగుణంగానే మేమందరమూ కూడా

పనిచేస్తున్నాము. అయితే ఏదైనా కొత్తది ఏర్పాటు చేశామంటే మొదలుపెట్టినప్పుడు చిన్న చిన్న ఇబ్బందులుంటాయి. మనమందరమూ ఆ విషయాన్ని అంగీకరించాలి. ఇసుక రీచ్‌లన్నీ మహిళలతో పనిచేయించాలనే ఒక మంచి ఆలోచనతో ఒక మంచి కార్యక్రమం పెట్టాము. ఆ సిస్టమ్‌ను స్ట్రీమ్‌లైన్ చేయడానికి మాకు చిన్న చిన్న సమస్యలు వచ్చాయి. మేము అన్నింటినీ అఛీవ్ అవుతున్నాము. దాదాపుగా అన్నీ కలుపుకుంటే రాష్ట్రవ్యాప్తంగా రు.90 కోట్లు వచ్చింది. ఇది కూడా మహిళా సంఘాల ద్వారా వచ్చింది. వాళ్ళు విజయం సాధించారు.

ఉ.10.10

గతంలో చాలాచోట్ల చూస్తే ఇసుక మాఫియాను ఇష్టారాజ్యంగా చేసేవాళ్లు. దానిని అరికట్టి మహిళలతో పనిచేయించి అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం పని చేస్తోంది. ఈరోజున చూస్తే మహిళలు ఎంత సాధికారతతో పనిచేస్తున్నారనే దానికి ఇదొక చిన్న ఉదాహరణ, పశ్చిమ గోదావరి లాంటి ప్రదేశాలలో గౌరవ ముఖ్యమంత్రిగారు మాకు అవకాశం ఇచ్చారు, మేము బాగుండాలని ముందుకు తీసుకువెళితే మీరెవరు అడ్డుకోవడానికని అర్ధరాత్రులు కూడా ఇసుక మాఫియాలను తరిమివేసిన సంఘటనలు కూడా జరిగాయి. అటువంటి వాళ్లమీద మహిళలే కేసులు పెట్టి ధైర్యంగా ముందుకువెళ్లేలా గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రోత్సహించారు. అదే విధంగా సి.సి కెమెరాలు, జియో ఫెన్సింగ్, జియో ట్యాగింగ్ పెట్టి ఎక్కడాకూడా ఒక్కలారీ కూడా ప్రక్కకు తప్పుకోకుండా ఎవ్వరైతే ఆర్డర్ ఇచ్చారో వాళ్లందరికీ కూడా చేరవేసే దిశగా పైలెట్ ప్రాజెక్టుగా దీనిని ముందుకు తీసుకువెళ్లేందుకు టెండర్లు పిలవడం జరిగింది. మొదటిగా గుంటూరు జిల్లాలో త్వరలో ప్రారంభించబోతున్నాము.

మిస్టర్ ఛైర్మన్ : వాళ్లేమో సప్లమెంటరీస్ అడగాలని ఎదురు చూస్తున్నారు. మీరే మొత్తం చెప్పేస్తే ఎలా?

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం (ఉపాధ్యాయ నియోజకవర్గం, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) : అధ్యక్షా, అడగడానికి చాలా ఉంది. ఈ మధ్య జరిగిన జిల్లా పరిషత్ జనరల్ బాడీ మీటింగుకు మేము కూడా హాజరయ్యాము. సగం చర్చ ఈ ఇసుక మాఫియా గురించే జరిగింది.

శ్రీ రుద్రరాజు పద్మరాజు : అధ్యక్షా, ఈ రోజు ఇసుక మాఫియా అనేది ఒక హాట్ టాపిక్. Sir, let me just speak. This is a burning issue. Everybody is concerned. Please give us some time.

మిస్టర్ ఛైర్మన్ : అది మంచిదే, 11.00 O' clock I will close the Question Hour and go to other subject. This is the decision of the House. I agree with all of you. I have no objection. But, 11.00 O' Clock I am closing and going for the Short Discussion.

శ్రీ రుద్రరాజు పద్మరాజు : అధ్యక్షా, ఈ రోజు ఇసుక విషయంలో రాష్ట్రముఖ్యమంత్రి గారి ఆలోచనలను శంకించడం లేదు. వారికి చిత్తశుద్ధి ఉండవచ్చు. కానీ ఈ రోజు మాఫియాలు కాని, సిండికేట్లు గాని ఈ రోజుకీ కూడా They are playing a key role అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇది అందరికీ తెలుసు, కొంతమంది మాట్లాడలేక పోవచ్చు గాని, ఇది వాస్తవం. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు కూడా అక్కడున్నటువంటి వారిని గ్రూప్ క్రింద చేసి ఈ విధంగా

చేస్తున్నారనే సంగతి అందరికీ తెలుసు. ఇసుక కూడా కొనుక్కోలేని దయనీయ స్థితిలో ఈ రాష్ట్రం ఉంది. ఎన్నికల ముందు సిమెంట్ ధర రూ.200/- ఉంది, కానీ ఇప్పుడు అది రూ.320/- ఉన్న సంగతి అందరికీ తెలుసు. ఇది అందరికీ అవసరమైనది. ఒకవ్యక్తి తప్పు చేస్తున్నాడని నేను చెప్పడం లేదు. కానీ ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. ఎవరైతే ఈ మాఫియాలు, ముఠాలు ఉన్నారో వాళ్లని లేకుండా చేయండి. స్థానిక నాయకులు, స్థానిక ఎం.ఎల్.ఎ లు కలిసి ఈ పనులన్నీ చేస్తున్నారు. దయచేసి వాళ్లని కంట్రోల్ చేయండి. ఎవరికైతే నిజంగా అవసరం ఉందో వాళ్లకి తక్కువ రేటుకి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోమని మీద్వారా తెలియజేస్తున్నాను సార్.

శ్రీ బి. చంగల్ రాయుడు (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, ఇప్పుడే గౌరవ సభ్యులు శ్రీ బాలసుబ్రహ్మణ్యం గారు అన్నట్లు ఈ ఇసుక గురించి వివరంగా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. నేను మా ఎల్.ఓ.పి గారి ద్వారా ఇసుక మీద లఘు చర్చను తీసుకోమని కోరడం జరిగింది. ఏ జిల్లా పరిషత్తుకు వెళ్లినా కూడా ఈ విషయం మీదనే చర్చ జరుగుతోంది. మొదటినుండి మీ ప్రైమరీ స్టాండ్ ఏమిటంటే క్రింది స్థాయినుండి మాట్లాడుకుంటూ రండి, ఎక్కడా పరిష్కారం కాకపోతే ఇక్కడ మాట్లాడండి అని చెప్పారు. మీరు చెప్పిన దానిబట్టి మేము మండల పరిషత్తులో మాట్లాడాము, జిల్లా స్థాయిలో మాట్లాడాము, ఇక్కడ కూడా మాట్లాడుతున్నాము. కాబట్టి కొంత సమయం ఇవ్వాల్సిందిగా కోరుతున్నాము.

మిస్టర్ ఛైర్మన్ : ఇది చాలా ముఖ్యమైన విషయం. All members are agitating on this. ఇది ప్రశ్నోత్తరాల సమయం. నిన్న రెండు ప్రశ్నలు left over, without answer, postpone చేశాము. అందువల్ల It is an important and sensible subject. Hence, I request the Minister to have a discussion with Floor Leaders and other Members who are interested and come to one conclusion. అంతేగాని ఇక్కడ డిస్కషన్‌లో అయ్యేది కాదుగదా! పద్మరాజు గారు చెప్పిందే మీరు చెప్పబోతున్నారు, జానీగారు చెప్తారు, తర్వాత లక్ష్మణరావు గారు చెప్తారు. జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీలో కూడా డిస్కషన్ జరిగినప్పటికీ ఫలితం కనబడలేదంటున్నారు. Hence, before the Session concludes, you (addressing the Minister) have a meeting with the Members sometime in the afternoon.

శ్రీ బి. చంగల్ రాయుడు : సామాన్యుడు ఇల్లు కట్టుకోవడానికి ఇసుక కొనాలంటే ఒక ట్రాక్టరు ఇసుక ఖరీదు రూ. 2000/-. క్యూబిక్ మీటర్ రూ. 650/-, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు రూ. 30/- అని మేడంగారి ఫొటో, ముఖ్యమంత్రిగారి ఫొటోలతో పెద్ద అడ్వర్టయిజ్‌మెంట్ ఇచ్చారు. రూ.5,200/- పడుతోంది. ఏట్లో దొరికే ఇసుకకు అంత ఖరీదా సార్? సామాన్యుడు ఇళ్లు కట్టుకోవడానికి అంతరేటు పెట్టి ఇసుక కొనాలా సార్?

MR. CHAIRMAN: Changal Rayudu garu, we can't discuss all these things on the Floor of the House, that too during the Question Hour. I requested the Minister…

శ్రీ బి. చంగల్ రాయుడు : జీ.ఓ విడుదల చేసింది ఎవరు సార్? జీ.ఓ నెంబరు 65 చూడండి సార్.

MR. CHAIRMAN: Anyway, I will close the Question Hour at 11 O' clock and I will not allow any further, not even a minute.

శ్రీ బి. చంగల్ రాయుడు : జీ.ఓ నంబరు 65 లో స్పష్టంగా 25 శాతం మహిళా సాధికారతకు, మిగతా 75 శాతం రైతు సాధికారతకు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. నెలకు రెండు లక్షల క్యూసెక్కులు అమ్మాలని, కొలతలలో వేస్తే నష్టం వస్తోందని, తూకంలో వేద్దామని ఆలోచన చేస్తున్నారని ఈ మధ్య పేపర్‌లో చదివాము. దయచేసి ఇసుకను అమ్ముకునే స్థితికి దిగజార్చొద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : ఈ ఎడ్లబండ్ల ద్వారా ఇసుక రవాణా చేసే సందర్భంలో ఒకొక్క ట్రిప్‌కు రూ. 600/- చేశారు. ఎడ్లబండ్లు నడిపేవాళ్లంతా చాలా సాధారణమైన వారు. నెల్లూరులో దాదాపు 1800 బండ్లు గత వారం రోజులుగా సమ్మె చేస్తూ సరఫరాని ఆపేశారు. అది పెద్ద ఇష్యు అయ్యింది. దాదాపు అన్ని పార్టీలు కూడా వాళ్ల వద్దకు వెళ్లి సమర్థించాయి. జిల్లా పరిషత్తు జనరల్ బాడీ మీటింగులో కూడా ఈ విషయం చర్చకు వచ్చి అసెంబ్లీ, కౌన్సిల్‌లో మీరు మాట్లాడండి అని మాకు ఒక రకంగా ఆదేశాలు ఇచ్చారు సార్.

MR CHAIRMAN: Why don't you come with a suggestion by way of Calling Attention, Statement or Short Discussion. Nobody proposed this item in the BAC also. ఇక్కడే అన్నీ రెయిజ్ చేస్తారు.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : ఈ ఎడ్ల బండ్ల మీద దానిని తొలగిస్తారా అని అడుగుతున్నాము, రెండవది స్థానిక సంస్థలకు ఇసుక వలన గతంలో ఆదాయం వచ్చేది. దీనివల్ల ఆదాయం పూర్తిగా పోవడం వలన స్థానిక సంస్థలు చాలా ఆవేదన పడుతున్నాయి. స్థానిక సంస్థలకు సెస్‌ల రూపంలోనో మరో రూపంలో ఏదైనా వాటా ఇస్తారా అని అడుగుతున్నాము. మిగిలిన సభ్యులు అడిగింది కూడా నూటికి నూరుపాళ్లు ఏకీభవిస్తూ వాటికి కూడా సమాధానం ఇవ్వాల్సిందిగా మీద్వారా కోరుతున్నాను.

శ్రీ కె.యస్. లక్ష్మణరావు (ఉపాధ్యాయ నియోజకవర్గం, కృష్ణా, గుంటూరు) : అధ్యక్షా, మంత్రిగారు గుంటూరు జిల్లా గురించి ప్రస్తావించారు. డ్వాక్రా మహిళలది వచ్చిన తరువాత అక్కడ ఇసుక మాఫియా బాగా శక్తిమంతం అయ్యింది. ఆ ఇసుక మాఫియా ప్రధాన రాజకీయ పార్టీలన్నింటితో సమానం. ఈ మాట అన్నందుకు క్షమించాలి. వాళ్లు ఈ డ్వాక్రా మహిళలను బెదిరిస్తున్నారు, వాళ్లు అక్కడ లేకుండా చేస్తున్నారు. అందుకని ఇసుక మాఫియాని అరికట్టడానికి, నియంత్రించడానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటని మీద్వారా అడుగుతున్నాను.

MR CHAIRMAN: That is why I requested the Minister to have a meeting with all of you.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలలో భవన నిర్మాణ కార్మిక సంఘాలవాళ్లు అన్ని జిల్లా కలెక్టర్ల ఆఫీసులను ముట్టడిస్తున్నారు. ఇసుక తగినంతగా లభించక పని దొరకని పరిస్థితుల గురించి ధర్నాలు చేసి, మెమొరండాలు ఇచ్చి మినిస్టర్ గారికి కూడా ఒక రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. మంత్రిగారు చెప్పిన మాక్స్ కమిటీలో ఈ భవన నిర్మాణ కార్మికులను తీసుకునే అవకాశం కల్పిస్తారా? రెండవది గతంలో రూ. 3,000/- కు దొరుకుతున్న ఇసుక, ఇప్పుడు డ్వాక్రా సంఘాల ద్వారా ప్రభుత్వం వాళ్లు ట్రాన్స్‌పోర్టు చార్జీలు అన్నీ కలుపుకుని దాదాపు రూ. 6,000/- ఒక లారీ కింద ఖర్చవుతోంది. సొంతంగా ఇళ్లు కట్టుకునే వాళ్లకి ఇది

చాలా దుర్భరమైనది కాబట్టి ఆ రేటుని పునఃసమీక్షించి అందరికీ అందుబాటులో ఉండేందుకు తగ్గించేందుకు ప్రయత్నం చేస్తారా? దయచేసి మంత్రిగారు సమాధానం చెప్పాలని కోరుతున్నాము.

ఉ. 10.20

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, మంత్రివర్యులు మహిళలకు ప్రాముఖ్యతనిచ్చి, వారి అభ్యున్నతి కోసం ఇసుక రీచ్‌లు మాకివ్వమని చెప్పడం జరుగుతోంది. అయితే, మీ ద్వారా అడిగేదేమిటంటే – ఇవి ఏ ప్రాతిపదికన మహిళా సంఘాలకు ఇచ్చారు? కొన్ని మార్గదర్శకాల ద్వారా మహిళలకు ఇచ్చారనే వార్తలను మేము కొన్ని పత్రికలలో చూశాము. ఆ మార్గ దర్శకాల్లో బీసీలు ఎక్కువగా ఉండాలని, అనుభవజ్ఞులై ఉండాలని, అలాగే బ్యాంకు ట్రాన్సాక్షన్సు సరిగ్గా చేశారా, లేదా అనే మార్గదర్శకాలతో మహిళా సంఘాలను ఎంపిక చేస్తున్నామని, వాట న్నింటినీ ప్రక్కకు పెట్టి, అక్కడ స్థానిక నాయకులు ఎవరైతే ఉన్నారో, వారి పలుకుబడి మీద మహిళా సంఘాలను ఎంపిక చేయడమే తప్ప, మహిళలందరికీ ఇచ్చిన దాఖలాలు లేవని తమ ద్వారా ప్రభు త్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇక రెండవ విషయమేమంటే – ఇసుకకు సంబంధించి ఒక లారీ ఇసుకకు ఈ–సేవ ద్వారా రూ.2,000ల చలాన్ తీసుకు రమ్మనిచెప్పి, ఆ రశీదు ద్వారా తరచూ లారీలకు లారీల లోడ్లు బయ టకు వెళుతున్నాయి. కాబట్టి, వీటి మీద నిఘా పెట్టి, అక్రమ రవాణాని అదుపు చేయగలరా, లేదా అని తమ ద్వారా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. మహిళా సంఘాలకు సంబంధించి అర్ధరాత్రి పూట పోలీసులు వచ్చి పట్టుకున్నారనే సంఘటనలు అరకొరగా జరిగితే జరిగి ఉండొచ్చు. కానీ, చాలావరకూ మహిళా సంఘాల వారు ఉదయం 8.00 గంటలకు వస్తున్నారు. అందుకు సంబంధించిన నాయకురాళ్ళు రాత్రి 8.00 గంటలకు వెళ్ళిపోతున్నారు. అలాగే ఇసుక లారీలకు సంబంధించి రూ. 2,000/–ల చలానాతోనే అనేక లోడ్ల ఇసుక రవాణా జరుగుతోందనే విషయాన్ని తమ ద్వారా గౌరవ మంత్రిగారికి తెలియజేస్తున్నాను. ఆ విధంగా జరిగే అక్రమ రవాణాని అరికడ తారా, లేదా అనే విషయంలో మంత్రిగారు సమాధానం చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ డి.వి. సూర్యనారాయణ రాజు (స్థానిక సంస్థలు, విశాఖపట్టణం): అధ్యక్షా, 25 శాతం మహిళలకు, మిగిలిన 75 శాతం రైతుల ఋణమాఫీకి ఖర్చు పెడతామని జీఓలో ఉంది. ఇంతకు ముందు ఉన్న నిబంధనల ప్రకారం, రాజ్యాంగం ప్రకారం ఇసుక రీచ్‌ల వేలం ద్వారా వచ్చే ఆదాయమంతా స్థానిక సంస్థలకు, 20 శాతం గ్రామ పంచాయితీలకు, 50 శాతం మండల పరిషత్తు లకు, మిగిలినది జిల్లా పరిషత్తులకి వెళ్ళాలి. ఆ నిబంధనలను ఏం చేశారు? ఆ నిబంధనలను తీసే యడానికి మీకు ఏమైనా అధికారం ఉందా? స్థానిక సంస్థలను పూర్తిగా నాశనం చేసి, ఈ రోజు మేము మహిళలకు ఇస్తున్నాము, లేకపోతే ఋణ మాఫీకి ఇస్తున్నామని చెప్పడం ఎంత వరకు సబబు అని మీ ద్వారా నేను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను.

శ్రీమతి పీతల సుజాత: అధ్యక్షా, ఇసుక రీచుల వేలానికి సంబంధించిన అంశాలను గౌరవ సభ్యులు వివరంగా చెప్పాలని కోరారు. కాబట్టి, తప్పకుండా చెబుతాము. దాదాపుగా రాష్ట్రంలో 188 ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వాటిల్లో 45 రీచ్‌లను గుర్తించడం జరిగింది. మనకు అందుబాటులో

ఉన్న ఇసుక వివరాలు పరిశీలిస్తే, సుమారు 1,59,77,500 క్యూబిక్ మీటర్లు ఇసుక అందుబాటులో ఉన్నది. ఇప్పటివరకూ 13,43,472 క్యూబిక్ మీటర్ల ఇసుక ఖర్చయింది. 19వ తారీఖు వరకు ఇసుక అమ్మడం వలన సుమారు రూ.85,67,92,082.00లు మనకు రావడం జరిగింది. అలాగే ట్రాన్స్‌పోర్టేషన్ ఛార్జెస్ సుమారు రూ.3,44,214లు రావడం జరిగింది. వెరసి రూ.89,11,94,064లు నిన్నటి వరకూ వచ్చింది.

అయితే, ఇప్పుడు ఎడ్ల బండి ద్వారా జరిగే ఇసుక రవాణాని గురించి అడిగారు, తప్ప కుండా దానిని పరిశీలిస్తాము. ఇసుకను అమ్ముకుంటున్నామని గౌరవ సభ్యులు శ్రీ బి. చంగల్ రాయుడు గారు అన్నారు. ఇసుకను దేనికి అమ్ముతున్నామంటే – గతంలో ఈ ఇసుకను ఇష్టారా జ్యంగా రవాణా చేశారు. సామాన్యుల అవసరాలకి ఇసుక అందుబాటులో లేకుండాపోయి, మాఫి యాకు అనుకూలంగా మారి, వారి స్వంత లాభం కోసం ఇదంతా చేసుకున్నారే తప్ప, గత ప్రభుత్వా నికి ఆదాయాన్ని ఎక్కడా రానివ్వలేదు. దానిని అరికట్టాలని ఇప్పుడు మహిళా సభ్యులకు ఒక కమిట్ మెంటుతో ఇసుక రీచులను అప్పగించడం జరిగింది. వారు చిత్తశుద్ధితో పనిచేయడమే కాకుండా, వారికి కూడా పని కల్పించినట్లవుతుందనే ఉద్దేశ్యంతో ఇదంతా చేశాము. అలాగే, మహిళా సాధికా రతను సాధించే దిశలో ఈ ప్రభుత్వం ఉంటుంది కాబట్టి, వారికి ఇసుక రీచులను ఇవ్వడం వలన వారు కూడా సంపాదించుకుని గౌరవంగా కుటుంబాన్ని నడిపించుకోగలరని, సంతోషంగా ఒక్క రూపాయైనా తమ కుటుంబానికి ఖర్చు పెట్టుకోగలరనే ఆలోచనతో ముఖ్యమంత్రిగారు ఈ పని చేశారు. మేము కూడా దానిని ఆచరిస్తూ, అందరం పనిచేస్తున్నాం.

ఉదాహరణకు మనం వరి పంటను పండిస్తున్నామంటే, దానికి వచ్చే మద్దతు ధరకే అమ్ము తున్నాము. అలాగే ఇసుకకు సంబంధించి అది ఎవరి వ్యక్తిగతం కాదు, ప్రభుత్వానిదే. ఇసుక మీద వచ్చే లాభాలన్నీ మహిళా సంఘాల వాళ్లకే వెళ్లిపోతుంది. కాబట్టి ప్రభుత్వం ఎక్కడా వాళ్ళు కష్టపడిన డబ్బులను స్వంత ప్రయోజనాలకు తీసుకోదు. దీనిని రాష్ట్రంలో ఉన్న మహిళా సంఘాల వాళ్లు పంచుకుంటారు.

అలాగే, స్థానిక సంస్థలకు సంబంధించి జిల్లా పరిషత్తులలో చాలా అవకవతకలు జరుగుతున్నాయని అన్నారు. మొదట్లో ఇసుక సమస్య వచ్చిన మాట వాస్తవం. దానిని మేం కూడా ఒప్పుకుంటున్నాము. అందులో మేమేమీ అబద్ధం చెప్పడం లేదు. కానీ, మేము ఒక కొత్త పాలసీని తీసుకువచ్చాము. దానిని రోజు రోజుకు బలోపేతం చేసుకుంటూ, సమస్యను కొంతవరకు అధిగ మించాము. మేము వందశాతం ఇసుక మాఫియాని అరికట్టామని చెప్పడం లేదు. చాలా వరకూ మేము న్యాయం చేస్తూ వెళుతున్నాం. ఇంకా కొన్ని రోజుల్లో దానిని స్ట్రీమ్‌లైన్ చేసి, మేము అను కున్న లక్ష్యం దిశగా ముందుకు వెళతామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. అంతేగాకుండా, వీటిల్లో కూడా చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి, వాటిని అధిగమించుకుంటూ ముందుకు వెళుతున్నామని చెపుతున్నామే తప్ప, వంద శాతం ఇసుక సమస్యలు లేవని మాత్రం చెప్పడం లేదు.

ఇసుక రీచుల వ్యవహారానికి సంబంధించి, ఇప్పటివరకూ మహిళా సంఘాల వారు బాగా పని చేస్తున్నారు. అదేవిధంగా, వినియోగదారులను కూడా దృష్టిలో పెట్టుకుని, ఇసుక ధర గురించి కూడా ఆలోచిస్తాము. ఎందుకంటే, డిమాండుకు తగ్గ సప్లయ్ ఉంటే మాక్కూడా చాలా సమస్యలు

పరిష్కారమవుతాయి. అంతేగాకుండా, మిగిలి ఉన్న ఇసుక రీచ్ లను కూడా గుర్తించడం వలన ఇసుక సమస్యలు తగ్గడానికి అవకాశం ఉంటుంది. మరికొన్ని రీచ్‌లకు అనుమతులు వచ్చేవి ఉన్నాయి కాబట్టి, అవి వచ్చిన తరువాత ఇసుక మరింత లభ్యం కావడానికి ఆస్కారం ఉంది.

అదేవిధంగా జిల్లాపరిషత్తులలో సీనరేజికి సంబంధించిన ప్రశ్నను గౌరవ సభ్యులు అడిగారు. మహిళా సంఘాలకు ఇచ్చిన దానిలోనే ఇది కూడా ఇన్‌క్లూడ్ అయిందనే విషయం తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. అందులోనే వారికి వచ్చే సీనరేజెస్ కూడా ఇస్తున్నాము. ఇప్పుడు వే బిల్సు ఏవైతే కట్టించుకుంటున్నామో, వాటిని డిపిఓకు ఇచ్చాము. డిపిఓకు వే బిల్సు అన్నీ కడితే తప్ప, లారీలు, ట్రక్కులతో ఇసుక తోలే అవకాశం ఉండదు. కాబట్టి, సీనరే జెస్‌కు సంబంధించి ఏ జిల్లాకు వచ్చే సీనరేజెస్ ఆ జిల్లాకు ఇచ్చివేయడం జరుగుతుందని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఒక క్యూబిక్ మీటరు ఇసుకకు సంబంధించిన చలానాలోనే మిగిలిన వాటిని కూడా తీసుకు వెళుతున్నారని సభ్యులు అన్నారు. అవి మా దృష్టికి రాలేదు. గౌరవ సభ్యులందరూ సహకరించి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే, వాటిని పరిశీలిస్తామని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అలాగే ఎవరైనా వ్యక్తి గురించి మాఫియాకు, అక్రమాలకు పాల్పడుతున్నారని ఎవరైనా సభ్యులు తెలియజేస్తే వాటిని కూడా తప్పకుండా పరిష్కరించి తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేస్తూ, దానికందరూ సహకరించాలని కోరుకుంటున్నాను. అలాగే, ఎడ్ల బండ్ల గురించి కూడా గౌరవ సభ్యులు అడిగారు, వాటిని కూడా మేము పరిశీలించి ముందుకు వెళతామని సభాముఖంగా తెలియజేస్తున్నాను. ప్రతి క్యూబిక్ మీటరు ఇసుక త్రవ్వినప్పుడల్లా మహిళా సభ్యులు ఎవరైతే ఉన్నారో, ఆ గ్రూపులో ఉన్న వారికి రూ.5/- చొప్పున ప్రోత్సాహకం క్రింద వెళ్ళిపోతాయి. ఆ సంఘాలకు ఏదైతే ఎక్స్‌పెండిచర్ క్రింద పెడుతున్నామో, అదింకా తగ్గించుకుని చేస్తే వారికి మరిన్ని లాభాలు వస్తాయి. దానిని బట్టి గౌరవ సభ్యులు మరింత వివరంగా ప్రశ్నలు వేసినట్లయితే, తప్పకుండా తదుపరి ప్రశ్నలకు మరింత వివరంగా సమాధానం చెబుతాను. సిసి కెమెరాలు మొదలైనవన్నీ పెట్టి, ఎవరికైతే నిజంగా ఇసుక అవసరమో, చలానాలు తదితర వివరాల ఆధారంగా అందరికీ అందుబాటులో ఇసుక ఉండేలా తగిన చర్యలు తీసుకుంటాము. ఇసుక సమస్యలను రోజు రోజుకు అధిగమిస్తున్నాము కనుక ఏ అంశాలైనా గౌరవ సభ్యుల దృష్టికి వచ్చినట్లయితే, అవి మా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా ఎటువంటి అవకతవకలకు, అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పరంగా పనిచేసి, తప్పకుండా పరిశీలిస్తామని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

ఇసుకకు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు ఏవైతే ఉన్నాయో, వాటిని తప్పకుండా పరిశీలిస్తాము. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రజలకు ఇసుకను అందించాలనేది ప్రభుత్వ సంకల్పం. అంతేగాకుండా, ఇసుక ధరను కూడా తగ్గించే ప్రయత్నం చేస్తామని తమ ద్వారా సభాముఖంగా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. అలాగే, భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సమస్యలను కూడా మేము పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఉ. 10.30

మిస్టర్ ఛైర్మన్‌ః అమ్మా, సభ్యులు మళ్లీ సప్లిమెంటరీలు అడగకుండా సమాధానం చెప్పారు. హాఫ్ ఏన్ అవర్ డిస్కషన్ అయ్యింది. కేవలం ఒక్క ప్రశ్నకు సంబంధించి ఉ.10.00 నుండి 10.30 వరకు చర్చ జరిగింది.

శ్రీ సి. రామచంద్రయ్య (శాసనసభ నియోజకవర్గం) ః అధ్యక్షా, మీ అభిప్రాయంలో ఎవ్వరూ సప్లిమెంటరీలు అడగవద్దనా?

మిస్టర్ ఛైర్మన్‌ః మంత్రి గారు, ఇంత వివరంగా చెప్పాక, ఇంకా సప్లిమెంటరీలు ఏం అడుగుతారండీ? We will go into next question.

## విగ్రహాల ఏర్పాటు

ప్రశ్న నెం. 7786(24)
శ్రీ అంగర రామమోహన్, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) విగ్రహాలను నెలకొల్పడం కోసం మార్గదర్శకాలను సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల వాహన రాకపోకలు స్తంభించిపోతున్న విషయం వాస్తవమేనా?
ఆ) విగ్రహాలను అక్రమంగా నెలకొల్పడంపై అపెక్స్ కోర్టు తీర్పును వెలువరించిందా?
ఇ) అయితే, దీనిపై తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి (శ్రీ సిద్ధా రాఘవ రావు)ః

అ) అవునండీ, విగ్రహాలు నెలకొల్పడం కోసం మార్గదర్శకాలను సక్రమంగా అమలు చేయకపోవడం వలన వాహనాల రాకపోకలు కొన్ని ప్రదేశాలలో స్తంభించి పోవడం జరుగుతున్నది.
ఆ) అవునండీ.
ఇ) ఎస్ఎల్‌పి(సి) నెం.8519/2006లో 18-01-2013 తేదీగల భారత సుప్రీం కోర్టు ఉత్తరువును పురస్కరించుకొని పబ్లిక్ రోడ్లు, పేవ్‌మెంట్లు, సైడ్‌వేలు, ఇతర ప్రజా వినియోగ ప్రదేశాలలో ఏదేని విగ్రహాన్ని నెలకొల్పడం లేదా ఏదేని కట్టడాన్ని నిర్మించడం కోసం అనుమతిని ఇవ్వవద్దని 18-02-2013 తేదీగల టిఆర్ & బి (ఆర్.1) శాఖ జి.ఓ.ఎం.ఎస్.నెం.18లో ఉత్తరువులు జారీచేయడమయింది.

శ్రీ అంగర రామ మోహన్ (స్థానిక సంస్థలు, పశ్చిమగోదావరి)ః అధ్యక్షా, ఇన్ని నిబంధనలున్నప్పటికీ ఈ విగ్రహాలు ఎక్కడపడితే అక్కడ పెట్టేస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే స్థానాల్లో కూడా పెద్ద ఎత్తున విగ్రహాలు పెడుతున్నారు. హైకోర్టు కూడా ఈ విధంగా పెట్టే విగ్రహాలు

ప్రజలకు గుదిబండగా తయారు కాకూడదని హెచ్చరించడం జరిగింది. విగ్రహాన్ని పెట్టేశాక దీని గురించి ఆలోచించడం సరి కాదు. గుంటూరులో విగ్రహాలు పెట్టడం మీద హైకోర్టు వ్యాఖ్యానం చేసింది. తుళ్లూరులో డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహం పెడితే, ఈ విధంగా విగ్రహాలు ఎక్కడపడితే అక్కడ అనుమతులు లేకుండా పెట్టడమనేది అభ్యంతరకరమని హైకోర్టు వ్యాఖ్యానించడం జరిగింది. ఈ విధంగా ఎక్కడ పడితే అక్కడ విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందిపడుతున్నారు. ట్రాఫిక్‌కు కూడా ఇబ్బంది అవుతోంది. విలువైన భూముల మధ్యలో కూడా విగ్రహాలు పెట్టడం వల్ల ప్రజలకు ఉపయోగపడే భూములన్నీ నిరుపయోగమౌతున్నాయి. అందుచేత, ఎక్కడపడితే అక్కడ విగ్రహాలు పెట్టకుండా చర్యలు తీసుకోవడం మంచిది. విగ్రహాలు పెట్టాక వాటిని తొలగించాలంటే, రాజకీయం బయల్దేరుతోంది. దాని మీద తరచూ గొడవలు కూడా బయలుదేరుతున్నాయి. కాబట్టి, ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు ముందే జాగ్రత్తలు తీసుకోవాలని, ఉదాసీనతతో వ్యవహరించకూడదని మీ ద్వారా గౌరవ మంత్రివర్యులకు తెలియజేస్తున్నాను.

డా. బచల పుల్లయ్య (ఉపాధ్యాయ నియోజకవర్గం, కడప, అనంతపురం, కర్నూలు): అధ్యక్షా, కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ వాటిని అమలుపరచవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. మంత్రి గారు చెప్పిన సమాధానం ప్రకారం ప్రస్తుతం వాస్తవాలు ఆ విధంగా ఉన్నాయి. కాబట్టి, అనుమతి లేకుండా ఇప్పటికే ఏర్పాటు చేసిన విగ్రహాల సంఖ్య ఏమన్నా మంత్రి గారు తెలియజేస్తారా? వాటి మీద చర్యలేమన్నా తీసుకుంటారా? అనేది తెలియజేయాల్సిందిగా మంత్రి గారిని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ సిద్ధా రాఘవరావు: అధ్యక్షా, వాస్తవానికి సుప్రీంకోర్టు వారి డైరెక్షన్స్ ప్రకారం కొన్ని ఏరియాల్లో విగ్రహాలు పెట్టకూడదని రిస్ట్రిక్షన్స్ చేస్తూ జడ్జిమెంట్ ఇవ్వడం జరిగింది. కానీ, గౌరవ సభ్యులు డా. బచల పుల్లయ్య గారు చెప్పినట్టు ఈ మధ్యకాలంలో అక్కడక్కడా టౌన్స్‌లో గానీ, విలేజెస్‌లో గానీ రూల్స్‌కు వ్యతిరేకంగా విగ్రహావిష్కరణలు చేయడం జరిగింది. మేము అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు అవుతోంది. తప్పకుండా వాటిని పరిశీలించి, ఏ విధంగా చర్యలు తీసుకోవాలో ఆలోచించి ముందుకు వెళతాము. విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి వాస్తవానికి కలెక్టర్ల నేతృత్వంలో ఒక కమిటీ పనిచేస్తోంది. కలెక్టర్ గారి అనుమతి తీసుకుని, వాటి విషయంలో నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముంది. అయితే, రూల్స్‌కి వ్యతిరేకంగా కొన్ని విగ్రహావిష్కరణలు జరిగిన మాట వాస్తవం. మున్ముందు అటువంటివి జరగకుండా చర్యలు తీసుకోవడం, లోగడ పెట్టిన విగ్రహాల గురించి కూడా ఆలోచించి, ఏ విధంగా చర్యలు తీసుకోవాలో నిర్ణయం తీసుకుని, ముందుకు వెళతామని సభాముఖంగా తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్: విగ్రహాలు పెట్టే విషయంలో పర్మిషన్ ఇచ్చే స్టేజ్‌లోనే కొంచెం జాగ్రత్తలు తీసుకోవాలి.

శ్రీ సిద్ధా రాఘవరావు: ఓకె సార్.

శ్రీ సి. రామ చంద్రయ్య: ప్రభుత్వానికి ఇంక ఆ అవకాశం కూడా లేదు సార్. ఇప్పటికే ఉన్న అన్ని కూడళ్లలో విగ్రహాలు వచ్చేశాయి. నాకు తెలిసి పర్మిషన్లు ఇవ్వమని ఇంకెవ్వరూ దరఖాస్తులు పెట్టరు.

## రహదార్లపై ప్రమాదాలు

ప్రశ్న నెం. 7625(25)
శ్రీ మేకా శేషుబాబు, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ప్రమాదాలను తగ్గించడం కోసం రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించడానికి ఏవైనా ప్రతిపాదనలు ఉన్నాయా ?

ఆ) రోడ్డు ప్రమాదాలపై ప్రజలలో అవగాహన కల్పించటానికి తీసుకున్న చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి (శ్రీ సిద్ధా రాఘవరావు):

అ) అవునండీ, 2014, ఆగష్టు 5వ తేదీగల కేంద్ర ప్రభుత్వ ప్రకటన నెం. 1197(ఇ) ప్రకారంగా రోడ్లపై వెళ్లే వివిధ రకాల వాహనాల కోసం ఇప్పటికే వేగ పరిమితులను నిర్ణయించడమయింది.

ఆ) రోడ్డు ప్రమాదాలపై ప్రజలలో అవగాహన కల్పించడం కోసం ఈ క్రింది చర్యలను తీసుకోవడమయింది:

1. జాతీయ స్థాయి కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో రోడ్డు భద్రతా వారాన్ని నిర్వహించడమయింది.
2. రాష్ట్రమంతటా ప్రతి త్రైమాసికంలో 3 రోజులు రోడ్డు భద్రతా డ్రైవ్‌ను నిర్వహించడానికి ఒక ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టడమయింది.
3. ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభంలో పాఠశాల బస్సులను తనిఖీ చేయడమవుతున్నది. రోడ్డుపై వెళ్లే పిల్లల భద్రతపై పాఠశాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడమవుతున్నది.
4. డ్రైవింగ్ నేర్చుకునే వారు, విద్యార్థులు, రవాణయేతర, రవాణా వాహనాల డ్రైవర్లకు, విద్యా సంస్థల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహనను కల్పించడానికి 22-07-2014 తేదీన ఒక ప్రత్యేక రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించడమైనది.
5. ఈరోజు వరకు రాష్ట్రంలో 40,165 మంది వద్యార్థులు, 8,861 మంది పాఠశాల బస్సు డ్రైవర్లు, 1,27,641 మంది ఇతర డ్రైవర్లకు వర్తింపచేస్తూ రోడ్డు భద్రతా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడమయింది.
6. రాష్ట్రంలోని 243 పట్టణాలు / గ్రామాలలో రోడ్డు భద్రతా అవగాహన శిబిరాలను నిర్వహించడమయింది.
7. ఈ శిక్షణా కార్యక్రమాన్ని, అవగాహన శిబిరాలను కొనసాగించాలని రవాణా శాఖను ఆదేశించడమయింది.
8. రోడ్డు భద్రతకు సంబంధించి మద్యం సేవించి డ్రైవింగు చేయడం, సీటు బెల్టు లేకుండా బండి నడవడం, సరుకులు, ప్రయాణికుల వాహనాలను మితిమీరిన బరువులో డ్రైవింగు చేయడం వంటి 11 నేరాలపై దృష్టి సారించడానికి ప్రతి జిల్లాలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడమయింది. ఈ రోజు వరకు ఈ 11 నేరాలకు సంబంధించి రవాణా శాఖ అధికారులు రాష్ట్రమంతతా 52,371 కేసులను నమోదు చేశారు.

9. ప్రతి జిల్లాలో ప్రత్యేకించి వేగాన్ని, మద్యం సేవించి బండి నడపడాన్ని తనిఖీ చేయడం కోసం ఒక ఎంవిఐ/ఎఎంవిఐని నియమించడమయింది.

శ్రీ మేకా శేషుబాబు (స్థానిక సంస్థలు, పశ్చిమగోదావరి) : అధ్యక్షా, ఈ రోజున జనాభా సంఖ్య విపరీతంగా పెరిగింది. దానికి అనుగుణంగా వాహనాల సంఖ్య కూడా పెరిగింది. అటువంటి పరిస్థితుల్లో ప్రమాదాలు చాలా ఎక్కువ సంఖ్యలో జరుగుతున్నాయి. ఆర్ అండ్ బి రోడ్లు ఎక్కడెక్కడైతే ఉన్నాయో, సరైన రోడ్లు లేక, అధిక వర్షాలకు రోడ్లు పాడవడం వల్ల గానీ, ట్రాఫిక్ అంతరాయం వల్ల గానీ ఇబ్బందులు ఎదురౌతున్నాయి. అటువంటి పరిస్థితుల్లో ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాల్సిందిగా తెలియజేస్తున్నాము. రోడ్ల వెడల్పు చేయడానికి ప్రభుత్వం వద్ద ఏమైనా ప్రతిపాదనలున్నాయా? ఎందుకంటే, ఒక నియోజకవర్గం నుండి ఇంకో నియోజకవర్గంలోకి వెళ్లాలన్నా, రోడ్ల వెడల్పు లేని కారణంగా ప్రయాణాలు కూడా చేసే పరిస్థితి లేదు. కాబట్టి, దీని గురించి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాల్సిందిగా మనవి చేస్తున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, గత ప్రభుత్వం, గత శాసన మండలి సమావేశాల్లో బకింగ్ హామ్ కాలువపైన..

శ్రీ సింగం బసవ పున్నయ్య (శాసనసభ నియోజకవర్గం): మీకు ఇంకా గత ప్రభుత్వం అన్న మాట పోవడం లేదు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: బసవ పున్నయ్యగారూ, గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్లనే ఇవన్నీ జరుగుతున్నాయని చెప్పబోతున్నాను.

మిస్టర్ ఛైర్మన్: పున్నయ్య గారూ, మీరొచ్చారు. నేను నోటీస్ చేశాను. You are there. I have noticed your presence.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, చింత చచ్చినా పులుపు చావలేదు అంటారు. ఇదే.

శ్రీ సి. రామ చంద్రయ్య: అమ్మా, పదేళ్లు మీకు చచ్చిందే, మాకిప్పుడు చచ్చింది. ఆ విషయం ఇప్పుడెందుకు?

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, గత శాసన మండలి సమావేశాల్లో మంత్రి గారికి మీ సమక్షంలో ఆ రోజునే చెప్పాను. బకింగ్ హామ్ కెనాల్‌పైన, చాలా యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. ఆ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరాను. నేటికీ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. ఇంకా ఆ రోడ్డు పనులు మొదలు కాలేదు. నేను మాట్లాడిన తరువాత కొన్ని రోజులకు, తెనాలికి సంబంధించిన ఒక డాక్టరు కారుతో సహా బకింగ్ హామ్ కెనాల్లో పడిపోయి అదృశ్యమైన ఘటన పేపర్లలోనూ, టీవీల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా ప్రసారమయ్యింది. ఆయన కోసం అంతా వెదికారు. అనుమానం వచ్చి, మూడు రోజుల పాటు బకింగ్‌హామ్ కెనాల్లో నీళ్లని తగ్గించడం జరిగింది. అప్పుడు కారు బయటపడింది. కారు నుండి డోర్లు తెరుచుకుని, ఆ డాక్టరు దేహం చెట్లకు వేలాడుతూ కనపడింది. ఆయనొక మంచి డాక్టరు.

ఇట్లా చాలా సంఘటనలు జరిగాయి. అంటే ఒక డాక్టరైతేనో, ఒక రాజకీయ నాయకుడైతేనో, పలుకుబడి ఉన్న వాడైతేనో పేపర్లలోను, టీవీల్లోను వార్త బయటకు వస్తోంది. ఏదన్నా, చిన్నా చితకవాళ్లు సైకిల్ మీద నుండి పడినా, ఆటో పోయి పడినా ఆ వార్త మాత్రం వెలుగులోకి రావడం లేదు.

ఇకపోతే, నల్గొండ జిల్లాలో శ్రీ లాల్ జాన్ బాషా గారి దగ్గర నుండి, శ్రీకాకుళం దగ్గర శ్రీ ఎర్రన్నాయుడి గారి దగ్గర నుండి, కర్నూలు జిల్లాలో శ్రీమతి శోభా నాగిరెడ్డి దగ్గర నుండి ఇలా అనేకమంది ప్రముఖులు రోడ్డు ప్రమాదాల బారిన పడ్డారు. మొన్నటికి మొన్న హరికృష్ణ గారబ్బాయి కూడా.

ఉ.10.40 & 10.50

లాల్ జాన్ బాషా గారు, ఎర్రన్నాయుడు గారు, శోభా నాగిరెడ్డి గారు, హరికృష్ణ గారి అబ్బాయి గారు చనిపోయారు. అంతేకాకుండా మా అల్లుడు సతీష్ రెడ్డి కూడా ప్రమాదానికి గురైనా ప్రాణాలను రక్షించుకోవడం జరిగింది. కొత్తగూడ దగ్గర రెండు బ్రిడ్జిలు కట్టారు. అటు ఒక, ఇటు ఒక బ్రిడ్జి వస్తుంది. హయత్‌నగర్ దాటిన తరువాత రామోజీ ఫిల్మ్ సిటీ ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉంటుంది. రాత్రి పూట వచ్చేటప్పుడు వెళ్లేది ఎటో, వచ్చేది ఎటో తెలియకుండా ఉంటుంది అక్కడ. వెళ్లేది ఇటు వైపు, వచ్చేది అటు వైపు అని సూచించే బోర్డులు కాని, మధ్యలో డివైడర్లు కాని ఏమీ లేవు. అక్కడ పట్టపగలు కూడా ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా ఇటువంటి ప్రదేశాలలో వేగాన్ని తగ్గించే దానికి అక్కడ మలుపు ఉన్నది అని తెలిసే విధంగా బోర్డులు పెట్టాలి.

మిస్టర్ ఛైర్మన్ః రాజకుమారి గారూ, ఇటువంటి ఇన్సిడెంట్స్ చాలా ఉన్నాయి. ముందు సప్లిమెంటరీ అడగండి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ః అధ్యక్షా, రోడ్డు ప్రమాదాలలో పెద్ద, పెద్ద వాళ్లు, రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు మొదలైన వారు చనిపోతే మాత్రం వెలుగులోకి వస్తుంది. పబ్లిసిటీ అవుతుంది. కాని, వెలుగులోకి రానటువంటి సామాన్యులు, అతి సామాన్యులు ఎంతోమంది మరణిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం కోసం తగు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా కాలువల ప్రక్కనున్నటువంటి రోడ్లు క్రుంగిపోతున్నాయి. ఆ రోడ్డుకు రెండు వైపుల కూడా బలంగా ఉండే ఐరన్ రాడ్స్‌ను ఏర్పాటు చేయవలసిన అవసరముంది. గోతులను కూడా ఎప్పటికప్పుడు పూడ్చవలసిన అవసరముంది. చాలా చోట్ల పంట పొలాల మధ్య ఉన్న రోడ్డే క్రుంగిపోతున్నప్పుడు ఒక పెద్ద కెనాల్ ప్రక్కన ఉన్నటువంటి రోడ్డు మొత్తం కొట్టుకుపోతుంది. తెనాలి-విజయవాడ రోడ్డునే కాకుండా అనేక ప్రాంతాలలో ఉన్నటువంటి రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కోరుతూ, ఇప్పటి వరకు ఏమి చర్యలు తీసుకున్నారో తెలుపవలసిందిగా మీ ద్వారా అడుగుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్ ః కర్నూలుకు దగ్గరలో ఒక లేడీ తాహశీల్దారు waiting to receive a District Collector and his team during day time. She was standing there on road side. Lorry was ridden on her body. She was treated in NIMS Hospital for four months. దీనిపై నా అభిప్రాయం ఏమిటంటే.. this is a very serious issue and the other day I talked to the Principal Secretary and others also in my Chambers. An Expert Committee needs to be appointed to find out the reasons for the

accidents. ఒక్కొక్కసారి డ్రైవింగ్‌లో కూడా మద్యం తాగి డ్రైవింగ్ చేస్తుంటారు. రోడ్డు పక్కన వైన్ షాపులు ఉంటున్నాయి. జరుగుతున్న ప్రమాదాలను మనం చూస్తున్నాము. వీటిని sort out చేయడానికి ఒక expert committee ను ఏర్పాటు చేయాలి. What is the remedy అనే దానిని కనుక్కోవాలి. ఎక్స్‌పర్ట్ కమిటీవేసి, kindly submit Report to the House. You talk to the others also. There are many defects. There are many causes also for this. They can talk to Members also for their views. ఒక కమిటీని వేసి వాళ్లు ఇచ్చిన రిపోర్టును హౌస్‌కు సబ్మిట్ చేయండి. In the interest of the Public I am telling. I think it is better. I gave a direction also.

శ్రీ సి. రామచంద్రయ్య : అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వ డేటా ప్రకారం ప్రతి నిమిషానికి ఒకరు యాక్సిడెంట్ జరిగి చనిపోతున్నారు. ఇంతకుముందు ఎకనమిక్స్‌లో ఒక థియరీ ఉంది. Malthusian Theory of population అని ఉంది. దాని ప్రకారం యుద్ధాలు, కరవులు వచ్చి పాపులేషన్ చనిపోవడంతో బ్యాలెన్స్ అయిపోతుంది. లేకపోతే ఆహార సరఫరా సరిగా లేక జనాభా బ్యాలెన్స్ అయిపోతుంది. నేచరే అలా చేస్తుందని Malthusian Theory. దానిని మనం ఫాలో అవుతున్నాం.

అధ్యక్షా, యూరోపియన్ దేశాలలో కాని, జపాన్‌లో కాని, అమెరికాలో కాని రోడ్లలో అక్కడక్కడ సెన్సర్స్ ఉంటాయి. వాటి వల్ల ఎంత స్పీడ్‌లో వాహనం వెళుతుందనే దాని గురించి బండి నెంబర్‌తో సహా రికార్డు అవుతుంది. ఎవరైతే designated speed ను మించినారో అప్పుడు స్పీడు రికార్డు అవడం వల్ల యాక్షన్ initiate చేయవచ్చు. దానిని ఇక్కడ కూడా అమలుచేయవచ్చు. ఇప్పుడు మనకు రోడ్లు కూడా బాగున్నాయి. వాహనాలు బాగున్నాయి. కాళ్ల బరువు ఎక్కువైనా సరే స్పీడ్‌గా తొక్కుతున్నారు. వీటిని నిర్మూలించడం చాలా కష్టం కాబట్టి ఏదైనా ఒక innovative type లో దీనికి accountability తీసుకువస్తే తప్ప ఈ యాక్సిడెంట్లు తగ్గవు కాబట్టి ఆ విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సజెస్ట్ చేస్తున్నాను.

MR. CHAIRMAN: Enough is enough. Kindly appoint a Committee Sir.

SRI B. CHANGALRAYUDU: Sir, a word of appreciation to the Minister.

MR. CHAIRMAN: I am not allowing anybody.

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, మన మంత్రి గారికి ...

MR. CHAIRMAN: No appreciation. It is nothing but wasting of time.

SRI B. CHANGALRAYUDU: Sir, he has done excellent job. That is why..

మిస్టర్ ఛైర్మన్ : నాకు appreciation ఎందుకు? హౌస్‌కు ఇవ్వాలి.

SRI B. CHANGALRAYUDU: Sir, through you entire House will know.

మిస్టర్ ఛైర్మన్ : ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేసి, వారు ఆ రిపోర్టును సభకు ఇచ్చిన తరువాత give a complement to the concerned Minister. సిద్దా రాఘవరావు గారు మన హౌస్‌లో ఉండి వెళ్లారు. ఇప్పుడు ఆ హౌస్‌లో ఉండి మంత్రి అయ్యారు. రిపోర్టు వచ్చిన రోజు I can give complement through the House to the concerned Minister.

శ్రీ కె.ఇ. కృష్ణమూర్తి ః అధ్యక్షా, యాక్సిడెంట్‌లో లేడీ తహశీల్దారు ప్రమాదానికి గురైందని నిన్న కూడా మీరు చెప్పారు.

MR. CHAIRMAN: The accident spot is 30 KMs from Kurnool Town. I think the accident had happened on June 22nd.

శ్రీ కె.ఇ. కృష్ణమూర్తి ః అధ్యక్షా, ఏపిఎస్ఆర్టీసీ బస్ వల్ల ఆ ప్రమాదం జరగలేదు. ఇసుక లారీ వాళ్లను ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో మరణించిన వారికి compassionate ground క్రింద ఉద్యోగాలు కూడా ఇచ్చాం. తహశీల్దారు రెస్ట్‌లో ఉంది కాబట్టి ఆమె కోలుకున్న వెంటనే ఆమెకు మరల ఉద్యోగం ఇస్తాం. లేకపోతే ఆమె ఎవరికి ఉద్యోగం ఇవ్వమని చెబితే వారికి ఉద్యోగం ఇవ్వడానికి ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉంది.

MR. CHAIRMAN: Good. One solution is found atleast in the case of Tahsildar, Kurnool. రాఘవరావు గారూ.. రిపోర్టు ఎప్పుడు సబ్మిట్ చేస్తారో చెప్పండి.

శ్రీ సిద్ధా రాఘవరావు ః అధ్యక్షా, రోడ్డు ప్రమాదాలను నివారించడానికి గౌరవ సభ్యులు చాలా సూచనలు చేశారు. చాలా సంతోషం. ఎందుకంటే.. రామచంద్రయ్య గారు చెప్పినట్లు వాస్తవంగా ఈరోజు హైవేస్‌లో కాని, స్టేట్ హైవేస్‌లో కాని ప్రమాదాలు జరుగుతున్నాయి. మనం ఎంత కంట్రోల్ చేస్తున్నప్పటికి కూడా ఇప్పుడు చాలా స్పీడ్‌గా నడిచే వాహనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. తయారీదారులు 240-250 కి.మీ స్పీడ్‌తో నడిచే వాహనాలను కూడా తయారుచేస్తున్నారు. అయినప్పటికి, నేను మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత 22.07.2014 వ తేదీన విజయవాడలో భద్రతా అవగాహనా సదస్సులను లాంచ్ చేసి 100 రోజులు రాష్ట్రమంతా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగా ప్రజలలో అవేర్‌నెస్‌ను తీసుకురావడం కోసం మా అధికారులందరూ పాఠశాలలకు, కాలేజీలకు, యూనివర్శిటీలకు, ఆఫీసులకు, ఇతర ప్రదేశాలకు వెళ్లి అవగాహన కలుగచేయడానికి ఈ ప్రోగ్రాంలను నిర్వహించడం జరిగింది. ఏదేమైనప్పటికి, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా drunken driving చేస్తున్న వారిని పట్టుకోవడం కోసం ప్రత్యేకంగా ఒక మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌ను పెట్టి 24 గంటలు ఇన్‌స్పెక్షన్ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. స్పీడ్ డ్రైవింగ్‌ను కంట్రోల్ చేయడం కోసం జిల్లాకు ఒక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌ను ఎలాట్ చేసి వారు కూడా 24 గంటలు పని చేసే విధంగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. కొన్ని జిల్లాలలో అప్పుడప్పుడు ఇటువంటివి జరగకపోతే ఈ మధ్య వారితో మీటింగ్ పెట్టి గట్టిగా మందలించడం జరిగింది.

భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడడానికి ఒక కమిటీని వేయాలని సభ్యులు కోరారు. త్వరలోనే సభ్యులను invite చేసి వారి సూచనల మేరకు కమిటీని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం తప్పనిసరిగా చర్యలు తీసుకొని ముందుకు పోతుందని తెలియజేస్తున్నాను. అన్ని విధాల చర్యలు తీసుకొని రోడ్డు యాక్సిడెంట్ల తగ్గించాలని, జీరో యాక్సిడెంట్లు తీసుకురావాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. అలాగే, ఈ మధ్యన అన్ని జిల్లాలలో ఉన్న pot holesను కూడా identify చేయించాము. ఈ పాట్ హోల్స్ దగ్గరనే రాత్రి పూట ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. డైవర్షన్ ఉన్న చోట్ల గ్రామాల నుండి వచ్చే వారు చూచుకోకుండా లోపలకు రావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. సభ్యులు చెప్పినట్లు.. అటువంటి ప్రదేశాలలో sign

boardsను, రోడ్డు మార్జిన్‌లో అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయని సూచించడానికి రేడియమ్ స్టికర్స్‌ను పేస్ట్ చేయాలని మొన్న నేను వీడియో కాన్ఫరెన్స్ పెట్టి ట్రాన్స్‌పోర్ట్, ఆర్ అండ్ బి మరియు పోలీసు డిపార్ట్‌మెంట్ అధికారులతో చెప్పడమే కాకుండా పోలీసు అధికారులందరికి కూడా ఒక సర్క్యులర్‌ను పంపించడం జరిగింది. వచ్చే వారమే దీని మీద విజయవాడలో ఏర్పాటు చేయబోయే సమావేశంలో ఒక డైరెక్షన్ తీసుకొని యాక్సిడెంట్లను తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలియపరుస్తూ, కమిటీ ఏర్పాటు కోసం త్వరలో ఒక మీటింగ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని సభా ముఖంగా తెలియపరుస్తున్నాను.

MR. CHAIRMAN: Raghava Rao garu… You submit the Report on the first day of the Next Session.

SRI S. RAGHAVA RAO: Definitely Sir.

MR CHAIRMAN: Next, Question. Changal Rayudu garu, please put your question.

## కౌలు రైతులకు రుణాలు

ప్రశ్న నెం. 7685 (26)
సర్వశ్రీ బి. చంగల్ రాయుడు, రుద్రరాజు పద్మరాజు, ఎం.ఎల్.సి.లు.,

గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) రాష్ట్రంలో గత సంవత్సరంలో (రాష్ట్ర విభజనకు పూర్వం) కౌలు రైతులకు వ్యవసాయ రుణాల నిమిత్తం మంజూరు చేసిన మొత్తం పైకమెంత; మరియు రాష్ట్ర విభజన తరువాత అట్టి మంజూరు చేసిన మొత్తంలో పంపిణీ చేసిన రుణాల మొత్తం ఎంత?

(ఆ) ఆ కౌలు రైతులకు రుణమాఫీ పథకాన్ని విస్తరింపచేయడానికి ప్రభుత్వం ఏవేని చర్యలను చేపట్టిందా?

(ఇ) అయితే, ఆ వివరాలేమిటి?

గౌరవనీయులైన వ్యవసాయ, వ్యవసాయ ప్రాసెసింగ్, మార్కెటింగ్, గిడ్డంగులు, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమ శాఖ (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు):

(అ) 2014, మార్చికి ముందు అంటే, రాష్ట్ర విభజనకు పూర్వం పంట రుణాల నిమిత్తం రూ.342.06 కోట్ల మొత్తాన్ని మంజూరు చేసి, 1,64,781 మంది ఎల్ఇసి కార్డు దారులు/కౌలు రైతులకు పంపిణీ చేయడమయింది.

(ఆ) అవునండీ.

(ఇ) రెండూ కలిపి ఒక్కొక్క కుటుంబానికి రూ.1.50 లక్షలకు మించకుండా వ్యవసాయ ప్రయోజనం కోసం తీసుకున్న వ్యవసాయ పంట రుణాలు మరియు బంగారంపై తీసుకున్న రుణాల మాఫీ విధానాన్ని 02-08-2014 తేదీ గల జి.ఓ.ఎం.ఎస్. నెం.164 ద్వారా ప్రభుత్వం ప్రకటించింది.

ఒకే సర్వే నెంబరుపై పట్టాదారు మరియు ఎల్ఇసి దారు ఇద్దరూ కూడా స్వల్ప కాలిక పంట రుణాలను తీసుకున్న సందర్భంలో ఎల్ఇసిదారు/కౌలు సాగుదారుకు మాత్రమే ప్రయోజనాన్ని విస్తరింపచేయాలని నిర్ణయించడమయింది. వివిధ సీజన్లలో చెల్లించాల్సి ఉన్నట్టి కౌలురైతు, అలాగే యజమాని విషయంలో ఇద్దరికీ రుణమాఫీని వర్తింపచేయడమవుతుంది.

శ్రీ బి. చంగల్ రాయుడుః మంత్రి గారూ, జి.ఓ.ఎం.ఎస్. నెం. 174లో ఏమున్నది?

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుః జి.ఓ174 కౌలు రైతులకు సంబంధించింది. 164 జి.ఓను అమెండ్ చేస్తూ తరువాత జి.ఓ. 174 వచ్చింది.

శ్రీ బి. చంగల్ రాయుడు ః అధ్యక్షా, జి.ఓ 174లో కౌలు రైతుల గురించి ఎక్కడా కూడా ప్రస్తావించలేదు. జి.ఓలో Category of borrower eligibleలో కౌలు రైతుల గురించి లేదు కాబట్టి దాని గురించి స్టడీ చేసి ఒకవేళ లేకపోతే వారిని కూడా ఇంక్లూడ్ చేయమని కోరుతున్నాను.

అధ్యక్షా, రాష్ట్రంలో దాదాపు 20 లక్షల వరకు కౌలు రైతులున్నారు. మంత్రి గారి స్టేట్‌మెంట్ ప్రకారం 38 వేల మంది ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఎక్కువ సంఖ్యలోను, తూర్పు గోదావరి జిల్లాలో, కృష్ణా జిల్లాలో అన్‌రికగ్నైజ్డ్ కౌలు రైతులు చాలా మంది ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం 38 వేల మంది మాత్రమే ఉన్నారు. ఇది కరెక్ట్ కాదు కాబట్టి ఒకసారి దీని గురించి స్టడీ చేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. ఎవరి పేరున్నా సరే, గ్రౌండ్ రియాల్టీని తీసుకొని కౌలు రైతులందరికి ప్రభుత్వం ఇచ్చే రిలీఫ్/ waiver ముట్టేటట్లు చూడాలి. జీ.ఓలోనే వారి గురించి ప్రస్తావన లేనప్పుడు ఇక వారికేమి ముడుతుందనేది మా అందరి అనుమానం కాబట్టి దీనిపై క్లారిటీ ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు ః అధ్యక్షా, గౌరవ సభ్యులు చంగల్ రాయుడు గారు అడిగిన దానికి ఆరోజు భూమి యజమానికి ఏదైతే సర్వే నెంబర్ ఉందో ఆ సర్వే నెంబర్ మీద ఎల్ఇసీ కాకుండా కౌలు రైతు పేరు మీద గతంలో అప్పు తీసుకున్న వారున్నారు. వారికి భూమి యజమాని సర్వే నెంబర్‌ను మెన్షన్ చేసి రుణం తీసుకున్న వాటికి మాత్రమే మాఫీ వర్తిస్తుంది.

శ్రీ బి. చంగల్ రాయుడు ః భూమి యజమానికి కూడా వర్తిస్తుందా?

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు ః ఒక సంవత్సరం కౌలుదారు రైతు పంటను పండిస్తాడు. రెండవ సంవత్సరం భూమి యజమాని పంటను పండించుకోవడానికి లోన్ తీసుకుంటే ఇద్దరికి eligible వస్తుంది.

శ్రీ బి. చంగల్ రాయుడు ః అధ్యక్షా, కౌలు రైతులు లబ్ధ పొందే విధంగా జీ.ఓలో క్లారిటీ ఇవ్వవలసిందిగా కోరుతున్నాను. జీ.ఓలో eligible క్రింద కౌలు రైతుల గురించి లేదు. Non-eligible క్రింద హార్టికల్చర్ అని ఇచ్చారు.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు : అధ్యక్షా, హార్టికల్చర్‌కు కూడా ఇప్పుడు రూ.10000ల వరకు eligibility ఉంది. దానికి సంబంధించి జీ.ఓ కావాలంటే తరువాత అందజేస్తాను.

శ్రీ కె.యస్. లక్ష్మణరావు : అధ్యక్షా, గుంటూరు జిల్లాలో అనేక గ్రామాల్లో కౌలు రైతుకు రుణ మాఫీ గురించి పరిశీలించాము. పాస్‌బుక్ ఉన్న రైతుకు మాత్రమే ఆ రుణమాఫీ నిబంధనలు వర్తిస్తున్నాయి. కౌలు రైతుకు పాస్‌బుక్ ఉండదు. ఓరల్ అగ్రిమెంట్‌తోనే భూమి యజమాని తన భూమిని కౌలుకు ఇవ్వడం జరుగుతోంది కాబట్టి వాళ్లకు ఈ రుణమాఫీ లబ్ధి అందడం లేదు. ఎందుకంటే కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో వ్యవసాయదారులలో దాదాపు 65 శాతం మంది కౌలు రైతులే. రుణమాఫీ వల్ల కౌలు రైతులకు పెద్దగా ప్రయోజనం జరగడం లేదని మా అధ్యయనంలో వెల్లడైంది కాబట్టి క్షేత్ర స్థాయిలో పరిశీలించి కౌలు రైతులకు ఏ విధంగా న్యాయం చేయాలో అధ్యయనం చేయాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పి.జె. చంద్ర శేఖర రావు : అధ్యక్షా, గత ప్రభుత్వం కూడా కౌలు రైతులను గుర్తించే విషయాన్ని పరిష్కారం చేయకుండా, ప్రతి కౌలుదారుకు కూడా ప్రభుత్వం తరపున ఇచ్చే సబ్సిడీలు కాని, రుణమాఫీ కాని అందే విధంగా అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయకుండా ఉన్న నేపథ్యంలో, వ్యవసాయ రంగాన్ని సంస్కరించడం కాని, వ్యవసాయదారులకు సహాయం చేయడమనేది అసాధ్యమనే విషయాన్ని ఇదే సభలో చర్చించినప్పుడు దీనికి అర్హులను ఐడెంటిఫై చేసి బుక్‌చేయడానికి ఎల్ఈసీ (లోను అర్హత కార్డు)లు ఇవ్వడానికి గత ప్రభుత్వంలో ఒక అవగాహన వచ్చింది. ఆ తరువాత కొత్త ప్రభుత్వం వచ్చింది. ముఖ్యంగా, మంత్రి గారికి రైతు ఉద్యమంలో ఉన్నటువంటి అనుభవం కూడా ఉంది. గుంటూరు, కృష్ణా మరియు గోదావరి జిల్లాలలో కౌలు రైతులే ఎక్కువగా రైతులుగా ఉన్నటువంటి పరిస్థితి ఉంది. రైతులకు రుణమాఫీ విషయంలో లక్ష రూపాయలు చేసినా లక్షా యాభై వేల రూపాయలు చేసినా అది కూడా అసలైన రైతుల నోటికి పోకుండా landlords గా ఉండి వ్యవసాయం చేయకుండా ఉండే ఇతరులకు ప్రయోజనం దొరికే విధంగా ఉన్న నేపథ్యంలో ప్రతి కౌలు రైతును గుర్తించే దానికి లాండ్‌లార్డ్ యొక్క ప్రమేయం లేకుండా వాస్తవంగా ఎవరైతే కౌలు చేస్తున్నారో వాళ్లను గుర్తించి, బుక్‌చేసి, రికార్డు చేసేదానికి ఒక వ్యవస్థను రూపొందించడానికి ప్రభుత్వం ఏదైనా విధివిధానాలను రూపొందించిందా అనే విషయాన్ని తెలియజేయవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు : అధ్యక్షా, రాష్ట్రంలో ఎంత మంది కౌలు రైతులున్నారనే దాని మీద ఒక మీమాంస వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారు రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది కౌలు రైతులున్నారని చెప్పడం జరిగింది. అగ్రికల్చర్ అసోసియేషన్ వారు దాదాపు 25 లక్షల మంది ఉన్నారని చెప్పడం జరిగింది. ఏది కరెక్ట్ అనేది మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను. కౌలుదారులు ఎప్పుడూ కూడా ఈ రాష్ట్రంలో కన్నీటితోనే ఉన్నారు. ఎందుచేతనంటే.. వారికి రుణాలు డైరెక్ట్‌గా వచ్చే అవకాశం లేదు. పాస్‌బుక్‌లు యజమాని పేరుతో ఉంటాయి కాబట్టి సహజంగా వీరికి అప్పు ఇవ్వడమనేది జరగదు. కాని, రిజర్వ్ బ్యాంకు రూల్సు ప్రకారం కౌలు రైతుకు కూడా రూ.50వేల నుండి రూ.1.00లక్ష వరకు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా ఇచ్చే అవకాశం ఉంది. ఆ విధంగానైనా కౌలు రైతుకు అప్పు ఇవ్వాలి.

రాష్ట్రంలో ఉన్నటువంటి 41.21లక్షల హెక్టార్ల సాగు భూమిలో దాదాపు 80 శాతం భూమిని కౌలు రైతులే వ్యయసాయం చేస్తున్నారు. సభలో ఉన్నటువంటి భూ యజమానులలో ఎంతమంది సొంతంగా వ్యవసాయం చేస్తున్నారని ఆత్మ విమర్శ చేసుకుంటే 80 శాతం మంది కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారు. వారందరూ కూడా బడుగు,బలహీనవర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, ఇతర పేద వర్గాలకు చెందిన వారు. వీరందరూ కూడా కష్టపడి పంటను పండిస్తున్నా రుణ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న తీరును చూశాం.

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ : పద్మరాజు గారూ, సప్లమెంటరీ అడగండి.

శ్రీ రుద్రరాజు పద్మరాజు : అధ్యక్షా, రుణాలకు సంబంధించి Loan Eligibility Cardsను కౌలుదారులకు ఇవ్వడం లేదు. దయచేసి, ఈ LEC లను వారికి కచ్చితంగా ఇవ్వాలి. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో చూచుకుంటే రూ.42కోట్లు మాత్రమే రుణాలు ఇవ్వడం జరిగింది. గత సంవత్సరం చూస్తే రూ.318 కోట్లు వారికి ఇచ్చినట్లుగా ఉంది కాని వారికి రుణ సౌకర్యం కల్పించనందున ఈరోజు రైతాంగం ఆత్మహత్యలకు కారణం అవుతుందని మీ ద్వారా మంత్రివర్యులకు తెలియజేస్తున్నాను. ఈనాడు బడుగు, బలహీన వర్గాల వారే వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయం చేసేవారికి రుణసౌకర్యం లేకపోవడం వల్ల ఆత్మహత్యలు చేసుకోవడానికి కారణం అవుతుంది కాబట్టి వారికి కావలసిన రుణ సౌకర్యం ప్రభుత్వమే అన్ని విధాల కల్పించాలి. రుణ సౌకర్యమే కాదు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా వారికి రావడం లేదు. అదే విధంగా, ఇన్సూరెన్స్ కూడా కట్టలేనటువంటి దుస్థితిలో ఉన్నారు కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుని రైతాంగాన్ని ఆదుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఉ.11.00

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు : గౌరవ సభ్యులు ఎల్.ఈ.సి. కార్డుల గురించి అడిగారు. దాదాపు 16 లక్షల మంది కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. 2011-12 లో 5,76,147 ఎల్ఈసి కార్డులను జారీ చేశారు. ఆ సంవత్సరం 1,97,747 మందికి రూ.393 కోట్ల 45 లక్షలు రుణం మంజూరు చేయడం జరిగింది. 2012-13 సంవత్సరంలో 4,23,328 మందికి ఎల్ఈసి కార్డులు ఇష్యూ చేయడం జరిగింది. 1,31,975 మందికి రూ.312కోట్లు రుణం మంజూరు చేయడం జరిగింది. 2013-14వ సంవత్సరంలో 4,43,155 మందికి కార్డులు ఇష్యూ చేయగా, 1,64,781 మంది రైతులకు రూ.342 కోట్లు రుణం మంజూరు చేయడం జరిగింది. అదే విధంగా 2014-15 వ సంవత్సరానికి వచ్చేసరికి 3,39,214 మందికి కార్డులు ఇష్యూ చేయడం జరిగింది. ఈ సంవత్సరం మార్చి వరకూ ఇంకా సమయమున్నది. ఇప్పటివరకూ 33,979 మందికి రూ.58కోట్ల 87 లక్షలు మాత్రమే రుణం మంజూరు చేయడం జరిగింది.

సభ్యులు శ్రీ పి.జె. చంద్రశేఖర రావు గారు కౌలు రైతులను అందరికీ మనమే గుర్తించి కార్డులు ఇస్తే బాగుంటుందని అన్నారు. దీని మీద సిసిఎల్ఏ ఛైర్మన్‌గా ఒక కమిటీని కూడా వేశాము. ఎల్ఈసి కార్డులను ఏ విధంగా ఇంప్రూవ్ చేయాలి, కౌలు దారులను ఏ విధంగా ప్రొటెక్ట్ చేయాలి అనే దానిపై ఈ కమిటీ పనిచేస్తుంది. శ్రీ రుద్రరాజు పద్మరాజు గారు మాట్లాడుతూ, 80

శాతం కౌలుదారులు ఉన్నారు, వారిని గుర్తించి రెండూ ఒకేసారిగా ఇస్తే బాగుంటుందని అన్నారు. ఎల్ఈసి కార్డులున్న ప్రతి ఒక్కరికీ బ్యాంకు రుణం ఇవ్వాలి. కానీ, ఆ కార్డులకు మనం ఒక టైం పెట్టాము. జూన్ కంటే ముందే ఎల్ఈసి కార్డులకు దరఖాస్తు చేసుకోమని చెప్పాము. 16 లక్షలమందిలో అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇస్తున్నాము. ఇదొక నిరంతర ప్రక్రియ. దానికి ముగింపు అనేది లేదు. చంద్రశేఖర రావు గారు అందరికీ ఇవ్వమని అన్నారు. అది రెవెన్యూ పరిధిలోకి వస్తుంది. దానిని ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలియచేస్తున్నాను. ఎల్ఈసి (రుణ అర్హత కార్డు)కార్డులు ఇచ్చిన అందరికీ బ్యాంకులు తప్పకుండా రుణం మంజూరు చేయాలి. అలా చేయకపోతే ప్రభుత్వం కూడా బ్యాంకులపై ఒత్తిడి తీసుకువస్తుంది. ఏది ఏమైనా కౌలుదారులను ప్రొటెక్ట్ చేసే బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. దీనిపై అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది. రుణ మాఫీలో కూడా కౌలుదారులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. భూమి యజమానులకు కల్పించే సౌకర్యాలన్నీ కౌలుదారులకు కూడా కల్పించడం జరుగుతుంది.

## దేవాలయ ఉద్యోగులకు జీతాలు

ప్రశ్న నెం. 7785 (27)
శ్రీ మెట్టు గోవింద రెడ్డి, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన దేవాదాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) దేవాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలను చెల్లించడంలేదనే విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చిందా?
(ఆ) ధార్మిక పరిషత్తు నుండి వారి జీతాలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం వాస్తవమేనా?
(ఇ) అయితే, సదరు నిర్ణయాన్ని అమలు చేయకపోవడానికి గల కారణాలేమిటి?

గౌరవనీయులైన దేవాదాయ శాఖ మంత్రి (శ్రీ పైడికొండల మాణిక్యాల రావు):

(అ) లేదండీ.
(ఆ) లేదండీ.
(ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ మెట్టు గోవిందరెడ్డి (స్థానిక సంస్థలు, అనంతపురం)ః దేవాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు సరిగా చెల్లించడం లేదు. పెద్ద దేవాలయాలలో జీతాలు ఇస్తున్నారు గానీ, చిన్న దేవాలయాలలోని సిబ్బందికి సరిగా జీతాలు ఇవ్వడం లేదు. మూడు నెలలకు ఒకసారి ఇస్తున్నారు. జీతాలు సరిగా రాకపోవడం వల్ల దేవాలయాలలో అవినీతికి ఆస్కారమేర్పడుతుంది. రూ.5,000లకు తక్కువ కాకుండా జీతాలు ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన పేపర్ స్టేట్‌మెంట్ చూశాము. ఎప్పటిలోగా జీతాలు పెంచుతారు అని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం) ః అధ్యక్షా, రాబోయే వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం

జారీ చేయబోయే పాసుల గురించి ఒక మాట మంత్రిగారిని అడగదల్చుకున్నాను. పర్వదినం సందర్భంగా ఎమ్ఎల్ఏ, ఎమ్పి, ఎమ్ఎల్సిలకు జారీ చేసే పాసులను నియంత్రిస్తూ, గతంలో వలే కాకుండా ఈ సారి ముగ్గురినే అనుమతిస్తామని చెప్పడం జరిగింది. అలా కాకుండా, గతంలో వలె ఆరుగురిని అనుమతించాలని కోరుతున్నాను. ఎండోమెంట్స్‌లో పనిచేసే వారికి జీతాలు సరిగా చెల్లించడం లేదు. నాన్ టీచింగ్ స్టాఫ్‌కు పదవీ విరమణకు వయో పరిమితి 60 సంవత్సరాలు చేయలేదు. వారికి కూడా 60 సంవత్సరాలు చేయాలని కోరుతున్నాను. అర్చకులకు 60 సంవత్సరాల నుండి 65 సంవత్సరాలకు పెంచారు. ఉద్యోగులకు మాత్రమే అది లేదు. కాబట్టి మిగతా ప్రభుత్వ ఉద్యోగుల వలే వారికి కూడా 58 నుండి 60కి పదవీ విరమణ పరిమితి పెంచాలని మరియు వారికి పెన్షన్లు కూడా ఇవ్వాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు (మైకు లేకుండా) : సార్, పాసులు ఇచ్చేలా చూస్తే బాగుంటుంది.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : అధ్యక్షా, ఈ పాసుల గురించి సభలో మాట్లాడడం న్యాయం కాదు, బాధగా ఉంది. గతంలో వైకుంఠ ఏకాదశి రోజున జరిగిన గందరగోళం మంత్రిగారికి తెలుసు. అక్కడ తొక్కిసలాట జరిగి, కొంతమంది ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చింది. దానిమీద ఒక ప్రత్యేకమైన ఎంక్వైరీని కూడా వేశారు. ప్రజాప్రతినిధుల వలన ఇలా జరిగిందనే విచారణ జరిగిన తరువాత మళ్ళీ ఏ రకంగా పాసుల గురించి హౌజ్‌లో చర్చలు జరుపుతారు.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు : అధ్యక్షా, కౌన్సిల్‌లో ఎం.ఎల్.సి.లము అయ్యాము కాబట్టే, మనకు ఆ సౌకర్యం వచ్చింది లేకపోతే వచ్చేది కాదు. కాబట్టి, మీ ద్వారా మేము సంబంధిత మంత్రిగారికి తెలుపుకున్నాము. అధ్యక్షా, మా మనోభావాలను కాపాడండి.

(అంతరాయం)

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి (పట్టభద్రుల నియోజకవర్గం, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు): అధ్యక్షా, తిరుమల తిరుపతి దేవస్థానంలో ధర్మప్రచార పరిషత్తు ఉంది. దానికి సుమారు రూ.20కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగింది. అందులో ఒక కార్యదర్శి పదవి ఉన్నది. ఇంతవరకూ ఇన్‌ఛార్జ్‌లతోనే నడుస్తున్నది కానీ, ఆ పదవిలోకి రెగ్యులర్ కార్యదర్శి రాలేదు. ఇక్కడ మన గుడి, ధర్మ ప్రచారం వంటి కార్యక్రమాలకు రూ.5లక్షల వరకూ పేమెంట్స్ ఇవ్వవచ్చు. రూ.5 లక్షలు దాటితే టెండర్లు పిలవవలసి ఉన్నది. ఆ రకంగా టెండర్లు పిలవకుండా మనగుడి వంటి కార్యక్రమాలలో దాదాపు 2, 3 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. కొంతమంది ప్రైవేటు వ్యక్తుల ఇష్టారాజ్యంగా అక్కడ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ విషయంపై చాలా కాలం నుండి తిరుపతి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మంత్రిగారు సమాధానమివ్వవలసిందిగా కోరుతున్నాను. రెగ్యులర్ సెక్రటరీని నియమించి ధర్మ ప్రచారంలో కూడా ధర్మం జరిగే విధంగా చూడాలని మీ ద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ పైడికొండల మాణిక్యాల రావు : అధ్యక్షా, సభ్యులు కొన్ని దేవాలయాలలో అర్చకులకు జీతాలు అందడం లేదని అంటున్నారు. అన్ని చోట్లా అందుతున్నాయి. అయితే, చిన్న దేవాలయాలకు మక్తాల నుండి జీతాలు చెల్లించే అలవాటు ఉన్నది. కాబట్టి, కొన్ని దేవాలయాలలో

ఒకటి, రెండు నెలలు ఆలస్యమయ్యే పరిస్థితి ఉన్నది. ఆదాయం లేని దేవాలయాలకు, ఆదాయం వచ్చే దేవాలయాలనుండి డబ్బు అప్పు ఇప్పించడం ద్వారా జీతాలు ఇవ్వడం గానీ, లేదా పెద్ద దేవాలయాలకు అడాప్షన్ ఇవ్వడం ద్వారా చిన్న దేవాలయాలకు జీతాలిప్పించే ప్రయత్నం జరుగుతుంది. ఈ సందర్భంగా మరీ చిన్న దేవాలయాలలోని సిబ్బంది ఇబ్బంది పడకుండా ఉండడం కోసం నేరుగా ప్రతి నెల రూ.5,000లు దేవాదాయ శాఖ ద్వారా ప్రభుత్వం చెల్లించే విధంగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నాము. త్వరలోనే దీనిని కూడా గౌరవ ముఖ్యమంత్రిగారి సూచన మేరకు ఈ విధానాన్ని అమలు జరపడానికి సిద్ధంగా ఉన్నాము.

ఉ.11.10

అదేవిధంగా, సభ్యులు శ్రీ గాదె శ్రీనివాసులునాయుడు గారు తిరుమల విషయంలో చెప్పిన సూచనను తప్పనిసరిగా పరిశీలిస్తాము. వి.ఐ.పి. భక్తులకంటే ఎక్కువ మంది సాధారణ భక్తులకు దర్శనం జరగడం కోసం, వెయ్యిమందికి మాత్రమే వి.ఐ.పి. భక్తుల దర్శనాలను తగ్గించగలిగితే, సుమారు 7 వేల నుంచి 8 వేల మంది సాధారణ భక్తులు ప్రతిరోజూ భగవంతుని దర్శనం చేసుకునే అవకాశముంది. గతంలో ఉన్న రోజుకు 4 వేల నుంచి 5 వేల మంది వి.ఐ.పి. భక్తులు దర్శనం చేసుకునే పరిస్థితి నుంచి నేడు ఆ సంఖ్య వెయ్యికి కుదించడం జరిగింది. గత నాలుగైదు నెలలుగా వెయ్యిమంది వి.ఐ.పి. భక్తులను మాత్రమే ప్రతిరోజూ దర్శనానికి అనుమతిస్తున్న కారణంగా సుమారు 20 నుంచి 25 వేలమంది సాధారణ భక్తులు ప్రతిరోజూ దర్శనం చేసుకోగలుగుతున్నారు. భక్తుల తాకిడి పెరిగిన కారణంగా కొంతమంది వి.ఐ.పి.లను తగ్గించాలనే ఆలోచన ఈ ప్రభుత్వం చేసిన కారణంగా సాధారణ భక్తులకు మూడు లైన్ల విధానాన్ని ప్రవేశపెట్టి ఎక్కడా తోపుడు లేకుండా చక్కగా భక్తులు దర్శనం చేసుకునే ఏర్పాటును చేయడం జరిగింది. నలుగురు నుంచి ఆరుగురు వి.ఐ.పి. భక్తులను అనుమతించాలని సభ్యులు చేసిన సూచనను పరిశీలించి తప్పకుండా అమలుచేయడానికి ప్రయత్నిస్తాము.

ధర్మప్రచార పరిషత్‌కు సంబంధించి కొన్ని తప్పులు జరిగాయని గౌరవ సభ్యులు చెప్పారు. తప్పకుండా ఆ విషయాన్ని కూడా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాము. కార్యదర్శి మరియు ఖాళీగా ఉన్న ఇతర పోస్టులను భర్తీచేసి ధర్మ ప్రచార పరిషత్ ధర్మంగా నడిచే విధంగా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని నేను తమరిద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి: అధ్యక్షా, అది తప్పని కాదు, నియమ నిబంధనల ప్రకారం చేస్తే కోట్లాది రూపాయలు సవ్యంగా వినియోగించే పరిస్థితి ఉంటుంది. ప్రొసీజర్ ప్రకారం రూ. 5 లక్షలు దాటితే టెండర్ విధానాన్ని పాటించాలి. ఇది చాలా ఆందోళనకరమైన అంశం.

శ్రీ పైడికొండల మాణిక్యాల రావు: అధ్యక్షా, ఆ ప్రక్రియను ప్రొసీజర్ ప్రకారమే చేస్తాము. మరొక అంశం, అర్చకుల విషయంలో వయోపరిమితిని తీసివేయడం జరిగింది. వారికి ఓపిక ఉండి చేయగలిగినంతకాలం పనిచేయవచ్చు. మిగిలిన సిబ్బంది విషయంలో పదవీవిరమణ 60 సంవత్సరాలకు పెంచే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. తప్పనిసరిగా దీనిని కూడా అమలుచేస్తాము.

MR. CHAIRMAN: Question Nos.7641(28), 7811(29) and 7679( 30) are postponed.

Now, the House is adjourned for Tea Break for 15 Minutes.

(Then, the House adjourned at 11-13 a.m.)

* * *

మ 12.00

THE HOUSE RE-ASSEMBLED AT 12.14 P.M.
(HON'BLE CHAIRMAN IN THE CHAIR)

MR. CHAIRMAN: Item No. II - All the papers are deemed to have been laid on the Table of the House.

**PAPER LAID**

A copy of the Annual Accounts and Report of the Andhra Pradesh Vaidya Vidhana Parishad for the year 2007-2008, as required under Section 19(5) of the Andhra Pradesh Vaidya Vidhana Parishad Act, 1986, along with reasons for delay.

మిస్టర్ ఛైర్మన్ : డ్రౌట్‌పైన డెప్యూటి ఛీఫ్ మినిస్టర్ గారి సమాధానం పెండింగ్‌లో ఉంది, ప్రస్తుతం మంత్రిగారు శాసన సభలో హుద్ హుద్ తుఫానుపై వివరణ ఇస్తున్నారనే సమాచారం వచ్చింది. దీనిపై ఏం చేద్దామంటారు?

( ఆ సందర్భంలో కొందరు సభ్యులు డ్రాట్ అంశాన్ని ప్రస్తుతం వాయిదా వేసి మరొక రోజు చేపడితే బాగుంటుందని సూచించారు.)

MR. CHAIRMAN: Monday evening Session we can have.

శ్రీ సిద్ధా రాఘవరావు : అధ్యక్షా, ఆ విషయాన్ని నేను మంత్రిగారికి తెలియజేస్తాను.

శ్రీ సి. రామచంద్రయ్య : సార్, ఈ హౌస్ ఎగ్జిస్టెన్స్‌లో ఉన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. ఇంత స్కాంట్ రిగార్డ్ ఉంటే ఎలా? మాజిల్లాల్లో కరవు బీభత్సంగా ఉంది, మేము మా ఆందోళన వెలిబుచ్చాం. అధికార పార్టీలోని సభ్యులు మా పద్ధతుల్లో మాట్లాడకపోయి ఉండవచ్చు, కానీ వారు కూడా అదే స్థితిని ఎదుర్కొంటున్నారు. మేము అంత పెద్ద సమస్య తీసుకొని వస్తే సంబంధిత మంత్రి సభలో లేరు, దానికి జవాబిచ్చే దిక్కులేరు, ఈ హౌస్‌ను ఇంత తేలికగా తీసుకోవడమేంటి? శాసన సభతో పోల్చితే కౌన్సిల్‌కు తక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు.

MR. CHAIRMAN: That we will discuss with the Hon'ble CM.

శ్రీ సిద్ధా రాఘవరావు : ప్రతిరోజు మంత్రులందరూ సభకు హాజరవుతున్నారు.

శ్రీ సి. రామచంద్రయ్య (మైక్ లేకుండా): అలా హాజరైతే మాపై దయ చూపినట్లు కాదు, ఇది పార్లమెంటరీ డెమోక్రసీ, ఇందులోని రెండు సభల్లో ఇది ఎగువ సభ కనుక దీనికి ప్రాధాన్యత ఇవ్వాలి.

శ్రీ సిద్ధా రాఘవరావు : అది మా బాధ్యత, తప్పకుండా హాజరవుతాం.

MR. CHAIRMAN: Raghavaiah garu, there is a clear lack of coordination among the Members of the Treasury Benches and the Whips and Ministers also. They can also adjust.

శ్రీ సిద్ధా రాఘవరావు : అధ్యక్షా, ఆ విషయమై నేను మంత్రిగారికి తెలియజేస్తాను.

SRI RUDRARAJU PADMARAJU: Already we had a limited period. Hardly we have only four days. డ్రౌట్‌పైన, హుద్ హుద్ తుఫాను గురించి మాట్లాడాం, ప్రాధాన్యత ఇవ్వవలసిన అంశాలపై కూడా మంత్రులు చర్చలో పాల్గొనక పోతే ఎలా? We have highest respect towards the Chair and we also respect the Ruling Government also. We extend our cooperation fully. There is no doubt in it. But, the thing is, this sort of negligence from the Treasury Benches, lack of coordination between those people/Members is highly regrettable.

డా. బచల పుల్లయ్య : అధ్యక్షా, పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలనైనా పూర్తి చేద్దాం.

MR. CHAIRMAN: There is no practice to take-up the questions after tea-break. Please don't disturb that Parliamentary practice. Ramachandraiah garu, I have been informed that discussion on 'Hud Hud Cyclone' is taking place in the other House and being the In-charge of the subject, the Deputy Chief Minister (Home) is held up there. As such, the Chief Minister is deputing Sri Palle Raghunatha Reddy to give reply on the short discussion on "Drought situation in the State" and he is on his way. Meanwhile, we will go ahead with the discussion on "Hud Hud Cyclone".

మ 12.20

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, శాసనసభలో హుద్‌హుద్‌మీద చర్చ మొదలైంది. ఇక్కడ కొంతమంది మంత్రులు ఉన్నారు. ఇంకా కొంతమంది మంత్రులు ఇప్పుడొస్తారు.

శ్రీ రుద్రరాజు పద్మరాజు : మనకు ఎ, బి గ్రూపు మంత్రులు అని ఉన్నారు. ఈ సభలో డ్యూటీ ఉన్నవారు అక్కడ శాసనసభలో కూర్చోవాల్సిన అవసరమేముంది? ఏ చర్చ అయినా అక్కడా, ఇక్కడా జరగచ్చు. Sir, hardly two Hon'ble Ministers are present in the House. The rest of the Ministers are not present in the House.

శ్రీ సిద్ధా రాఘవరావు : శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంవల్ల కొంతమంది మంత్రులు అక్కడికెళ్ళారు.

శ్రీ సి.రామచంద్రయ్య : సార్, ప్రభుత్వానికి తెలియాలి. అసలు ఎవరు లేకున్నా కూడా ఇక్కడ మినిట్స్ రికార్డవుతాయి. వాటిని అర్థంచేసుకుని జవాబులు చెప్పచ్చు. ఏ మంత్రులూ ఇక్కడుండాల్సిన పనిలేదు. But, you are giving respect to the House. మీరు ఆ రెస్పెక్ట్ ఇవ్వమంటే ఏంచెయ్యాలి? మేము అధికారంలో ఉన్నప్పుడు కూడా ఈ విధంగా జరిగితే మేము పాయింట్ అవుట్ చేశాం. మేము కూడా వెంటపడ్డాం. అక్కడ బిజీగా ఉన్నారు. ఆ తరువాతనే ఇక్కడ చర్చకు రమ్మనండి. సంబంధిత మంత్రి ఉంటే దాని ఇంటెన్సిటీని అర్థం చేసుకుంటారు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, మీరు పెద్దవారు చెప్పారు. గౌరవ సభ్యులు కూడా చెప్పారు. వ్యవసాయశాఖ మంత్రిగారు, హోం మంత్రిగారు శాసనసభలో జవాబు చెప్పాలని అక్కడున్నారు. రెండింటి గురించి ఒక్కరోజే జవాబు చెప్పాల్సి ఉంది. దీనిని ముఖ్యమంత్రిగారి దృ ష్టికి తీసుకెళ్ళినప్పుడు ఖచ్చితంగా మంత్రులొస్తారని తెలిపారు. ఇప్పటికే ఇక్కడ రహదార్ల, భవనాలశాఖామంత్రిగారు, దేవాదాయశాఖామంత్రిగారు ఉన్నారు. అట్లాగే అయ్యనపాత్రుడుగారిని, రఘునాథరెడ్డి గారిని ఇద్దర్నీ కూడా శాసనపరిషత్‌కు హాజరుకమ్మని వారు తెలిపారు. కాబట్టి ఇక్కడ సమాధానం చెప్పడానికి వారు బయల్దేరి వస్తామన్నారు. ఖచ్చితంగా మంత్రులు ఉండాల్సిందే.

కానీ ఒకే సమయంలో వాళ్ళు అక్కడ సమాధానం ఇవ్వాల్సి ఉంది. దానికోసం ఇబ్బంది వచ్చింది. ఏదేమైనా ఇప్పుడు మంత్రి పల్లె రఘునాథరెడ్డిగారు వస్తున్నారు.

మిస్టర్ ఛైర్మన్ : హుద్ హుద్ తుఫానుమీద ఎవరైనా మాట్లాడతారా?

శ్రీ సి.రామచంద్రయ్య : మాట్లాడడానికి అభ్యంతరం లేదు సార్. కానీ మాట్లాడితే వచ్చిన ఉపయోగమేమిటి? మరీ ఇన్‌సిస్ట్ చేస్తున్నానని కాదు. As a Leader of the House, I should strive for the respect of the House and I request even the Treasury Benches should also co-operate with the House. ఈ పద్ధతుల్లో హౌస్ నడవడం సాధ్యంకాదు. లేకపోతే శాసనసభ ఒక సమయంలోనూ, శాసనపరిషత్‌ను మరొక సమయంలోనూ పెట్టుకుందాం. అప్పుడు మంత్రులందరూ ఉంటారు. దీనిగురించి మీరు కొద్దిగా ఆలోచించండి. శాసనసభ సమావేశాలైపోయిన తరువాత శాసన పరిషత్ సమావేశాలు పెట్టుకుందాం. నేను రాజ్యసభలో 11 సంవత్సరాలున్నాను. ఇంత అగౌరవం ఎప్పుడూ లేదు. రాజ్యసభకే ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చేవాళ్ళు. నిజానికి రాజ్యసభలోనే చర్చలు కూడా ఎక్కువగా జరిగేది. సార్, ఈ సభలో మంత్రులంటే నాకు మంచి గౌరవముంది. వాళ్ళకు కూడా అవగాహన తక్కువ. పాపం వాళ్ళని మేమే ప్రశ్నలేసి ఇబ్బంది పెట్టాలి. దీనిపైన వాళ్ళు బ్రీఫ్ కాలేదు. మీరే ఆలోచించండి. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా సరే దానికి అంగీకరిస్తాము.

MR CHAIRMAN : I will talk with the Ministers concerned and also with the Officials of the Legislature. Now, presentation of Petition.

## అర్జీ సమర్పణ

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు : అధ్యక్షా, సర్వీస్ కమీషన్ ద్వారా ఎంపికైన 175 మంది ఇంజనీర్లు ఈ రాష్ట్ర విభజన నేపథ్యంగా తెలంగాణ ప్రాంతంలోని 5, 6 జోన్లకి కేటాయించబడ్డారు. వారిని ఇఎన్‌సి చీఫ్‌గారు రిలీవ్ చేసినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో వారికి పోస్టింగ్స్ ఇవ్వడంలేదు. కాబట్టి వారు మీద్వారా న్యాయం చేయమని కోరుతూ ప్రభుత్వానికి అర్జీ ఇచ్చారు. దానిని మీద్వారా ప్రభుత్వానికి అందచేస్తున్నాను.

(అర్జీ సమర్పించారు)

# హుద్ హుద్ తుఫాన్‌పై లఘు చర్చ

MR CHAIRMAN : Item No.III Short Discussion on Hud Hud Cyclone in the State. Note has been circulated to all Members.

1

ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు

22వ సమావేశం

ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తులో "హుద్‌హుద్ తుఫాను" పై స్వల్ప వ్యవధి చర్చకు గౌరవ ఉప-ముఖ్యమంత్రి (హోం, విపత్తు నిర్వహణ) శ్రీ ఎన్. చినరాజప్ప గారు చేయు వివరణ.

"హుద్‌హుద్ తుఫాను"

ఆంధ్రప్రదేశ్ విస్తృతంగా వ్యాపించి ఉండటం మరియు విశిష్టమైన భౌగోళిక ప్రాంతంగా ఉండటం కారణంగా దేశంలో అనేక జాతీయ విపత్తులకు గురవుతున్న అత్యంత దుర్భలమైన రాష్ట్రాలలో ఒకటిగా ఉన్నది. రాష్ట్రం 974 కిలోమీటర్ల సుదీర్ఘ మైన తీర రేఖతో, గుజరాత్ తరువాత దేశంలో రెండో పెద్ద రాష్ట్రంగా ఉన్నది. రాష్ట్రంలోని తొమ్మిది తీరప్రాంత జిల్లాలలో 92,906 చదరపు కిలోమీటర్లకు పైగా తీరప్రాంతం వ్యాపించి ఉన్నది. 4.93 కోట్ల మొత్తం జనాభాలో 69.2 శాతం మంది (341.9 లక్షలు) రాష్ట్రంలోని తొమ్మిది తీరప్రాంత జిల్లాలలో ఉండగా మిగిలిన 30.8 శాతం మంది (151.85 లక్షలు) నాలుగు రాయలసీమ జిల్లాలలో నివసిస్తున్నారు.

12-10-2014 భారతీయ కాలమానం 12.00 గంటలు 13.00 గంటల మధ్య చాలా తీవ్రమైన హుద్‌హుద్ పెను తుఫాను విశాఖపట్టణం తీరాన్ని దాటింది. 1891 సంవత్సరం నుండి ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటిన 77వ తుఫాను ఇది. హుద్‌హుద్ తుఫాను రాష్ట్రాన్ని తాకి, దాదాపు గంటకు 220 కిలోమీటర్ల గాలివేగం 57 సెంటీమీటర్లకుపైగా వర్షపాతంతో విశాఖపట్టణం తీరాన్ని దాటింది. ఫలితంగా, విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయనగరం మరియు తూర్పు గోదావరి జిల్లాలలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు మునుపెన్నడూ ఎరుగని నష్టం జరిగింది.

చాలా తీవ్రమైన హుద్‌హుద్ పెనుతుఫాను, ప్రభావం చూపిన జిల్లాలలో నిస్సందేహంగా ఆస్తులకు పెద్ద నష్టాలను కలిగించింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెండింటి సన్నద్ధత, సకాలంలో చర్య తీసుకోవడం వలన, నష్టాన్ని, ప్రత్యేకించి మానవ నష్టాన్ని చాలా వరకు తగ్గించగలిగాము. టెలిఫోన్లు, ఫ్యాక్స్ మిషన్లు తదితరాలను సిద్ధపరచుకొని రాష్ట్ర ప్రధాన కార్యస్థానం, జిల్లా ప్రధాన కార్యస్థానాలలో ట్రోల్ రూములను ప్రారంభించడం ద్వారా నిర్ధిష్టమైన ఆదేశాలతో అధికారులను తగురీతిగా భాగస్వాములను చేస్తూ ప్రభుత్వం రేయింబవళ్లు పర్యవేక్షణను చేపట్టింది. తుపాను స్థితి గురించి ఎప్పటికప్పుడు టెలివిజన్ / రేడియో / వార్తా పత్రికల ద్వారా విస్తృతమైన ప్రచారాన్ని చేయడమయింది. చేపలు పట్టే అన్ని కార్యకలాపాలను రద్దు చేసి, మత్స్యకారులను సముద్రంలోకి వెళరాదని సలహా ఇవ్వడమయింది.

వివిధ ప్రాంతాలకు సీనియర్ అధికారులను పంపడం, అధునాతన సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించడం, ప్రభావిత జిల్లాలలో బృందాలను ఉంచడం, సకాలంలో చర్య తీసుకోవడానికి సహాయపడి నష్టాన్ని తగ్గించింది. రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్‌ల వద్ద ఐ.ఎ.ఎస్. మరియు డిప్యూటీ కలెక్టర్లను నియమించడమయింది. పర్యవేక్షణకు మరియు జిల్లా పరిపాలన యంత్రాంగానికి సహాయ పడటానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలలో సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడమయింది. తుఫానుకు ముందు ప్రధాన కార్యదర్శితో వీడియో సంప్రదింపు ద్వారా క్యాబినెట్ కార్యదర్శి మూడుసార్లు అందించిన సూచనలతో కలిపి, భారత వాతావరణ శాఖ నుండి హెచ్చరిక అందినప్పటి నుండి ప్రధాన కార్యదర్శి రోజుకు రెండుసార్లు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులను నిర్వహించడం ద్వారా పరిస్థితిని పర్యవేక్షించి, ఉపద్రవాన్ని మరింత సమర్థవంతంగా ఎదుర్కొనడానికి రాష్ట్ర పాలనా యంత్రాంగానికి సహాయపడింది.

తీవ్రమైన పెనుగాలులు, భారీ వర్షాల వలన విశాఖపట్టణం నగరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తికి తీవ్ర నష్టం జరిగింది. వ్యవసాయం, ఉద్యానవన పంటలు, చేపల పరిశ్రమ, పశు సంవర్ధక శాఖ, చేనేత, జౌళి శాఖలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రభావిత జిల్లాలలో రహదారులు, భవనాలు, సాగునీరు, త్రాగునీరు, విద్యుత్తు తదితరాల వంటి ప్రభుత్వ మౌలిక సౌకర్యాలు బాగా దెబ్బతిన్నాయి. విద్యుత్తు సరఫరా, సమాచార సాంకేతిక వ్యవస్థ మొత్తం విఫలమయింది. విశాఖపట్టణం మరియు ఇతర ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలు ఒక వారానికి పైగా విద్యుత్తు సరఫరా లేకుండానే జీవించారు. ఫలితంగా, త్రాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

హైదరాబాదు నుండి పరిస్థితిని సమీక్షించిన తరువాత గౌరవ ముఖ్యమంత్రిగారు వెంటనే అక్టోబరు 12వ తారీఖున నష్టపోయిన జిల్లాలకు చేరుకొని, 13వ తేదీ ఉదయాన్నే ఏరియల్ సర్వే నిర్వహించి, విశాఖపట్టణం చేరుకొని నష్టపోయిన జిల్లాలలో సహాయ, పునరావాస కార్యకలాపాలను పర్యవేక్షించి, అవసరమైన ఆదేశాలను జారీచేసి తుఫాను వలన దారుణంగా దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించారు. సంక్షోభంలో 8 రోజులు ప్రజలతో ఆయన ఉండటం ప్రజల విశ్వాసాన్ని పెంచింది. 14-10-2014 తేదీన విశాఖపట్టణంలో నష్టపోయిన ప్రాంతాలను గౌరవ ప్రధానమంత్రిగారు సందర్శించి, పరిస్థితిని సమీక్షించి తక్షణమే రూ. 1.000 కోట్ల తాత్కాలిక పరిహార సహాయాన్ని ప్రకటించినపుడు ప్రజల నమ్మకం మరింత పెరిగింది.

విధ్వంసం కాలంలో, తరువాత స్వల్పకాలంలో చేపట్టిన యావత్ సహాయ కసరత్తులో అమలుపరచిన సహాయ చర్యలు అప్పటికప్పుడు నిబద్ధతతో చేపట్టడం జరిగింది. సహాయ సంరక్షణ చర్యలలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. ముందు జాగ్రత్త చర్యగా లోతట్టు ప్రాంతాల నుండి 2.22 లక్షల మంది ప్రజలను తరలించి, 310 సహాయ శిబిరాలను నిర్వహించడం జరిగింది.

అటవీ ప్రాంతానికి, మొక్కలకు భారీ నష్టం సంభవించింది, పడిపోయిన 7073 చెట్లను తొలగించి, సాధారణ స్థితికి తీసుకొనిరావడం జరిగింది. తుఫాను ప్రభావిత ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా పునరుద్ధరణను పర్యవేక్షించడానికి రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుండి 2000 మంది సాంకేతిక సిబ్బందిని తీసుకోవడమయింది. కమ్యూనికేషన్ సిస్టం పునరుద్ధరణ కోసం సెల్ టవర్ ఆపరేటర్లకు సంబంధించిన కార్యకలాపాలను పూర్తిగా పర్యవేక్షించడం జరిగింది. మృతి చెందిన బంధువులకు రూ. 5.00 లక్షల మొత్తాన్ని ఎక్స్‌గ్రేషియాగా ప్రకటించడం జరిగింది. 233 వైద్య శిబిరాలను నిర్వహించడం జరిగింది. 400 మెట్రిక్ టన్నుల ఆహార పొట్లాలను, 82.51 లక్షల వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది.

బాధిత కుటుంబాలకు తక్షణ సహాయాన్ని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనుకొనివున్న జిల్లాల నుండి, అంతేగాక దేశంలోని ఇతర రాష్ట్రాల నుండి వివిధ నిత్యావసర సరుకులు సేకరించడం జరిగింది. మొత్తంగా రూ. 33,114.48 లక్షల మొత్తాన్ని ఖర్చు చేయడమయింది. ఇందులో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ద్వారా చేసిన రూ. 31972 లక్షలు వ్యయం, ప్రభావిత జిల్లాలు / మార్కెటింగ్ శాఖ కాకుండా జిల్లాల యంత్రాంగం ద్వారా చేసిన రూ. 1142.48 లక్షల వ్యయం చేరివుంది. బంగాళాదుంపలను పశ్చిమ బెంగాల్ నుండి, ఉప్పును రాష్ట్ర పరిధిలో, తమిళనాడు నుండి పొందడమయింది. కాకినాడ నుండి పామోలిన్, కర్నూలు, రాజమండ్రి, లాస్‌గాన్ (మహారాష్ట్ర) నుండి ఉల్లిపాయలను పొందడమయింది. ప్రభావిత ప్రజలందరికీ ఉచితంగా తక్షణమే సరఫరా చేయడం జరిగింది. చేనేత కారులు / మత్స్యకార కుటుంబాలు వంటి జనాభాలోని వివిధ వర్గాలకు, తీవ్రంగా దెబ్బతిన్న, పాక్షికంగా దెబ్బతిన్న ప్రాంతాలలో నివసిస్తూ ఆయా వర్గాల వారికి అవసరమయిన పరిమాణాలలో సరఫరా చేయడం జరిగింది.

పెనుగాలులు, భారీ వర్షాలు ఫలితంగా విశాఖపట్టణం నగరంలోని ప్రజల, ప్రభుత్వ ఆస్తికి అధిక నష్టం వాటిల్లింది. ఈ జిల్లాలలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాలు, ప్రభుత్వ మౌలిక సదుపాయాలకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది. మొత్తం మీద నష్టం చాలా ఎక్కువగా వుంది. మొత్తంగా నాలుగు జిల్లాలలో గల 138 మండలాలలోని 7285 గ్రామాలలో విస్తరించివున్న 89 లక్షల మంది ప్రజలు తుఫాను ద్వారా ప్రభావితమయ్యారు. 2,22,460 మంది ప్రజలను తరలించడం జరిగింది. దీనివల్ల, మొత్తం ప్రాణ నష్టాన్ని 61 కి తగ్గించగలగడం జరిగింది. మరో 102 మంది వ్యక్తులు గాయపడ్డారు.

ప్రభుత్వం యొక్క క్రియాశీలకమయిన, సకాలంలో తీసుకున్న చర్య వల్ల ప్రాణ నష్టాన్ని కనిష్టతరం చేయగలిగినప్పటికీ, వ్యవసాయ రంగానికి అపరిమిత నష్టం సంభవించింది. 2.38 లక్షల హెక్టార్ల వ్యవసాయ విస్తీర్ణం దెబ్బతింది. (>50 శాతం) ఫలితంగా, రూ. 947.90 కోట్ల మొత్తంమేర వ్యవసాయ పంటకు నష్టం వాటిల్లింది. తుఫాను ప్రభావం ఉద్యానవనం పంటల విషయంలోనూ తీవ్రంగా ఉంది. ఇందులో 87984.75 హెక్టార్ల విస్తీర్ణం దెబ్బతినడం ఫలితంగా 1339.22 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేయడమయింది.

వ్యవసాయంలో రెండు ఇతర ఉప రంగాలైన పశుగణ సంపద, మత్స్య పరిశ్రమలు సైతం భారీ నష్టాలు చవిచూశాయి. 1406 పెద్ద పశువులు, 4468 చిన్న పశువులు, అపరిమిత పశుగ్రాస నష్టంతోపాటు 46.35 లక్షల కోళ్లు చనిపోయాయి. సామాజిక పశు ఆరోగ్య కేంద్రాలు, కోళ్ల షెడ్లు దెబ్బతిన్నాయి. పశుసంవర్ధక రంగానికి మొత్తం నష్టం రూ. 212.14 కోట్లుగా ఉంటుందని అంచనా వేయడమయింది. అదేవిధంగా, రూ. 98.29 కోట్ల మేరకు చేపల పడవలు, వలలు, చేపల చెరువులకు భారీ నష్టాలు సంభవించాయి.

గృహనిర్మాణ రంగంలో సైతం భారీ నష్టాలు నమోదు అయ్యాయి. పెనుగాలులు, అధిక వేగం గాలులు, ఎడతెగని వర్షపాతం వల్ల 2 లక్షలకుపైగా గృహాలు దెబ్బతిన్నాయి. 2470 గృహాలు పూర్తిగాను, 11097 గృహాలు తీవ్రంగాను, 1.36 లక్షల గృహాలు పాక్షికంగాను దెబ్బతినడంతోపాటు 49363 గుడిసెలు, 1359 పశువుల షెడ్లు కూడా దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న గృహాల నష్టాన్ని మొత్తంగా రూ. 3236.32 కోట్లుగా అంచనా వేయడమయింది. ఇందులో వాణిజ్య సంస్థలు, ఎపిఎల్‌కు చెందిన గృహాలకు జరిగిన నష్టాలు కూడా చేరివున్నాయి.

విశాఖపట్టణం జిల్లాలో తుఫాను వల్ల 824 తోపుడుబండ్లు, 3635 వీధి విక్రేత / రిక్షాలు, 160 ఆటోరిక్షాలు దెబ్బతిన్నాయి.

మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాలను ఇతర ప్రభుత్వ శాఖల నుండి కూడా నివేదించబడ్డాయి. ప్రధాన శాఖలలో ఆర్ & బి (రూ. 111.80 కోట్లు), పంచాయతీరాజ్ (రూ. 995.20 కోట్లు), జిపి రోడ్లు (రూ. 410 కోట్లు), పురపాలక, పట్టణాభివృద్ధి (రూ. 3621.56 కోట్లు), ఆర్‌డబ్ల్యుఎస్, పారిశుద్ధ్యం (రూ. 126.9 కోట్లు), సాగునీరు (రూ. 317.05 కోట్లు), పాఠశాల విద్య (రూ. 51.29 కోట్లు) ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమం (సుమారు 100 కోట్లు), ఆరోగ్య మౌలిక సదుపాయాలు (రూ. 308.78 కోట్లు), విద్యుత్ రంగం (రూ. 1290 కోట్లు), అటవీ (రూ. 315 కోట్లు), ఏపిఐఐసి పార్కులు (రూ. 1275 కోట్లు), ప్రైవేటు పరిశ్రమలు (రూ. 6136.20 కోట్లు చేరి వున్నాయి.

పై దానికి అదనంగా వివిధ శాఖలు / ఏజెన్సీలైనటువంటి పట్టు పరిశ్రమ, చేనేత మరియు జౌళి, ఇంటర్మీడియేట్ విద్య, ఇఎన్‌సి ప్రజా ఆరోగ్యం, ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ కార్పొరేషన్ లిమిటెడ్, రెవెన్యూ మౌలిక సదుపాయాలు (విశాఖపట్టణం), అగ్నిమాపక సేవలు, ఎపిఎస్‌పి 5వ బెటాలియన్ కమాండెంట్ ఎపి బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు కూడా నష్టాలు జరిగాయని నివేదించాయి.

<u>హాని / నష్టాల సంక్షిప్తి :</u>

శాఖలకు రూ. 21,908 కోట్ల మొత్తం నష్టం వాటిల్లినట్లు అంచనా వేయడమయింది.

హుద్‌హుద్ తుఫాను వల్ల జరిగిన నష్టాలు / హానికి సంబంధించి ఒక మెమోరాండంను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడమయింది. ఈ క్రింది విధంగా నివేదించడమయింది.

రక్షించడానికి, సహాయానికి, తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ. 9856 కోట్ల మొత్తం అవసరమవుతుంది. (సహాయానికి & రక్షించడానికి రూ. 1236 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ. 4144 కోట్లు, దెబ్బతిన్న మౌలిక సదుపాయాల శాశ్వత పునరుద్ధరణ కోసం రూ. 4477 కోట్లు).

రక్షించడానికి, సహాయానికి, తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ. 9337 కోట్ల మొత్తం అవసరమవుతుంది. (సహాయానికి & రక్షించడానికి రూ. 716 కోట్లు, జాతీయ విపత్తు స్పందన నిధి (ఎన్‌డిఆర్ఎఫ్) ప్రమాణాల ప్రకారం తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ. 4144 కోట్లు, దెబ్బతిన్న మౌలిక సదుపాయాల శాశ్వత పునరుద్ధరణ కోసం రూ. 4477 కోట్లు).

6

ప్రభావిత ప్రాంతాలకు తక్షణమే సహాయాన్ని అందించడానికి ముందస్తుగా రూ. 1,000 కోట్ల మొత్తాన్ని ప్రధానమంత్రి గారు ప్రకటించారు. అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం యొక్క నివేదిక, కేంద్ర ప్రభుత్వ హోం శాఖ మంత్రి నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ (హెచ్‌సిఎల్) పరిశీలన, దాని సిఫారసులు పెండింగులో ఉండగా ముందస్తుగా రూ. 400.00 కోట్ల మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.

తుఫాను కారణంగా జరిగిన నష్టాలను ప్రత్యక్ష మదింపు చేయడానికి 2014, నవంబరు 25-28 కాలంలో సంబంధిత జిల్లాలలోని ప్రభావిత ప్రాంతాలను అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం (ఐఎంసిటి) సందర్శించింది. ఉన్నత స్థాయి కమిటీ (హెచ్‌ఎల్‌సి) సమావేశం 15-12-2014 తేదీన జరిగింది. అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం యొక్క నివేదిక, కేంద్ర ప్రభుత్వ హెచ్‌సిఎల్ యొక్క సిఫారసులను పరిశీలించిన మీదట ఎన్‌డిఆర్‌ఎఫ్ నుండి ఈ విషయంలో సహాయ పరిమాణాన్ని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం జరుగుతుంది. రాష్ట్ర విపత్తు స్పందన నిధి (ఎస్‌బిఆర్‌ఎఫ్), జాతీయ విపత్తు స్పందన నిధి (ఎన్‌డిఆర్‌ఎఫ్), పరిపాలన నియమ సంపుటిలోని 6వ పేరాలో పొందుపర్చిన నిబంధనల ప్రకారం నిధులను విడుదల చేయడమవుతుంది.

వ్యవసాయ ఇన్‌పుట్ సబ్సిడీ, పట్టు పరిశ్రమ ఇన్‌పుట్ సబ్సిడీ, గృహ నష్టాలు, పశువుల నష్టం, కోళ్ల పరిశ్రమ నష్టం, పశువుల షెడ్‌ల నష్టం, మత్స్య పరిశ్రమ, పడవలు & వలల నష్టాలకు సంబంధించిన సహాయ / మద్ధతు పరిమాణాన్ని పెంచడమయింది.

జివిఎంసి ప్రాంతంలోని ప్రభావిత కుటుంబాలకు 10 నిత్యావసర సరకుల సరఫరా, కాఫీ ప్లాంటేషన్, టేకు, యూకలిప్టస్, సర్వి చెట్లకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ వంటి కొన్ని కొత్త అంశాల విషయంలో కూడా ఉపశమన సహాయాన్ని కూడా ప్రకటించడం జరిగింది.

ఈ తేదీవరకు వెరశి రూ. 844.60 కోట్ల మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంతవరకు విడుదల చేసింది. (ఎన్‌డిఆర్‌ఎఫ్ నుండి రూ. 790.25 కోట్లు మరియు టి.ఆర్. 27 క్రింద సంబంధిత కలెక్టర్లు డ్రా చేసిన మొత్తం రూ. 54.35 కోట్లు).

నిమ్మకాయల చిన్నరాజప్ప,
ఉప-ముఖ్యమంత్రి
(హోం & విపత్తు నిర్వహణ)

శ్రీ సి.రామచంద్రయ్యః అక్టోబర్ 12వ తేదీ బంగాళాఖాతంలో హుద్‌హుద్ తుఫాను రావడం జరిగింది. అయితే 48 గంటల ముందే మెట్రలాజికల్ డిపార్టుమెంట్‌వాళ్ళు తుఫాను వస్తున్న సమాచారాన్నిచ్చారు. తుఫాను తీవ్రంగా వస్తుందనీ, మత్స్యకార్మికులు ఒడ్డుకు వచ్చేయాలనే సూచనచేస్తూ దీనిపైన విస్తృతమైన ప్రచారం కూడా చేశారు. దీనివల్ల శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంతోపాటు, తూర్పుగోదావరిజిల్లాలోని కొంత భాగంలో కూడా నష్టం వాటిల్లింది. మనది ఈస్ట్‌కోస్ట్. It is highly vulnerable for the cyclone. ఒరిస్సా నుండి కలకత్తా వరకు ఈ తుఫాన్లు ఎక్కువగా వస్తుంటాయి. ఒరిస్సాలో ఈ సమాచారం తీసుకున్న తరువాత ఇది తప్పులు పట్టేటటువంటి పరిస్థితి కాదు. నేను ప్రభుత్వానికి ఆ సూచనలు కూడా ఇచ్చే పద్ధతిలోనే చెప్తున్నాను. ఒరిస్సాలో ఏ మాత్రం ప్రచారంలోలేని ముఖ్యమంత్రి he has taken all the precautions. పాలు, క్యాండిల్స్, మంచినీళ్ళు, రవాణాకు వాహనాలను సిద్ధంగా ఉంచారు. నేను ఒక ఎం.పికి ఫోన్ చేస్తే వచ్చిన సమాచారమది.

అయితే, మనమిక్కడ ఫెయిల్ అయినామేమో అనిపిస్తోంది. ఈ తుఫాను చాలా తక్కువగా ఉంటుందని మనమనుకున్నాం. 9వ తారీఖునుంచే వాతావరణశాఖ నుండి తుఫాను హెచ్చరికలు వచ్చాయి. అప్పుడు ముఖ్యమంత్రిగారు హైదరాబాద్‌లో ఉన్నారు. ఖచ్చితంగా వారు అక్కడికి పోవాలని ఏమీ లేదు. ఇక్కడినుంచైనా ఆపరేట్ చెయ్యచ్చు. ప్రభుత్వం చాలా విస్తారంగా 13 జిల్లాలో ఉంది. కానీ ఒరిస్సాలో తీసుకున్నటువంటి ముందు జాగ్రత్త చర్యలను మనం కూడా తీసుకుని ఉంటే విశాఖవాసులకుకానీ, ఆ చుట్టుపక్కల ఉన్నవాళ్ళకికానీ ఇంత ఇబ్బంది కలిగి ఉండేది కాదు. మనం కొన్ని నిత్యావసర వస్తువులను అక్కడికి తరలించి భద్రపరిచి ఉంటే ఇంత ఇబ్బంది వచ్చి ఉండేదికాదు. నేను కూడా ఆ ప్రాంతాలకు పోయాను.

12వ తేదీ ఆదివారం నాడు ముఖ్యమంత్రిగారు మీడియా ముందు మాట్లాడుతూ ముగ్గురే చనిపోయారనీ, ఒక్కొక్కరికీ అయిదు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా అనౌన్స్ చేస్తున్నామనీ, రిలీఫ్ కమీషనర్‌తో మాట్లాడినట్లు లైవ్ టెలికాస్ట్‌లో కూడా చెప్పారు. కానీ భీభత్సమంతా 12వ తేదీ రాత్రి జరిగింది. ఉదయమే ముఖ్యమంత్రిగారికి సమాచారం రాగానే వెంటనే రాజమండ్రి వెళ్ళి అక్కడ్నుంచి రహదారి మార్గంద్వారా విశాఖపట్నానికి వెళ్ళారు. నేనిక్కడ పాయింటవుట్ చేసేదేమిటంటే he is much experienced in relief and rehabilitation. ఇంతకుముందు తూర్పుగోదావరి జిల్లాలో వచ్చినప్పుడు కూడా చేశారు. మరి ఇటువంటి ప్రమాద ఘంటికలు ఉన్నాయని వాతావరణశాఖ సమాచారమిస్తే ఎందుకు అంచనా వేయడంలో వైఫల్యం చెందారు. ఎందుకు దీనిని నిర్లక్ష్యంగా తీసుకున్నారు? దాని తరువాత వారు వారం రోజులు అక్కడ కూర్చున్నారు. రెస్టోరేషన్ కొరకు ఎంత పనిచేయాలో అంతా చేశారు. కానీ ఈ అంచనా వేయడంలో ఎందుకు మనం వైఫల్యం చెందాము. That to Mr. Chandrababu Naidu is an experienced administrator, who is familiarized with this relief and rehabilitation in cyclone areas. ఇంకా సిటీలో సహజంగానే చెట్లు కూలడం, తరువాత కరెంటు స్తంభాలంతా పడిపోవడం, విద్యుత్తు సరఫరా ఆగిపోవడంలాంటివన్నీ జరిగాయి. మనం వేరే జిల్లాల నుంచి అక్కడికి సరుకులు తీసుకెళ్ళే పరిస్థితి లేకుండాపోయింది. This is the first lapse on the part of the Government to make a proper assessment about the damage. వెంటనే రు.2000 కోట్లు రిలీఫ్ కావాలని ముఖ్యమంత్రిగారు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగింది.

మ. 12.30

He has not invited the Hon'ble Prime Minister to visit the affected areas. It is on the request of the Hon'ble Chief Minister of Orissa, the Prime Minister has visited. సరే ప్రధాని గారు వచ్చారు, వారికి రాష్ట్రప్రభుత్వానికి మంచి సంబంధాలున్నాయి. మనము అధికారాలు పంచుకుంటున్నాము, వాళ్ళు అధికారాలు పంచుకుంటున్నారు, అంతా ఉంది. But, what is the advantage we have ?

మిస్టర్ ఛైర్మన్ : మోడీ గారు మొదటి రోజు పర్యటించారా?

SRI C. RAMACHANDRAIAH: No Sir, On the very second day, on the request of Mr. Patnayak. ఇది నిజమో కాదో ప్రభుత్వం వాళ్లే చెప్పాలి. నష్టాన్ని గురించి తలా ఒక మాట అన్నారు. కొంతమంది అరవై వేల కోట్ల రూపాయలని అన్నారు, మరి కొంత మంది డెభై వేల కోట్లు అని అన్నారు, మీడియాలో వచ్చింది. ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగితే దీనిని జాతీయ

విపత్తుగా పరిగణించమని రాష్ట్ర ప్రభుత్వం నుండి డిమాండ్ ఎందుకు పంపించలేదు? మరి వేరే చోట డిమాండ్ చేశారు? ఈ డిమాండ్ చేయకపోవడంలో అర్థం ఏమిటి? కేంద్రప్రభుత్వం బృందం వచ్చి నష్టాన్ని రూ. 680 కోట్లుగా తేల్చింది. మనం చేసిన అసెస్‌మెంట్‌కు, వాళ్లు చేసిన అసెస్‌మెంటుకు అంత తేడా ఎందుకు వచ్చింది? కేంద్రప్రభుత్వం వెయ్యికోట్లు మంజూరు చేసింది కానీ ఒక్క పైసా కూడా ఇప్పటి వరకూ అందలేదు. ఆయన ప్రకటించింది అడ్వాన్స్ మాత్రమే. అది ప్రభుత్వమే వివరణ ఇవ్వాలి. ఇంత నష్టం జరిగినా కూడా కేంద్రప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా సహాయం అందలేదు. ఇది మనకు రాబోయేటటువంటి మన క్లైమ్స్‌లో అడ్వాన్స్‌గా ఇచ్చారు. రూ. 400/- కోట్లు ఇచ్చారు, మిగతాది ఇస్తామన్నారు. ఇప్పుడు మొత్తం రూ. 680 కోట్లకు గాను, రూ. 220/- కోట్లు మాత్రమే మనకు వస్తుంది. అది కూడా అడ్వాన్స్. రాష్ట్రప్రభుత్వం మాత్రం ఏ ఏ నష్టాలు జరిగాయో వివరిస్తూ, చాలా పెద్ద మొత్తంలో నిధులకు అర్జీలు పెట్టారు. రాష్ట్రప్రభుత్వ నిధుల నుండి ఇచ్చి ఈ రిలీఫ్ అండ్ రీహాబిటేషన్ టేకప్ చేస్తారా? నాకు తెలిసి విశాఖపట్టణంలో జరిగిన నష్టం ఇన్‌స్టిట్యూషనల్ నష్టం. చెట్లు విరిగిపోయాయి, వాటిని కార్పోరేషన్ భరిస్తుంది. ఎలక్ట్రికల్ పోల్స్ విరిగిపోయాయి, విద్యుత్ శాఖ భరిస్తుంది. కానీ వ్యక్తిగతమైన నష్టం ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో జరిగింది. ముఖ్యంగా మత్స్యకారులు బాగా దెబ్బతిన్నారు. వాళ్ల గ్రామాలు, బోటులు దెబ్బతిన్నాయి. కొన్ని నెలల వరకూ వారికి జీవనాధారం లేకుండా పోయింది. మాకు వచ్చిన సమాచారం ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో చాలా ప్రాంతాలలో విద్యుత్ పునరుద్ధరించబడలేదు. మేము కొన్ని ప్రాంతాలకు వెళ్లి చూశాము కొబ్బరి చెట్లు దారుణంగా పడిపోయాయి. రైతులు మళ్లీ కొబ్బరిచెట్లు నాటి, అవి పెరిగి పంట చేతికి వచ్చేంత వరకూ రైతులు ఎలా బ్రతకాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. నేను ప్రభుత్వాన్ని అడుగుతున్నాను, తగినంత నిధులు కేంద్రప్రభుత్వం నుండి తీసుకురాలేకపోయారు? మీకు ఇస్తారన్న నమ్మకం మాకు లేదు, మీ రాజకీయాలతో మాకు అనవసరం. రాష్ట్రప్రభుత్వం ఇంత కష్టాలలో ఉన్నప్పుడు కేంద్రప్రభుత్వం ఏదో ఉదారంగా చేయడం కాదు, సహాయం చేయాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వానికి ఉంది. వాళ్లు సహాయం చేయలేదు. వాళ్ల దగ్గరి నుండి తెచ్చుకోవడంలో విఫలమయ్యాము. ఇప్పుడు ఈ మూడు జిల్లాలకు ఏదైనా ప్యాకేజీ ఇస్తారా? వెంటనే ఈ తుఫాను బాధితులకు నిధులు ఇచ్చి, యుద్ధప్రాతిపదికన సహాయం చేస్తారా? Efficient Government Machinery మనకు ఉంది. ఇక్కడి నుండే అధికారులకు సూచనలు , ఆదేశాలు ఇచ్చి సహాయకార్యక్రమాలను నిర్వహించవచ్చు. దయచేసి దాని గురించి ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి, ఏదో మామూలు సమాచారం ఇచ్చాము అనేది కాదు, మత్స్యకారులకు, కొబ్బరిచెట్ల రైతులకు, పండ్లతోటల యజమానులకు ఏవిధంగా సహాయపడతారనే అంశాన్ని ప్రతిపక్ష పార్టీలను కూడా దృష్టిలో పెట్టుకుని సమాధానం ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : అధ్యక్షా, ఈ హుద్ హుద్ తుఫానును ఎదుర్కోవడం, ఆ తరువాత ప్రజలకు కలిగిన కష్టాన్ని నివారించుటకు, విపత్తును దూరం చేయడానికి మన రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు చేసిన ప్రయత్నాల గురించి వివరిస్తూ, గౌరవ ఉపముఖ్యమంత్రి శ్రీ నిమ్మకాయల చినరాజప్ప గారి పేరుతో ఒక పేపర్‌ని ప్రజెంట్ చేయడం జరిగింది. దీనిలో ప్రభుత్వం పేర్కొంటున్న విధంగా అంచనా వేయబడినటువంటి నష్టం రూ.33,114/- కోట్ల రూపాయల ఆస్థినష్టం జరిగిందని ప్రభుత్వం ప్రకటిస్తున్న నేపథ్యంలో గౌరవ ప్రధాన మంత్రిగారు మరుసటి రోజునే ఇక్కడకు వచ్చి వెయ్యి కోట్ల రూపాయల తక్షణ సహాయం ప్రకటిస్తాము, ఆ తరువాత అంచనాలు వేసి దాని ప్రకారంగా కేంద్రప్రభుత్వం మీ వెంట ఉంటుందని చెప్పి ఒక ఆశావాహమైన దృక్పథాన్ని,

ప్రజలకు నమ్మకాన్ని, విశ్వాసాన్ని కలిగించడంలో వారు జయప్రదం అయ్యారు. ఈ సందర్భంగా నేను మనవి చేసేదేమంటే వెంటనే ముఖ్యమంత్రిగారు అక్కడకు వెళ్లడం, అక్కడుండే ప్రభుత్వ అధికారులను, శాఖలను అప్రమత్తం చేయడంలో వారు సముచితమైన పాత్రను నిర్వహించారు. ముఖ్యంగా రవాణా శాఖలకు సంబంధించిన ఆర్.టి.సి కార్మికులు, విద్యుత్ శాఖకు సంబంధించిన విద్యుత్ అధికారులు మున్సిపల్ అధికారులు ఆదేశాల కోసం ఎదురు చూడకుండా అక్కడుండేటటువంటి ఇబ్బందులను పట్టించుకోకుండా సెలవులో ఉండే అధికారులు సైతం స్వచ్ఛందంగా వచ్చి తుఫాను వెలసిన ఎనిమిది గంటలలోపు విశాఖపట్టణం విధుల్లోకి వచ్చి రిజర్వ్‌ఫోర్స్‌గా డిపోలలో ఉండి ప్రజలకు అందుబాటులో ఉండడం అనేది ఒక దేశభక్తి, సేవా దృక్పథం, కలిగిన అందరినీ ఉత్తేజపరచే విధంగా ఉంది. ముఖ్యంగా ఒరిస్సా, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాలనుండి ఈ శాఖలకు సంబంధించిన అధికారులు స్వచ్ఛందంగా వచ్చి ఈ యొక్క శాఖలతో సమన్వయపరచుకొని ప్రజలను ఈ బాధలనుండి బయటపడేసేందుకు తీవ్రమైన కృషి చేశారు. ముందుగా వారికి ధన్యవాదాలు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మిస్టర్ ఛైర్మన్ : ముఖ్యంగా విద్యుత్ శాఖ వాళ్లు బాగా పనిచేశారు. నేను, డిప్యూటీ ఛైర్మన్ గారు అక్కడకు వెళ్లి పరిశీలించాము.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : అవును సార్, చెట్లను తొలగించే కార్యక్రమం, విద్యుత్ వైర్లను పునరుద్ధరించే కార్యక్రమంలో ఒరిస్సా, తమిళనాడు ఉద్యోగులు మన ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులకు అత్యంత నైపుణ్యంతో తమ అనుభవాలను ఉపయోగించి సహాయపడ్డారు. వారికి ధన్యవాదాలు తెలియజేయాల్సిన అవసరం ఉంది. అయితే ప్రశ్న ఏమిటంటే మూడు రోజుల ముందుగా వాతావరణ శాఖ వారు విశాఖపట్టణం వద్ద తీరం దాటుతుంది. 200 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. తీవ్రమైన నష్టం జరుగుతుందని ప్రతీ రెండు మూడు గంటలకు ఒకసారి హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో 12వ తారీఖున తీరం దాటితే, ఆ తీరం విశాఖపట్టణం మీదగా దాటింది కాబట్టి ఆ వేగం ఎక్కువగా ఉండడం వలన విశాఖపట్టణం పూర్తిగా చెట్లు లేని నగరంగా మారిపోయింది. ఈ రోజు ఇచ్చిన నివేదికలో అరవైవేలు, డెభైవేలని ఏదైతే నివేదిక ఇచ్చారో అది అధికారులు ఇచ్చిన లెక్కగా, చెట్లు అనే నిర్వచనం ప్రాతిపదికగా ఇచ్చిందే తప్ప విశాఖపట్టణం పూర్తిగా చెట్లులేని నగరంగా మారిపోయిన మాట వాస్తవం. దీనిని తక్కువ చేసి చెప్పడం మంచిది కాదు, దానిని ఎలా పునరుద్ధరించాలి, అందుకోసం ఏం చేయాలనేది మన ముందు ఉన్నటువంటి సమస్య.

మ.12.40

ఇదే సందర్భంలో 12 వ తారీఖు కంటే ముందు 11 వ తేదీనాడు రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేసింది. అలాగే 10 వ తారీఖునాడు రాష్ట్రప్రభుత్వం ఏమిచేసింది, 9 వ తారీఖు నాడు ఏ విధమయినటువంటి చర్యలు చేపట్టింది? ప్రజుల ఎడల బాధ్యతతో కూడిన వ్యవహారం నిర్వహించకపోవడం అనేది చాలా దురదృష్టకరమయిన విషయం. తుఫాను వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్వెన్షనుగాని, ముఖ్యమంత్రిగారు స్వయంగా పాల్గొనడము గాని, అలాగే ప్రధానమంత్రిగారు వచ్చి చూడడం గాని జరిగింది. అయితే వారం రోజుల తరువాత 400 కోట్ల రూపాయలు అడ్వాన్సుగా ఇవ్వడం ఏమిటి అధ్యక్షా? మేము సహాయం చేస్తామన ప్రధానమంత్రిగారు స్వయంగా ప్రకటించి, విశాఖపట్నం మీద ఆయనకు ప్రత్యేకమయిన శ్రద్ధ

ఉన్నట్లు ఒక ఉదాహరణ కూడా ఇచ్చారు. ప్రధానమంత్రిగారు స్వయంగా వచ్చి, ప్రజలతో ఇంటరాక్ట్ అయి, తక్షణమే సహాయం చేస్తానని ప్రకటించి, మా పూర్తి సహకారం ఉంటుంది అని, మొత్తం ప్రభుత్వం అంతా మీ వెంట ఉంటుంది అని చెప్పి హామీ ఇచ్చి, అడ్వాన్సుగా 400 కోట్ల రూపాయలు ఇవ్వడమేమిటి, ఇంకా 600 కోట్ల రూపాయలకి సంబంధించి, మేము ప్రాసెస్ చెస్తున్నాం, ప్రాసెస్ చేస్తున్నాం అని చేప్పడం ఏమిటి? కేంద్ర ప్రభుత్వం ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక భాగమని, ఇక్కడ ప్రజానీకం ఎదుర్కొంటున్నటువంటి కష్టాలకి, ఇబ్బందులకి కేంద్రప్రభుత్వం కూడా బాధ్యత వహించ వలసిన అవసరం ఉందని, దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించక పోవడానికి ఉన్న ఇబ్బందులు ఏమిటనేది ప్రజలకు చెప్పవలసిన అవసరం ఉన్నది. ఒకవేళ అలా ప్రకటించలేకపోతే గ్రాంటు రూపంలో కాని, అడ్వాన్సు రూపంలో కాని, లోన్ రూపంలో కానీ ఎలా ఇవ్వడానికి వీలవుతుందనేది చర్చించడంలో, రాష్ట్రప్రభుత్వము, కేంద్రప్రభుత్వము విఫలం కావడం చాలా విచారించదగ్గ విషయం. దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైన పరిశీలన చేయవలసిన అవసరం ఉంది. గత 125 సంవత్సరాలలో 77 పెద్ద తుఫానులు వచ్చినట్లుగా ప్రభుత్వం ప్రకటిస్తున్నది. అంటే ప్రతి 14, 15 నెలలకు తుఫానులు రావడము, దానివలన నష్టాలు జరగడము అవుతున్నది. చిన్నవో, పెద్దవో, ప్రాంతీయమైనవో, లేదా 3,4 జిలాల్లకు తుఫానులు రావడమే జరుగుతూ ఉన్నది. ఇక మనరాష్ట్రానికి సంబంధించి దివిసీమగాని, నిన్నటి హుద్‌హుద్ గాని తీవ్ర నష్టాలు కలిగించాయి. పదివేల మంది వరకు ప్రజలు అపారంగా నష్టపోయిన ఘటనలు ఉన్నాయి. ఈ తుఫానులకి సంబంధించిన ఈ ప్రాంతపు నైసర్గిక స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పరస్పరం సంప్రదించుకుని, దీనికొక శాశ్వత పరిష్కార మార్గం కనుగొనాలి. నైసర్గిక స్వరూపం దృష్ట్యా తుఫానులు రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్న ప్రాంతంగా విశాఖపట్నం గుర్తించబడింది. ఇక్కడి ప్రజలకి ఏడాదికో, ఏడాదిన్నరలో తుఫానులు రావడం, తీవ్రంగా నష్టపోవడంజరుగుతున్నది. మంత్రులు, ప్రభుత్వాలు నష్టం జరిగిన తరువాత ప్రతిస్పందించడము, చనిపోయిన వారికో, బ్రతికున్న వారికో నష్ట పరిహారం ప్రకటించడం జరుగుతుంది. జరిగిన నష్టానికి తగిన పరిహారం చట్టప్రకారంగా కాని, అధికారపూర్వకంగా గాని, న్యాయబద్ధంగా గాని ఇవ్వకపోవడం, జరిగే నష్టాన్ని నివారించడానికి డిపార్టుమెంటులు కొన్ని ముందస్తు చర్యలు తీసుకోకపోవడం, అలాగే ఇతర చర్యలు చేపట్టడానికి కావలసిన నిర్దిష్టమైన కార్యాచరణ సూత్రాలు రూపొందించక పోవడమనేదే విచారించదగ్గ విషయం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశలో ఆలోచించి, తగిన మాన్యువల్ తయారుచేయవలసిన అవసరం ఉంది. ఎందుకంటే 2014 వ సంవత్సరం ముగిసి 2015 వ సంవత్సరం లోకి అడుగుపెట్టబోతున్నాము. ఇంకా ఈ ప్రభుత్వం ఉండబోయే ఈ నాలుగున్నర సంవత్సరాలలో ఇంకో 3, 4 తుఫానులు రావడానికి అవకాశం ఉందని రికార్డులని పరిశీలిస్తే తెలస్తున్నది. ఈ మూడు తుఫానులు వచ్చిన తరువాత వాగ్దానాలు చేయడం కాకుండా, అవి రాకముందే, ఆయా ప్రాంతాలలో తుఫానులు రాకముందు ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవాలి, వచ్చిన తరువాత ఏ చర్యలు తీసుకోవాలి, జరగబోయే నష్టాన్ని ఎలా ఎదుర్కోవాలి, వేరు వేరు డిపార్టుమెంటులలో ఉండే వారి బాధ్యతలు ఏమిటనేది చూసుకోవాలి. ముఖ్యమంత్రిగారు ఫోన్ చేస్తేనో, కమిటీలను రూపొందిస్తేనో, ఒక కంట్రోల్ రూం పెడితేనో ప్రతిస్పందించడం కాకుండా, పన్నులు ఎలా వసూలు చేస్తారో, బస్సులో డబ్బులు ఎలా వసూలు చేస్తారో, అలాగే తుఫానులకి సంబంధించి, తీర ప్రాంతాల ప్రజల గురించి, ఒక విధి విధానాన్ని, ఒక కోడ్‌ని, డిసిప్లైన్‌ని రూపొందించాలి. అందరికంటే పల్లెకారులు ఎక్కువగా నష్టపోతున్నారు. వారికి సహజంగా చేపల వేటకి వెళ్లకుండా కొన్ని సెలవులు ప్రకటిస్తుంటారు. అలాంటి సందర్భాలలో వారికి అవసరమైన కొన్ని నిత్యావసరాలు కానీ, డబ్బులు కానీ ఇచ్చి, చేపలు అభివృద్ధి చెందడానికి వీలు కల్పిస్తారు. ఈ

హుద్‌హుద్ తుఫాను వచ్చినప్పుడు బోట్లు ధ్వంసమైపోయాయి. బోట్లకి మరమ్మత్తులు చేయవలసినటువంటి పరిస్థితులలో ఈ రోజుకి కూడా అవి మరమ్మత్తులు కాకపోవడం వలన, వేటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. పూర్తిగా చెడిపోయిన వాటికో, సగం పాడయిపోయిన వాటికో ఐదు లక్షలు, మూడు లక్షలు ఇచ్చామని చెబుతున్నారు. సంతోషంగా ఉంది. కానీ, ఇరవై లక్షల బోట్లు చెడిపోతే ఆరు లక్షలు మాత్రమే ఇచ్చి, మిగతా డబ్బు వారిని పెట్టుకోమంటున్నారు. దానికి సంబంధించి వారికి వడ్డీ లేకుండా ఫ్రీ లోన్ ఏర్పాటు చేశారా? లేకపోతే జాతీయ ఫిషర్‌మెన్ సంస్థ నుంచి వారికి డబ్బులు వచ్చే ఏర్పాటు కాని చేశారా? ఈ అంశాల మీద ప్రభుత్వపు చర్యలు మత్స్యకారుల యొక్క జీవన భృతిని, జీవన వ్యాపకాన్ని పెంచడంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు అరకొరగానే ఉన్నాయి. దయచేసి ఇప్పటికైనా ప్రభుత్వం సముద్రాన్ని నమ్ముకొని బతికేవాళ్లు, ఆ పని తప్ప వేరే పని చేతగాని వాళ్లకి డీజిల్ ఇవ్వడంగాని, బోట్లు ఇవ్వడం గాని, సేఫ్టీ ఎక్విప్‌మెంటు సమకూర్చడం గాని చేయవలసి ఉంది. మూడు నెలలు గడిచినా కూడా దీనికి సంబంధించి ప్రభుత్వం చేసిన దానికంటే చేయవలసింది చాలా ఉండటం దురదృష్టకరమైన విషయంగా నేను మనవి చేస్తున్నాను. రెండవ అంశం ఏమిటంటే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి ఇతర ప్రాంతాలకు వలసపోవడం ఎక్కువగా జరుగుతుంది. ఈ జిల్లాల నుంచి వారు తమిళనాడుకి, బొంబాయికి, హైదరాబాదుకి నిర్మాణ కూలీలుగా, హమాలీలుగా, ఆటో వర్కర్సుగా, రిక్షా పుల్లర్సుగా, కాంట్రాక్టు లేబర్సుగా వెళ్లి పనిచేయడం ఎక్కువగా జరుగుతుంది. వీరు వారి స్వస్థలాలకు వెళ్లడానికి నాలుగైదు రోజులు పడుతుంది. వారి కూలిపోయిన ఇళ్లని బాగు చేసుకోడానికి ప్రభుత్వం ప్రకటించిన సహాయం చాలా తక్కువగా ఉంది. అలాగే ఆటోవర్కర్సుగాని, రిక్షా పుల్లర్స్‌గాని, కన్‌స్ట్రక్షన్ వర్కర్సుగాని, అసంఘటిత రంగంలోని కార్మికులు గాని, వారు దాదాపు 15,20 రోజుల వరకు పనిలోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో ఉపాధి కోల్పోయిన వారందరికి బియ్యం ఇచ్చారు. కానీ వారు అప్పులు చేసుకోవలసిన పరిస్థితి వచ్చింది. వీరందరికి జరిగిన నష్టాలను అంచనా వేయడంలో గాని, లెక్కలు రూపొందించడంలో గాని, విధి విధానాలు రూపొందించడంలో ప్రభుత్వం జయప్రదం కాలేదనే విషయాన్ని మనవి చేస్తున్నాను. అలాగే రైతుల వ్యవసాయం, తోటలు, కొబ్బరిచెట్లకి కలిగిన నష్టాలు దీర్ఘకాలికమైనవి. ఒక కొబ్బరి చెట్టు కూలిపోతే వెంటనే ఏదో పరిష్కారం చేస్తే కాదు, మళ్లీ కొబ్బరిచెట్టు పెడితే, అది పెరిగి, కాపు కాయడానికి మూడు నుంచి ఐదు సంవత్సరాలు పడుతుంది. ఈ నష్టాన్ని పూడ్చేందుకు సెన్సెస్ వర్కౌట్ చేయవలసిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వము, రాష్ట్ర ప్రభుత్వము కలిసి, ఈ విషయాలమీద ఖచ్చితమయిన అంచనాలకి రావడానికి, కేంద్ర ప్రభుత్వానికి సంబందించి హైలెవెల్ కమిటి గాని, ఇంటర్ మినిస్టీరియల్ కమిటీలు గాని, ఆంధ్రప్రదేశ్ రావడానికి చాలా సమయం పట్టింది. వెంటనే వచ్చిఉంటే అక్కడ ఉన్నటువంటి తీవ్రత, భయానక దృశ్యాలు కళ్లకు కట్టినట్లు ఉండేది. తరువాత ఎప్పుడో వచ్చి, అక్కడి బీభత్సాన్ని , జరిగిన నష్టాన్ని చాలా తక్కువ అంచనా వేసిన విధానం మాత్రం సరైనది కాదు.

12.50 PM

రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.5,000 కోట్లు అడిగితే, కేంద్ర ప్రభుత్వం తరఫున ప్రధానమంత్రి గారు రూ.1000 కోట్లు ప్రకటించినా, ఇంతవరకు నయాపైసా డబ్బులు ఇవ్వకుండా, ఈ హుద్ హుద్ తుఫానుకు సంబంధించి మేం అది చేశాం, ఇది చేశాం అని చెప్పడం గానీ, లేకపోతే ముఖ్యమంత్రి గారు అక్కడికి పోయారు కాబట్టి, ప్రభుత్వం యొక్క రెస్పాన్స్ బాగుందని చెప్పడం గానీ, ప్రజలకు సంబంధించినంత వరకు, వాతావరణానికి సంబంధించి వస్తున్న మార్పుల వల్ల వచ్చే

ఎఫెక్ట్‌ని నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారనే దాని మీద వారిచ్చిన సమాధానంలో ఏమీ లేదు. వీటన్నింటినీ కూడా పరిశీలించాలని, భవిష్యత్తులో జరగబోయే దానికిది తార్కాణంగా ఉండాలని, నష్టపరిహారం పొందనటువంటి వారికి పరిహారం ఇవ్వాలని కోరుతూ, కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేలా రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి ఒక తీర్మానం పంపడమో, లేకపోతే ఒక డెలిగేషనో అక్కడికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టి, తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం కోరినటువంటి రూ.5000 కోట్లు గ్రాంటు రూపంలో మనకివ్వాల్సిన అవసరముందని నేను ఈ సందర్భంగా నా తరఫున, మా పార్టీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు మరొక్కసారి ధన్యవాదాలు తెలియపరస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః అధ్యక్షా, ఈ తుఫాను అనేటటువంటిది మనం దశాబ్దాల కాలంగా చూస్తూనే ఉన్నాము. ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో ఇది రావడం జరుగుతుంది. ఎన్నో తుఫాన్లు, ఉప్పెనలు చిన్నప్పటి నుండి చూస్తూనే ఉన్నాము. భయంకరమైన తుఫాన్లు రావడం మనకు తెలుసు. సునామీలేమిటి, నీలం, పీలా ఇలా రకరకాల పేర్లు పెట్టి తుఫాను వస్తోందని, వచ్చిందని మనం చెబుతున్నాం. దాని వల్ల మనం విపరీతంగా నష్టపోవడం జరుగుతోంది. ఆ నష్టపోవడం కూడా ఎలాంటిదంటే – పండిన పంటలన్నీ మొత్తం నీళ్లలో మునిగిపోవడం, ఇళ్లు కూలిపోవడం వంటివన్నీ మనం చూశాము. రైల్వే ట్రాకులు దెబ్బతినడమనేది అనేక ప్రాంతాల్లో చూస్తుంటాము. రేణిగుంట, నెల్లూరు లాంటి ప్రాంతాల్లో మనం ఎక్కువగా చూస్తుండేవాళ్లం. ఈ విధంగా తుఫాన్లు వస్తాయనేది దృష్టిలో ఉంచుకునే, ఆంధ్రప్రదేశ్‌ని విభజించేటప్పుడు, తుఫాన్లు వచ్చే ప్రాంతంగా దీన్ని పరిగణించాలని నేను అనేక సార్లు చెప్పడం జరిగింది. రాయలసీమలో కరువు ప్రాంతాన్ని, ఆంధ్రప్రదేశ్‌లో తుఫాను ప్రాంతాన్ని మీరు దృష్టిలో పెట్టుకుని పంపకాలు చేస్తే, బాగుంటుందని కూడా పదే పదే అనేక వార్తా ఛానెళ్లలో, ఇంకా అనేక పద్ధతుల్లో మేము మాట్లాడటం జరిగింది. ఎందుకు చెబుతున్నామంటే, ముందుచూపు ఉండాలి కాబట్టి, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలి గనుక. తాత్కాలికమైన సమస్యలు కొన్ని ఉంటాయి, యుద్ధ ప్రాతిపదిక మీద పూర్తి చేయాల్సినవి కొన్ని ఉంటాయి. దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలను కూడా పరిష్కారం చేయాల్సి ఉంటుంది. శాశ్వత పరిష్కారం చేయాల్సినవి మరికొన్ని ఉంటాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఏ ప్రభుత్వాలు వచ్చినా కూడా, దశాబ్దాల కాలంగా అలాంటి చర్యలు చాలా వరకు చేపట్టలేదు. అయితే, ఈనాడు ఈ ప్రభుత్వం వచ్చిన కొత్తలో అనేక సమస్యలతో సతమతమౌతున్నప్పుడు, ఆర్థికంగా కూడా పరిస్థితి బాగోలేనప్పుడు, మానసికంగా బాధతో ఉన్నప్పుడు, ఈ రాష్ట్రం విడగొట్టబడ్డ సంగతి అందరికీ తెలుసు. విడగొట్టబడిన రాష్ట్రంలో గవర్నమెంట్ అధికారంలోకి వచ్చిన తరువాత, రాష్ట్రాన్ని నవ నిర్మాణం చేయాలనుకున్నప్పుడు, రాజధాని ఎక్కడనేది ఒక సమస్యగా ఉన్న సమయంలో, రాజధాని నవ నిర్మాణం చేయాల్సిన పరిస్థితి ఒకవైపు ఉన్నప్పుడు ఈ తుఫాను వచ్చింది. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం మూడు జిల్లాల్లో ముఖ్యంగా విశాఖపట్నంలో కట్టడాలు దెబ్బతినడం, విద్యుత్తు, త్రాగు నీటి సౌకర్యాలు లేకుండాపోవడం, ఆసుపత్రులు, ఇళ్లు, కాలనీలు, పేద వాడి గుడిసెలు, రేకుల ఇళ్లు కూడా దెబ్బతినడం వంటి సంఘటనలు విశాఖపట్నంలో ఈ భయంకరమైన తుఫాను వచ్చినప్పుడు చూశాము. అలాగే, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పంటలు ధ్వంసం కావడం, కట్టడాల కన్నా ఎక్కువగా చిన్న చిన్న పరిశ్రమలు నష్టపోవడం, అలాగే రైతులకు ఎక్కువగా నష్టం జరిగింది. ఈ తుఫాను అనుకోకుండా వచ్చిందా అంటే అనుకోకుండా వచ్చిందేమీ కాదు. నాలుగు రోజులు

ముందుగానే తెలిసింది. తుఫాను అనంతరం పక్కనే ఉన్నటువంటి ఒరిస్సా రాష్ట్ర ముఖ్యమంత్రి గారొచ్చారు. చాలా మంచి జాగ్రత్తలు తీసుకున్నారని రాంచంద్రయ్య గారు కూడా చెప్పడం జరిగింది. అంటే ఏమిటి? ఈ ప్రభుత్వంలో ఉన్న వారు మంచి చర్యలు తీసుకున్నారని డైరెక్టుగా గానీ, ఇన్‌డైరెక్టుగా గానీ వారు చెప్పారు.

నేను ఒక్కటే చెబుతున్నాను. ఒరిస్సాలో ఇదే నవీన్ పట్నాయక్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, అక్కడ కూడా ఇంతకన్నా పెద్ద తుఫాన్లు వచ్చినప్పుడు, భయంకరమైన పరిస్థితులు వచ్చినప్పుడు ఆయన ఏమీ చేయలేని స్థితిలో ఉన్నప్పుడు, ఎంతో ప్రాణనష్టం జరిగినప్పుడు, ఇదే చంద్రబాబు నాయుడు గారు ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉండి, ఇక్కడి నుండి అధికారులను ఒరిస్సాకు పంపించడమే కాకుండా, అనేక వస్తువుల దగ్గర నుండి, ఆహారధాన్యాలు, బియ్యం వంటివన్నీ పంపించడం జరిగింది. ఆ విధంగా ఆ రోజున చంద్రబాబు నాయుడు గారు గొప్ప పేరు తెచ్చుకున్న విషయం మీకందరికీ గుర్తుండే ఉంటుంది. అటువంటిది, వేరే రాష్ట్రంలో తుఫాను వచ్చినప్పుడు, ఎంతో సహకరించిన నారా చంద్రబాబు నాయుడు గారు, ఈనాడు ఈ రాష్ట్రంలోనే తుఫాను వచ్చినప్పుడు మరి ఏ రకంగా స్పందిస్తారనేది మనకందరికీ తెలుసు.

ముందురోజు వచ్చింది, ఆ రాత్రి వచ్చింది కాదు. రాత్రి పూట తుఫాను వచ్చినప్పటికీ, ముందుగానే చంద్రబాబు నాయుడు గారు జాగ్రత్తలు చెప్పి, ప్రాణనష్టం జరగకుండా కాపాడారు. ఆ విషయాన్ని చాలా మంది మెచ్చుకోవడం జరిగింది. ఇంత పెద్ద తుఫానులో అతి తక్కువ మంది ప్రజలు మరణించడమనేది – ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల, ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్ల, వారికి ఆహార భద్రత కల్పించడం వల్ల, ఉండటానికి వసతి సౌకర్యం కల్పించడం వల్లనే ఇది సాధ్యమైందనే విషయం అందరికీ తెలుసు. అయితే, ఆ రోజున ప్రయాణ సౌకర్యాలు లేకుంటే హైదరాబాదు నుండి బెజవాడకు వచ్చి, బెజవాడ నుండి రాజమండ్రికి వెళ్లి, అక్కడ నుండి అతి కష్టం మీద విశాఖపట్నం వెళ్లి అధికారులను పిలిపించి, అందర్నీ పిలిపించి ముఖ్యమంత్రి గారు ఎన్నో జాగ్రత్త చర్యలు చేపట్టారు.

తరువాత, ఆరోగ్యం బాగోక నేను వెంటనే వెళ్లలేకపోయాను గానీ, తరువాత ఏడు రోజుల అనంతరం అక్కడికి వెళ్లాను. నాతోబాటు, వ్యవసాయ శాఖామంత్రి శ్రీ పత్తిపాటి పుల్లారావు గారు మాత్రమే కాకుండా, ఇక్కడున్న మంత్రులు పల్లె రఘునాథరెడ్డి గారు, హోం మంత్రి గారు మాత్రమే కాకుండా, మొత్తం క్యాబినెట్ మంత్రులు, శాసన సభ్యులు, ఇతర పార్టీల వారు కూడా విశాఖపట్నం రావడం జరిగింది. తరువాత, అక్కడి అధికారులు కూడా చాలా గొప్పగా పని చేసిన మాట వాస్తవం. అన్ని డిపార్టుమెంట్లు కూడా చాలా బాగా పనిచేశాయి. ఇలా అన్ని చోట్ల స్వచ్ఛంద సేవా సంస్థలు గానివ్వండి, పార్టీ కేడర్ గానీ, ప్రభుత్వం గానీ తగు చర్యలు తీసుకుని ప్రజలకు ఊరట కల్పించడం జరిగింది. ఎంత ఊరట కలిగించారంటే – మేం అక్కడికి వెళ్లినప్పుడు వాళ్లు చెప్పింది రికార్డెడ్‌గా ఉంది. సీడీల్లో ఉంది. వార్తా చానెళ్లలో కూడా వచ్చింది. ఏ ముఖ్యమంత్రి కూడా ఈ విధంగా చేసుండరు. ఏ ప్రభుత్వం కూడా ఈవిధమైన ఆసరా ఇచ్చుండదు. ఒక భరోసా మాకు కల్పించారు. ఒక ఆధారం మాకు కల్పించారు. నీళ్లు లేక అలమటించిపోతామని అనుకున్నాము. తాగడానికి కూడా నీళ్లు లేవు. పిల్లలకు పాలు, వండుకోవడానికి కూరగాయలు, నిత్యావసర వస్తువులు లేవు. అటువంటి పరిస్థితుల్లో అక్కడి ప్రజలున్నారు. కూరగాయలు మిగిలిపోయి కుళ్లిపోయిన పరిస్థితి. పాలు, నీళ్లు లేవు. కరెంటు సౌకర్యాన్ని 24 గంటల్లోగా పునరుద్ధరించారు.

రెండవదేమంటే, గ్రామీణ ప్రాంతాల్లో 42 గంటల్లో కరెంటు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో ఎంత గొప్పగా అధికారులు పనిచేశారంటే – వాళ్లను కూడా మెచ్చుకోవాల్సిందే. ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు, ఆర్ అండ్ బి, రెవిన్యూ, హోం డిపార్టుమెంటు వారు ఇలా అందరూ పనిచేశారు. ఎవరు పనిచేసినా ప్రభుత్వానికి మంచి పేరే ఉంటుంది. ప్రధానమంత్రి గారు కూడా విశాఖపట్నం వచ్చారు. నవీన్ పట్నాయక్ గారు పిలిస్తే వచ్చారని కొందరు అన్నారు. నవీన్ పట్నాయక్ గారు కాకపోతే, వెంకయ్య నాయుడు గారు కూడా అక్కడే ఉన్నారు. నవీన్ పట్నాయక్ గారు చెప్పి ఉండొచ్చు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ప్రధానమంత్రి గారితో ఫోన్లో మాట్లాడారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని ప్రధానికి వివరించారు. ఆగమేఘాల మీద ఆయన విశాఖపట్నం వచ్చారు. ఏ ప్రధాని కూడా ఎప్పుడూ రాలేదు.

ఇలాంటి సందర్భాల్లో కొందరు ప్రధానులు రాష్ట్రానికి రావడం చూశాం. రాయలసీమలో పర్యటించడం చూశాం. డబ్బులిస్తామని చెప్పడం చూశాం. తెలంగాణాలో పర్యటించడం చూశాం. ఆ తరువాత ఏమీ చెయ్యనిది కూడా చూశాం. కనీసం కేంద్ర మంత్రులు రానటువంటి పరిపాలన గతంలో కూడా మనం చూశాం. పోయిన గవర్నమెంట్‌లో చూశాం. కనీసం అక్కడ నుండి రాకపోగా, పట్టించుకోకపోగా కేంద్ర బృందాన్ని కూడా పంపించని పరిస్థితుల్లో కేంద్రమంత్రులు ఉండేవారు. మరి అలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు నాయుడు గారు, ప్రధాని మోడీ గారు రావడం ఆర్థిక సాయం ప్రకటించడం ఇవన్నీ జరిగాయి. అలా జరిగిన తరువాత ప్రజలకు కొంత భరోసా, హామీ వచ్చింది. ప్రజలు కూడా చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం కాబట్టి, చంద్రబాబు నాయుడు గారు గనుక మాకు ఈ విధంగా ఆసారా కల్పించారు, మాకు భరోసా కల్పించారు, ధైర్యాన్నిచ్చారు, మా మధ్యనే ఉన్నారు, మా మధ్యనే పడుకున్నారు, రాత్రింబగళ్లు నిద్ర లేకుండా ఇక్కడే ఉండి కష్టపడ్డారు అని ప్రజలు అన్నారు. అటువంటి పరిస్థితుల్లో ఈ తుఫాను వచ్చి రెండు నెలలు అయ్యింది. గవర్నమెంటు వచ్చి ఆర్నెల్లు అయ్యింది. ఆర్నెల్ల గవర్నమెంటు, వట్టి చేతుల్తో ఉన్న గవర్నమెంటు ఉన్నప్పుడు, అక్కడ నవ నిర్మాణం చేయాల్సిన పరిస్థితుల్లో, ఇక్కడ పునర్నిర్మాణం చేయాల్సి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాజధానికి నవ నిర్మాణం, ఇక్కడ తుఫాను ప్రాంతాల్లో పునర్నిర్మాణం ఈ రెండు కార్యక్రమాలు ఏకకాలంలో జరగాల్సి వచ్చింది.

మ.1.00

ఆంధ్రప్రదేశ్ రాజధాని కోసం నవ నిర్మాణం, తుఫాను బాధిత ప్రాంతం కోసం పునర్నిర్మాణం ఏక కాలంలో జరగవలసి వచ్చింది. ఇటువంటి పరిస్థితులలో ప్రధాని హామీ ఇచ్చారు కదా, డబ్బు ఎందుకు ఇవ్వలేదు అని ప్రతిపక్షాలు అంటున్నారు. హామీ ఇచ్చారు కదా అని ఒకేసారి ఇవ్వరు, అలాగే, పనులన్నీ కూడా ఒకేసారి జరగవు. దానికి కూడా కొన్ని పరిమితులు, పద్ధతులు ఉంటాయి. ప్రతిపక్ష సభ్యులు మాట్లాడేటప్పుడు ప్రభుత్వం ఇంకా వేగంగా చేయాలని, మంచి పనులను ఎక్కువగా చేయాలని చెప్పండి బాగుంటుంది. రాష్ట్రం విడిపోయినప్పుడు అన్యాయంగా పంపకాలు చేయబడ్డాము, ఈ రాష్ట్రం వట్టి చేతుల్తో ఉంది, పక్క రాష్ట్రం వడ్డించిన విస్తరిలాగా ఉన్నది, నవ నిర్మాణం, పునర్నిర్మాణం చేయవలసి వచ్చింది కాబట్టి, పక్క రాష్ట్రాల కంటే ఎక్కువ ఇవ్వమని కేంద్రాన్ని అడగండి. ప్రభుత్వమే అన్నీ అడగాలని లేదు. ఖచ్చితంగా ప్రతిపక్ష నాయకులుగా అన్ని ప్రాంతాలకు సంబంధించిన వారుగా అందరూ అడగవచ్చు. తప్పేమీ లేదు.

శ్రీ సి. రామచంద్రయ్య : మీ వెంట ఢిల్లీకి వస్తామనే చెబుతున్నాము.

శ్రీ బి. చంగల్ రాయుడు : నేను వ్రాసిన లేఖకు ప్రధాన మంత్రి రిప్లై కూడా పంపించారు. అందుకని మేము ఎలర్ట్ కాలేదని అనుకోవద్దు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : మంచిదే. నాకు చాలా సంతోషం. నేను ఒకటే మనవి చేస్తున్నాను. ఇది విశాఖపట్టణానికే కాదు, గోదావరి జిల్లాలను ఒకసారి తుఫాను ముంచివేసింది. అవనిగడ్డ ప్రాంతంలో 1977వ సంవత్సరంలో జరిగిన భయంకరమైన దివిసీమ ఉప్పెన మనందరికీ తెలుసు. నేను రాజకీయాలలోకి అప్పుడే అడుగుపెట్టాను. అక్కడ ప్రజలు ఎదుర్కొన్న భయానక పరిస్థితులను కళ్లారా చూశాము.

మిస్టర్ ఛైర్మన్ : 1977 నాటి కంటే ఇప్పటి పరిస్థితులు మెరుగయ్యాయి. మీడియా, ప్రెస్ వారు వాతావరణ సమాచారాన్ని ప్రతి క్షణం ప్రజలకు అందించి చాలా మంచి పాత్ర పోషించారు. ఈ మధ్యనే నేను, డిప్యూటీ ఛైర్మన్, స్థానిక సభ్యులు కొంతమంది ఆ ప్రాంతాలను సందర్శించడం జరిగింది. యూనివర్శిటీ ప్రొఫెసర్లు కూడా వచ్చి అక్కడ వివరాలను చెప్పారు. గతంలో ఇంత ప్రచారం లేదు, ఎలక్ట్రానిక్ మీడియా లేదు. ఛానెల్స్ లేవు. గతంతో పోలిస్తే, ఇప్పుడు ప్రాణ నష్టం చాలా తక్కువగా ఉన్నది. నేషనల్ హైవేలను, రహదారులను పూర్తిగా అష్టదిగ్బంధనం చేశారు. కాబట్టి, ప్రాణనష్టం జరగకుండా ప్రజలను రక్షించడం జరిగింది. షిఫ్టింగ్ కూడా చాలా బాగా జరిగింది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అవునండీ. మనకు వాతావరణ కేంద్రాలు ఇంత బాగా అభివృద్ధి చెందినపుడు, నాగరికత, సైన్స్ పెరిగి, మేథ కూడా పెరిగే కొద్దీ ఈరోజు ఉన్నటువంటి వనరులు, సౌకర్యాలు, ఛానల్సు, పత్రికలు మొదలైన వాటి ద్వారా హెచ్చరికలు జారిచేస్తున్నాయి కాబట్టే, ఖచ్చితంగా ప్రాణ నష్టాన్ని తగ్గించుకోగలిగాము. విపత్తుల సమయంలో ఏ ప్రభుత్వం ఉంటే, దానికే ఖ్యాతి దక్కుతుంది. ఇవన్నీ నేను ఎందుకు గుర్తుచేస్తున్నానంటే, మన ప్రాంతాలలో ఎంతో భయంకరమైన పరిస్థితులు అనుకోకుండా వస్తాయి. ఈ ప్రాంతాల గురించి, అటువంటి పరిస్థితుల గురించి కేంద్రం ఎప్పుడూ దృష్టిలో పెట్టుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ రోజున వెనుకబడిన ప్రాంతాలని, కరవు ప్రాంతాలని, వెనకబడిన వర్గాలని ఏ రకంగా ఆలోచిస్తున్నామో, అలాగే, తుఫాను ప్రాంతాలుగా, వరదలు, బురదల ప్రాంతంగా మరియు ప్రత్యేకమైన పరిస్థితులు ఉన్న ప్రాంతంగా వీటికి ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వవలసిన అవసరం కేంద్రప్రభుత్వం పైన ఉందని నేను భావిస్తున్నాను. ఈ అంశాలకు సంబంధించి మనం శాసన మండలి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి మన అభిప్రాయాలను తెలియజేయాలి. మన ప్రాంతానికి తుఫానులు, వరదలు రావనడానికి లేదు. భగవంతుడి దయవలన రాకూడదనే కోరుకుంటాము. కాబట్టి, ఆ ప్రాంత ప్రజలకు తక్షణమే అన్ని రకాలుగా సహాయం అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఉదాహరణకు కొన్ని ప్రాంతాలలో ఇళ్ళు కాలిపోతే కలెక్టర్లు కొంత డబ్బులు ఇస్తామని చెపుతారు. అప్పటివరకూ ఆ బాధితులు ఎక్కడో తల దాచుకోవలసి ఉంటుంది. రాష్ట్రప్రభుత్వానికి ఇటువంటి విపత్తులు వచ్చినప్పుడు కేంద్రప్రభుత్వం కూడా ఈ ప్రాంతాన్ని విపత్తుల ప్రాంతంగా గుర్తించి, మనకు ఇస్తామన్న దాని కన్నా పెద్ద మొత్తంలో మనకు కేటాయించవలసినవసరం ఉందని నేను భావిస్తున్నాను. ఈ ప్రభుత్వం ఏవైతే హామీలు ఇచ్చిందో, మంచి పేరు తెచ్చిందో, ఖచ్చితంగా ఆ మంచి పేరును చెడగొట్టుకోదు. అందుకోసం శ్రీ

ఎస్. చంద్రబాబునాయుడుగారు, ఇక్కడ ఉన్న మంత్రులు అందరూ కూడా కేంద్రప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువస్తాము. రాష్ట్రప్రభుత్వంతో కూడా చెప్పి, సత్వరమే ఆ కార్యక్రమాలను చేపట్టే విధంగా తగిన చర్యలుతీసుకోమని చెపుతాము. పచ్చదనం పరిరక్షణకోసం చేపట్టిన చెట్లు నాటే కార్యక్రమాలని అందరూ మెచ్చుకుంటున్నారు. అంతేగాకుండా ఆ ప్రాంతాలలో పునరావాసం కల్పించే కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. పై అంశాలకు సంబంధించి కలెక్టర్ ఆఫీసులో ఒక సమావేశం జరిగింది. అందులో శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు, పల్లె రఘునాథరెడ్డి, మున్సిపల్ మంత్రి గారు తదితరులు అందులో పాల్గొన్నారు. బోట్లు పాక్షికంగా దెబ్బతింటే ఎంత ఇవ్వాలి, పూర్తిగా దెబ్బతింటే ఎంత నష్ట పరిహారం ఇవ్వాలనే దానిపై మాట్లాడడం జరిగింది. ఇళ్లు, చెట్లు, పంటలు, విద్యుత్తు, మంచినీరు వంటి విషయాలపై గంటల తరబడి చర్చించడం జరిగింది. చంద్రబాబు నాయుడు గారు అష్టావధానం చేశారు. హైదరాబాదుకు, విశాఖపట్టణానికి ఎంత తిరిగారో అందరికీ తెలుసు. విమర్శ అనేది వస్తుంది. అయితే, అది సద్విమర్శగా ఉండాలి. మంచి సూచనలు చేయాలి. మనందరం ఖచ్చితంగా ఆంధ్రా ప్రాంతాన్ని విపత్తుల ప్రాంతంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలి. అందుకు కేంద్రం స్పందించవలసిన అవసరం ఉన్నది. కేంద్రప్రభుత్వం వెంటనే డబ్బు కేటాయించాలి. అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువగా మన రాష్ట్రానికి ఇవ్వవలసిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెంటనే ప్రత్యేకమైన ప్యాకేజీని, ప్రతిపత్తిని కల్పించాలని తమ ద్వారా తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

MR. C. RAMACHANDRAIAH : I should congratulate Smt. Nannapaneni Rajakumari garu for the eloquent speech she has delivered. She might have been taken into the Cabinet. She is giving reply on behalf of the Government. She is representing the Government. అయితే, నేను సోదరికి ఒక విషయం చెప్పదలచుకున్నాను. తూర్పు గోదావరి జిల్లాలో వరదలు వచ్చినప్పుడు నేను కూడా ఉన్నాను. Taste of the food is in eating it తింటేనే రుచి తెలుస్తుంది. నేను రిఫరెన్స్ ఇచ్చాను, అంతేకానీ, పూర్తిగా తప్పులు పడుతున్నారని కాదు. వేరే వాళ్లను కూడా తక్కువగా అంచనా వేయవద్దు. 1999 నుంచి 2014 వరకూ వరుసగా శ్రీ పట్నాయక్ గారు గెలుస్తున్నారు. ప్రజలు ఆ విధంగా అక్కడ శాటిస్‌ఫై అయ్యారు. మరి ఇక్కడ ప్రజలు సంతృప్తి చెందలేదు.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : అధ్యక్షా, ప్రజలు హుద్-హుద్ తుఫానుకు సంబంధించి శ్రీ ఎస్. చంద్రబాబు నాయుడు గారు ప్రమాణ స్వీకారం చేసినప్పటి ముహూర్తం బావుండలేదు కాబట్టి, ఈ తుఫాన్ వచ్చిందని, ఈ రాష్ట్రానికి చాలా పీడ తగులుతుందని, పలుకుబడి కలిగినటువంటి, బాధ్యత కలిగినటువంటి వారు ఒక మత ఛాందస వాదాన్ని ప్రజలలోకి తీవ్రంగా తీసుకుపోయే ప్రయత్నం విశాఖపట్టణం నుంచి జరుగుతున్నది. దానిని ఈ సభ నిర్ద్వంద్వంగా ఖండించాలి. ఇటువంటి ఛాందస వాదాన్ని మనం బలంగా త్రిప్పికొట్టాలని ప్రజలకు చెప్పవలసిన బాధ్యత మన పైన ఉందని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

1.10 PM

డా. పల్లె రఘునాథ రెడ్డి: అధ్యక్షా, కరవుపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై సోమవారం జవాబులు చెబుతాను. హుద్‌హుద్ తుఫానుపై ఇప్పుడు జవాబు చెబుతాను. గౌరవ ప్రతిపక్షనాయకులు హుద్‌హుద్ తుఫాను గురించి అన్ని విషయాలు మాట్లాడారు. నేను వాటిపై జవాబులు ఇచ్చిన తర్వాత ప్రశ్నలు వేస్తే మళ్లీ రెండవసారి వాటికి జవాబులు చెబుతాను.

MR. CHAIRMAN: Raghunath Reddy garu, the point is this. You have been deputed to give reply on drought only.

డా. పల్లె రఘునాథ రెడ్డి: అధ్యక్షా, రెండు సబ్జెక్టులపై చెబుతాను.

మిస్టర్ ఛైర్మన్: ఈ సబ్జెక్టు అయిన తర్వాత దాని గురించి చెప్పండి.

శ్రీ సి.రామచంద్రయ్య: అధ్యక్షా, ఇంకా మాట్లాడవలసిన సభ్యులున్నారు. ఈనాడు చర్చను కంటిన్యూ చేయండి. రెండు సబ్జెక్టులను కలిపి జవాబు చెప్పమనండి.

మిస్టర్ ఛైర్మన్: రామచంద్రయ్య గారు రెండు సబ్జెక్టులను కలిపి చేయమంటున్నారు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, కరవుపై మంత్రిగారు సమాధానం చెప్పడానికి వచ్చారు. మీరు ఏమన్నారంటే, హుద్‌హుద్ తుఫానుపై మాట్లాడమన్నారు. వ్యవసాయశాఖా మంత్రి శ్రీ పుల్లారావు గారు ఎక్కువ రోజులు అక్కడున్నారు కాబట్టి వారు హుదుద్ తుఫానుపై, మంత్రి డా. రఘునాథ రెడ్డి గారు కరవుపై జవాబు చెబుతారని అనుకున్నాము. కానీ, శ్రీ పుల్లారావు గారు ఆ సభకు వెళ్లాలి కాబట్టి రెండు సబ్జెక్టులపై నేను జవాబు చెబుతానని మంత్రిగారు అంటున్నారు. అది కాదు. చాలామంది సభ్యుల పేర్లు నేను తీసుకున్నాను. ఒక చీఫ్ విప్‌గా నేను ఇక్కడ చెబుతున్నాను. దయచేసి మీరు కూడా అర్థంచేసుకోండి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన చాలా మంది సభ్యులు హుద్‌హుద్ పై మాట్లాడారు. కాబట్టి కరవుపై మంత్రిగారిని మాట్లాడమనండి. హుద్‌హుద్ తుఫానుపై ఎల్లుండి హోంమంత్రిగారు వచ్చి జవాబు చెబుతారు.

MR. CHAIRMAN: There is no coordination between the members of the treasury benches and the government. రెండు సబ్జెక్టులు కలిపి ఆయన జవాబు చెబుతానంటున్నారు. మీరు చెప్పిన మాటను ఇంతకుముందే నేను చెప్పాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, చీఫ్‌విప్‌గా సభ్యుల పేర్లు నేను తీసుకున్నాను. ఎంతమంది మాట్లాడారో నాకు తెలుసు కనుక మంత్రిగారు ఇప్పుడే సభకు వచ్చారు. ఆ విషయం గురించి ఆయనకు తెలియదు కనుక నేను చెప్పాను.

మిస్టర్ ఛైర్మన్: రెండు సబ్జెక్టులను కలిపి ఆయన జవాబు చెబుతానని అంటున్నారు.

డా. పల్లె రఘునాథ రెడ్డి: అధ్యక్షా, ఈ విషయంలో పెద్దగా ఆందోళన పడవలసిన అవసరం లేదు. వారు ఎంతమంది మాట్లాడతారో మాట్లాడమనండి. ఒక అరగంట సమయం మాత్రమే తీసుకుని చాలా స్పష్టంగా రెండు సబ్జెక్టులకు నేను సమాధానం చెబుతాను.

MR. CHAIRMAN: Now, we will complete the discussion on Hud Hud cyclone, and then reply by the Minister Dr. P. Raghunath Reddy on both the subjects. అప్పారావు గారూ, మీకు విశాఖపట్నం గురించి బాగా తెలుసు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో విభాగ అధిపతిగా మీరు పనిచేశారు. పొగడ్తలు, విమర్శలు కాకుండా ప్రజలకు

ఉపయోగపడే విధంగా నేడు అక్కడున్న పరిస్థితులపై ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇచ్చే విధంగా మాట్లాడండి. ప్రభుత్వం నుంచి తుఫాను బాధితులకోసం ఎంత ఎక్కువగా సహాయం చేయవచ్చో మొదలైన అంశాల గురించి మీరు చెప్పాలి.

శ్రీ సి.రామచంద్రయ్య: (మైకు లేకుండా) అధ్యక్షా, ఏదైనా ఒకటి రిప్రజెంట్ చేసేటపుడు పాసింగ్ రిఫెరెన్సెస్ ఉంటాయి. వాటిని అంత సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం లేదు. ఏదైనా తప్పులుంటే పాయింట్ అవుట్ చేయడానికే ఇక్కడ మేమున్నాం.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు: అధ్యక్షా, తేది. 12.10.2014 న వచ్చిన ఈ హుద్‌హుద్ తుఫాను వల్ల శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు మరియు పాక్షికంగా తూర్పుగోదావరి జిల్లా చాలా దారుణంగా దెబ్బతిని ప్రాణనష్టం మరియు ఆస్తినష్టం కూడా చాలా ఎక్కువగా జరిగింది. దానివల్ల వచ్చిన నష్టంపై మన రాష్ట్రప్రభుత్వం వివిధ శాఖల నుంచి అంచనాలను తయారుచేసి రూ. 21 వేల కోట్లుగా దానిని చూపించి కేంద్రసహాయాన్ని కోరుతూ వాటిని పంపించడం జరిగింది. కేంద్రం నుంచి శ్రీ నరేంద్ర మోడీగారు విశాఖపట్నం వచ్చినపుడు తక్షణ సహాయం క్రింద రూ. 1000 కోట్లు ఇస్తామని చెప్పి రూ. 400 కోట్లు మాత్రమే విడుదల చేశారు. అది అడ్వాన్సు మొత్తమని కొన్ని వార్తా కథనాలను విన్నాము.

అయితే మన రాష్ట్రం నుంచి తుఫాను నష్టంపై అంచనాలు ఏ విధంగా తయారుచేశారంటే, రాష్ట్రప్రభుత్వ సంస్థల యొక్క నష్టమే రూ. 21,640.63 కోట్లుగా, కేంద్ర సంస్థల యొక్క నష్టం రూ. 1630 కోట్లుగా, ప్రయివేటు ఆస్థులకు సంబంధించి రూ. 40 వేల కోట్లుగా మొత్తం రూ. 63 వేల కోట్లుగా నష్టం జరిగిందని, దానికి గాను రూ. 9,751 కోట్లు సహాయంగా అందించాలని రాష్ట్రం కేంద్రాన్ని కోరడం జరిగింది. కేంద్రం నుంచి ఒక బృందం కూడా వచ్చి తుఫాను ప్రభావిత ప్రాంతాలన్నీ పర్యటించిన పిదప రూ. 6,140 కోట్లకే ఆర్థిక సహాయం పరిమితమయ్యే అవకాశముందనే సమాచారం కూడా కొన్ని వార్తా కథనాలు కూడా విన్నాము. దీనిని బట్టి చూస్తుంటే కేంద్రం నుంచి మనం అనుకున్న స్థాయిలో మనకు సహాయం అందుతుందనే భావం కలగడం లేదు. తుఫాను ప్రభావిత ప్రాంతంలో 5 లక్షల కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామని మన రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం జరుగుతోంది. అయితే ఇప్పటికే 12,500 టన్నుల బియ్యం, 117 టన్నుల కందిపప్పు, 1.60 లక్షల పామాయిల్ ప్యాకెట్లు, 142 టన్నుల అయోడైజ్డ్ ఉప్పు, 45 టన్నుల కారంపొడి పంపిణీకి సిద్ధమైందని చెప్పడం జరిగింది. కేంద్రం నుంచి కూడా 2,692 కిలోలీటర్ల కిరోసిన్ వస్తే, దానిలో 2,544 కిలోలీటర్ల కిరోసిన్‌ను ఈ నాలుగు జిల్లాలకు కేటాయించడం జరిగింది. అయితే, 5 లక్షల కుటుంబాలకు నిత్యావసర సరకులను అందజేశామని చెబుతున్నారు కానీ, అవి సక్రమంగా బాధితులందరికీ అందాయా, లేవా అనేది మా అభియోగం. ఎందుకంటే, పంపినటువంటి ఈ నిత్యావసర సరకులన్నీ కూడా రేషన్ డీలర్ల ద్వారా పంపిణీ చేయవలసి ఉండగా ఆ రేషన్ డీలర్లను తప్పించి సెకండ్ గ్రేడ్ నాయకుల ఇళ్లకు ఈ సరకులన్నీ తరలించి మాకు న్యాయం చేయలేదని ఆ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజలు గగ్గోలు పెట్టిన సంఘటనలను పొందూరు మండలం బొడ్డేపల్లి, మొదలవలస గ్రామాలలో మేము చూడడం జరిగింది. తుఫాను వచ్చిన తర్వాత మేము కూడా పది రోజులు అక్కడుండి అన్ని ప్రాంతాలను తిరగడం జరిగింది. అప్పుడు మాకు తెలిసిన విషయం, సక్రమంగా ఈ నిత్యావసర సరకులు తుఫాను బాధితులకు అందలేదు.

తుఫాను ప్రభావం వల్ల సూక్ష్మ, చిన్నతరహా, భారీపరిశ్రమలకు కోలుకోని దెబ్బ తగిలితే ప్రభుత్వం మాత్రం సహాయాన్ని ఏ విధంగా అందించిందంటే, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు రూ. 25 వేలు, భారీ పరిశ్రమలకు రూ. 50 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు కానీ, ఇంతవరకూ పూర్తిగా వారికి అందిన దాఖలాలు లేవు. పరిశ్రమలకు రూ. 168.68 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనాలున్నాయి. ఆ అంచనాలకు, ప్రభుత్వం చేసే సహాయానికి ఎటువంటి పోలిక కనిపించడం లేదు. ఈ తుఫాను సంభవించినపుడు, సహాయక చర్యలు అందజేశామని చెప్పినపుడు చాలా పత్రికల్లో కొన్ని కథనాలు కూడా వచ్చాయి. "తుఫాను సరుకులు స్వాహా" అని తేది. 6.11.2014 న ఆంధ్రజ్యోతి వార్తాపత్రిక ఒక ఆర్టికల్‌ను ప్రచురించడం జరిగింది.

మ.1.20

"ఉచితం మాటున యథేచ్ఛ దోపిడి, జిల్లాలో కుటుంబాలకు మించిన పంపిణీ". విశాఖపట్నం జిల్లాలో 14.30 లక్షల కుటుంబాలకు రేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. అయితే అధికారుల గణాంకాల ప్రకారం విశాఖపట్నం జిల్లాలో మొత్తం జనాభా 12 లక్షలైతే, 14 లక్షల మందికి ఏ విధంగా రేషన్ ఇచ్చారనేది మా ప్రశ్న. వాస్తవానికి రేషన్ కార్డులున్న వారు కూడా సక్రమంగా రేషన్ తీసుకోలేదు. అసలే రేషన్ తీసుకోని కుటుంబాలు కొన్ని ఉన్నాయి, ఈ విషయంలో రేషన్ డీలర్లు తమ చేతి వాటాన్ని ప్రదర్శించాయి. కనుక వాస్తవంగా ఎన్ని కుటుంటాలకు రేషన్ పంపిణీ చేశారు, ఏ విధంగా పంపిణీ చేశారు, అనే విషయమై ఖచ్చితంగా హౌస్ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని కోరుతున్నాను. రేషన్ డీలర్లు తమ చేతి వాటాన్ని ప్రదర్శించి సక్రమంగా పంపిణీ చేయలేదని, నాయకుల యొక్క ఆదేశాల మేరకు పంపిణీ జరిగిందని, అక్కడి ప్రజలు గగ్గోలు పెట్టిన సమాచారం కూడా ఉంది. పంటల రుణాల విషయంలో వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం వల్ల రైతులు ఆశపడి రుణాలను చెల్లించకపోవడం వల్ల, వారికి కొత్త రుణాలు ఇవ్వకపోవడం వల్ల, కొత్త రుణాలు ఇస్తేగానీ బీమా చేయకపోవడం వల్ల తుఫాను వచ్చి ఆ ప్రాంతంలోని పంటలకు నష్టం వాటిల్లడం వల్ల ఒక్కపైసా కూడా బీమా ద్వారా రైతులకు వచ్చిన దాఖలాలు లేవని తమరికి తెలియపరుస్తున్నాను.

అయితే, అక్కడ జరిగిన కొన్ని విషయాలను తమరి ద్వారా ప్రభుత్వానికి తెలియపరచదలిచాను. తుఫాను వల్ల విశాఖపట్నం జిల్లాలో 34.180 వేల హెక్టార్లలోని పంటలు దెబ్బతిన్నాయి. అందులో వరి పంట 9588 హెక్టార్లు, చెరకు 20,137 హెక్టార్లలో దెబ్బతినిందని, ప్రత్తి, వేరుశనగ, రాగి, పొగాకు పంటలు పనికిరాకుండా పోయాయని, నష్టపోయిన 1,55,915 మంది రైతులు సబ్సిడీ కోసం ఎదురు చూస్తున్నారు. 8,68,650 కొబ్బరి చెట్లు, 2,49,028 ఆయిల్ పామ్ చెట్లు దెబ్బతిన్నాయి. అయితే 23722 మంది రైతులు నష్టపోయారని ప్రభుత్వ నివేదికలు చెపుతున్నాయి. 1,55,915 మంది రైతులకు, 23722 మంది రైతులకు పొంతన ఎక్కడుంది? ఈ విషయమై ఒకసారి ఆలోచన చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు మరియు ఇతర జీవులు కలిసి 3618 జీవులు ప్రాణాలు కోల్పోయాయి. అందుకు రూ.4.74 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనాలున్నాయి. అలాగే 3.08 లక్షల కోళ్లు చనిపోయాయని, వాటి విలువ రూ.12.03 లక్షలని ప్రభుత్వం చెప్పుకుంటుంది, కానీ వారికి ఒక పైసా కూడా అందిన దాఖలాలు లేవు. విశాఖతీరంలోని మత్స్యకారులు చాలా దారుణంగా దెబ్బతిన్నారు. అది వారి జీవనాధారం, వారికి సంబంధించి 2415 ఫిషింగ్ బోట్లు, వలలు

దెబ్బతిన్నాయి. వాటి విలువ రూ.2554 లక్షలని ప్రభుత్వ యంత్రాంగం చెప్పకనే చెబుతున్నది. అయితే ప్రభుత్వం రూ.648 లక్షలకు ప్రతిపాదనలు పంపింది. వాటి విలువ రూ.2554 లక్షలు, కాగా అందుకు ప్రభుత్వం రూ.648 లక్షలకు ప్రతిపాదనలు పంపడంపై రైతుల చాలా విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒక ఫైబర్ బోటు వలలతో కలిపి రూ.4.00 లక్షల విలువ ఉంటుందని మత్స్యకారులు చెపుతుంటే, ప్రభుత్వం రూ.648 లక్షలకు ప్రతిపాదనలు పంపామని ప్రభుత్వం చెపుతుంటే, వారి మనోభావాలు ఏ విధంగా దెబ్బతింటాయనే విషయాన్ని ఒకసారి ఆలోచన చేయాలి. మేము విశాఖపట్నం జాలరిపేటకు వెళ్లి ప్రతి కుటుంబాన్ని కలిశాం. వారందరూ పాడైన బోట్లు, వలలను అలాగే సముద్రంలో వదిలేసిన దృశ్యాన్ని చూపించారు. వాటిని మీరు ఎందుకు అలా వదిలేశారని మేము ప్రశ్నించినప్పుడు వారు ఒక్కసారి పాడైతే వాటిని మరలా మరమ్మత్తు చేయడానికి వీలుపడదని, దయచేసి మమ్మల్ని పట్టించుకోండని, మా వేదనను వినమని మనవి చేస్తున్నాం, ఇది లేకపోతే మా పెళ్లాం పుస్తెలమ్మి తినాల్సి వస్తుందని వారందరూ చాలా ఆవేదనను వ్యక్తం చేశారు.

అలాగే, 4,619 రిక్షాలు, ఆటో రిక్షాలు, తోపుడు బళ్లు కూడా దెబ్బతిన్నాయని, వాటి విలువ సుమారు రూ.2.5కోట్లుగా ఉందని, నేటికీ వాటికి సంబంధించిన ఏ విధమైన సహాయం అందలేదని వారు బాధపడుతున్నారు. ఒక్క విశాఖపట్టణం జిల్లాలోనే సుమారు 1,43,761 ఇళ్లు దెబ్బతిన్నాయని లెక్క తేల్చారు. తక్షణ సాయంగా ప్రభుత్వం రూ.75కోట్లు విడుదల చేసి, రూ.5,000 చొప్పున 16,000 మందికి బ్యాంకు ఖాతాలలో డబ్బులు వేశామని చెపుతున్నా, ఎక్కడా ఆ సొమ్ము అందరికీ అందలేదు. మధ్యలో దళారులు, సెకండ్ గ్రేడ్ నాయకులు తయారయి దెబ్బతినని వారి ఇళ్ళకు సహాయం చేయించడం, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ళను వదిలేయడం మొదలైనవి జరుగుతున్నాయి కాబట్టి, ఖచ్చితంగా దీనిమీద విచారణ విభాగాన్ని పెట్టి, అసలు సిసలైన బాధితులకే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా నేను కోరుతున్నాను.

అలాగే, కూరగాయల పంటలు సుమారు 6,372 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. వాటి విలువ సుమారు 9.55కోట్లు ఉంటుందని ప్రతిపాదిస్తే, దానికి నష్టపరిహారం ఇవ్వకుండా, రూ.1.33కోట్ల విలువ గల విత్తనాలు ఇస్తామని చెపుతున్నారు. దీనిని బట్టి ఏం అర్థమవుతోందంటే, మీరు తక్షణ సహాయం అందించకపోతే, మేము పంటలు పండించుకోలేమని వారు చెపుతుంటే, "జబ్బు ఒకటి, మందు ఒకటి వేసినట్లుగా" అవుతుంది. మాకు సాయం చేయండి, మమ్మల్ని ఆదుకోండని వారు అంటే, మీరు విత్తనాలు ఇస్తామంటే, వాటిని విత్తుకుని, పండించుకోవడానికి వారి దగ్గర డబ్బులు ఉండాలి. డబ్బులు లేక వారు బాధపడుతున్నారు. అధ్యక్షా, నేను ఒక విషయం చెప్పదలచాను, ఇది ఎవరినీ తప్పుబట్టే విషయం కాదు. అక్టోబరు 8వ తారీఖునే "ఒరిస్సా – ఆంధ్రప్రదేశ్‌పై హుద్–హుద్ తుపాను పెను ముప్పు అనే హెచ్చరికలు మనకు వచ్చాయి. మరలా అక్టోబరు 9వ తారీఖున దిశ మార్చుకుని విశాఖ వైపు తుపాను అని హెచ్చరిక వచ్చింది" అంటే, అక్టోబరు 8 నుంచే హెచ్చరికలు వస్తున్నాయంటే, 12వ తారీఖు వరకు కూడా సుమారు 5 రోజుల సమయంలో ముందుగా జాగ్రత్త చర్యలు చేపట్టగలిగి ఉంటే మరింత బాగుండేది. ముఖ్యమంత్రిగారికి ఇతర పనులు ఉండవచ్చు కానీ, తుపానుకు సంబంధించి ముందుగా స్పందించి తగు జాగ్రత్తలు తీసుకున్నట్లయితే ఖచ్చితంగా దీనివలన కలిగే నష్టాన్ని, ప్రాణనష్టాన్ని కూడా తగ్గించే అవకాశం ఉండేదనే చిన్న ఆశ. కాబట్టి, ముందుగా దానిపై స్పందించి ముందస్తు చర్యలు తీసుకోలేదనే భావనతో, మనకు ముందుగానే ప్రమాద హెచ్చరికలు వచ్చినప్పుడు దానిమీద అలర్ట్ కావలసిన అవసరం

ఎంతైనా ఉందని తమ ద్వారా తెలియజేస్తున్నాను. అయితే, మా సోదరీమణి 24 గంటలలో విద్యుత్తు పునరుద్ధరణ జరిగిందని చెప్పారు. అక్కడ 24 గంటలు, 48 గంటలు, మూడు రోజులైనా విద్యుత్తు రాలేదు, నేను స్వయంగా అక్కడ ఉన్న ప్రాంతంలోనే విద్యుత్తు లేక చాలా ఇబ్బందులు పడ్డాము. పనులన్నీ వెంటనే జరిగిపోతాయని ఏ ప్రభుత్వంలో కూడా చెప్పలేము. మీ దగ్గర కానీ, మా దగ్గర కానీ, ఎవరి దగ్గరైనా పనులు వెంటనే చక్కబెట్టడానికి మంత్రదండం ఉండదు. కానీ, చేసిన పనులలో సరి అయిన న్యాయం జరిగిందా, లేదా? బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరిగించి, బాధితులమైన మాకు న్యాయం జరిగిందనే విషయం వారి మనసులోంచి వచ్చినపుడే మనం వారి సానుభూతిని పొందగలుగుతాం. అయితే మేము అక్కడ ధర్మాన్ నగర్, మరికొన్ని ప్రాంతాలకు వెళ్ళి అక్కడ సాయం అందుతోందా? అని వారిని అడిగితే, కోట్లాది రూపాయలు ముఖ్యమంత్రిగారి రిలీఫ్ ఫండ్‌కి జమ అవుతున్నాయని, మాకు మాత్రం ఎటువంటి సహాయం అందడం లేదని చాలామంది ఆవేదనతో చెప్పేవారు. కొన్ని ప్రాంతాలకు సాయం అందించారని పత్రి కలలో వచ్చిన వార్తలు చూసి మేము ఆ ప్రాంతాలకు వెళ్ళి అడిగితే, అందులో సగానికి సగం మందికి పైగా ఎటువంటి సహాయం అందలేదని గగ్గోలు పెట్టేవారు. నేను చెప్పిన ప్రాంతాలన్నీ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రాంతాలే. దాన్ని బట్టి ఇచ్చిన సహాయంలో కూడా కనీసం 25 శాతమైనా అందిందా లేదా అనే సందేహాన్ని విశాఖ జిల్లాలో ఉన్న ప్రజలు వెలిబుచ్చడం జరిగింది. ఈ అంశాలకు సంబంధించి ఖచ్చితంగా ఎంక్వైరీ చేయించి, బాధితులకు సాయం అందేలా చూడాలని తమరి ద్వారా కోరుతున్నాను. అలాగే, విద్యుత్తుపైన ఆధారపడిన పరిశ్రమలలో ఇప్పటికీ కూడా పునరుద్ధ రణ జరగలేదు. కొన్ని ప్రాంతాలలో అసలు విద్యుత్తే లేక 15 రోజులపాటు పునరుద్ధరణ జరగకపోవ డంతో, విద్యుత్తు పైన ఆధారపడిన పరిశ్రమలు ఇంకా అలాగే ఉన్నాయి. కాబట్టి, ఇది చాలా విచారకరమైన విషయం, దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి అన్ని పార్టీలు ఒకేమాటపై ఉండి, వారికి ఖచ్చితంగా న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. ధన్యవాదాలు.

మ 1.30

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : అధ్యక్షా, నా ముందు మాట్లాడిన వాళ్ళు చాలా విషయాలు చెప్పారు. దానిని మళ్ళీ రిపీట్ చేయదలచుకోలేదు. కానీ ఈ హుద్‌హుద్ తుఫాను వచ్చిన తరువాత దేశవ్యాప్తంగా ఈ తుఫానుయొక్క స్వభావం, ఇలాంటి తుఫానులు రావడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలమీద చాలా పెద్ద ఎత్తున చర్చ కూడా జరిగింది. ప్రముఖ పర్యావరణవేత్త, మాజీ ఐ.ఏ.యస్ అధికారి వి.వి.యస్ శర్మగారు, ఇంకా కొంతమంది తుఫానుగురించి ఎకనామికల్ అండ్ పొలిటికల్ రివ్యూలో నాలుగు ఆర్టికల్స్ రాశారు. దానిని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. వాతావరణంలో చాలా పెద్ద ఎత్తున కాలుష్యం వచ్చిన ఫలితంగా సముద్ర ఉపరితలం ఉష్ణోగ్రతలో ఉన్నట్లుండి తీవ్రమైన మార్పులు వస్తున్నాయని వారు తెలిపారు.

మిస్టర్ ఛైర్మన్ : గ్లోబల్ వార్మింగ్ వల్ల జరుగుతోంది.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : గ్లోబల్ వార్మింగ్ కారణంవల్ల సముద్ర ఉపరితలంలో కొన్ని ప్రత్యేకమైన ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఆ ఉష్ణోగ్రతలు పెరిగిన సందర్భంగా అక్కడున్న గాలి పైకెళ్ళిపోయి పెద్ద ఎత్తున అక్కడ శూన్యమేర్పడడంతో, ఆ శూన్యాన్ని ఆక్రమించుకోవడానికి చుట్టూ పెద్ద ఎత్తున గాలులు రావడం, అది సుడిగా మారడం, తుఫానుగా

మారడం సాధారణంగా మనకు తెలిసిందే. కానీ ఈ హుద్‌హుద్ తుఫానుకు ఉన్నటువంటి ప్రత్యేకత ఏమిటంటే తుఫాను ఏదో ఒక అరగంటో, ముప్పావుగంటో, రెండు, మూడు గంటలో రావడమనేది కాకుండా ఒక నిర్దిష్టమైనటువంటి ప్రాంతంమీద, కొద్ది ప్రాంతంమీద కాన్‌స్టాంట్‌గా కొన్ని గంటలపాటు కేంద్రీకరించింది. ఇది ఈ తుఫానుకున్నటువంటి ప్రత్యేకత. మిగతా తుఫానులు ఆ రకంగా కాకుండా ఒక్కసారిగా రావడం, ఒక ధ్వంసమో, విలయమో సృష్టించి తమదారిన తాము పోవడం జరుగుతుంది. ఈ తుఫాను అలాలేదు.

మిస్టర్ ఛైర్మన్ : ఈ తుఫాను పగలు వచ్చింది. రాత్రి రాలేదు.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : అయితే, తుఫాను రావడానికి ఒక ఐదారు రోజుల నుంచి చాలా స్పష్టంగా సంకేతాలు రావడం, నాసా వాళ్ళు, మనవాళ్ళు చెప్పినదానికి పొంతన ఉండడం జరిగింది. కొన్ని సందర్భాల్లో భారతీయులు చెప్పిన జాగ్రత్తలు, అంచనాలు మాకంటే చాలా స్పష్టంగా ఉన్నాయనే మాట నాసావాళ్ళ నుంచి కూడా రావడం జరిగింది. కానీ ఈ రకంగా గంటల తరబడి ఒకే ప్రాంతంమీద కేంద్రీకరించినటువంటి ఈ రకమైన తుఫానులు భవిష్యత్తులో కూడా పరమ విధ్వంసాన్ని సృష్టిస్తాయి. అలాగే పర్యావరణంలో వచ్చిన పెద్ద మార్పనేది దీనిలో ఉన్నటువంటి సారాంశం. ఇంకా లోతులోకి పోవడానికి ఇది సమయం కాదు. మరి ఈ పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానంతోపాటు, కొన్ని జాగ్రత్తలద్వారా కొంత నష్టాన్ని నివారించుకోవచ్చే తప్ప ప్రకృతి కన్నెర్ర చేసి విధ్వంసం జరిగిన తరువాత దానిని అదుపుచేయడం ఇక సాధ్యమయ్యే పనికాదనే నిర్ణయానికి కూడా రావడం జరిగింది.

మిస్టర్ ఛైర్మన్ : కాబట్టి పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యమైనది.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : ఎప్పుడో ప్రమాదం వచ్చినప్పుడు ఏదో జగ్రత్తలు తీసుకోవడం కాకుండా ఎంతో సాంకేతిక పరిజ్ఞానముంది కనుక అద్భుతాలు చేయచ్చు. ఒకవేళ తుఫాను వచ్చినా దాని తీవ్రత తగ్గించడానికి, ఆ పట్టణంమీద దీని ప్రభావం పడకుండా నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలనేది కీలకమైన అంశం. ఉదాహరణకి విశాఖపట్నం తీర ప్రాంతంగా ఉన్నటువంటి మడ అడవులన్నీ దాదాపు ధ్వంసం చేశారు. కేవలం 30 శాతం మడ అడవులు కూడా ఈరోజు విశాఖపట్నం తీరప్రాంతంలో లేవు. ఇది ఒక అధ్యయనం. వంద శాతం మడ అడవులు కానీ ఉండి ఉన్నట్లయితే తుఫాను తీవ్రత ఇంతే ఉన్నప్పటికీ కూడా ఇప్పుడొచ్చిన నష్టంలో సుమారు 60 శాతానికి తగ్గించి ఉండవచ్చు అని చెప్పి వివియస్ శర్మగారు ఒక అంచనా వేశారు.

మిస్టర్ ఛైర్మన్ : ఇప్పుడు ఈస్టర్న్‌ఘాట్స్ చాలా ఉన్నాయి కదా. బరంపురం, శ్రీకాకుళం, ఒరిస్సా బార్డర్ నుంచి కొన్ని వేల కిలోమీటర్లు ఈస్టర్న్‌ఘాట్స్ ఉన్నాయి.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : అవి ఉండబట్టే అంతో, ఇంతో తట్టుకోగలిగాము. అక్కడ బాక్సైటుకోసం తవ్వి ధ్వంసం చేసినట్లయితే పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉండేది. కానీ ఈసారి ఆ కనుమలు కూడా అడ్డుకునేదానికి వీలులేకుండా ఉండే డైరెక్షన్‌లో వచ్చింది. ఇది తీవ్రమైనటువంటి నష్టం. మానవులెవరూ దానిని ఆపలేరు. అదేమీ అయ్యేపనికాదు. అందువల్ల మడ అడవుల్ని

కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇది ఈరోజు విశాఖపట్నం సమస్య. రేప్పొద్దున కోస్తాంధ్ర మొత్తానికి సంబంధించిన సమస్య అవుతుంది. మనం కోస్తాంధ్రమీదనే ఆధారపడి మన అభివృద్ధి అంతా ఉంటుందని అనుకుంటున్నాము. చాలా పెద్ద ఎత్తున పోర్టులను, స్మార్ట్‌సిటీలను నిర్మించాలనుకుంటున్నాము. కోస్తా ఒకటి మనకుండడం వల్ల ప్రపంచంలోనే సింగపూర్ తరువాత పెద్దవాళ్ళమవుతామనే భ్రమపడుతున్న వాళ్ళం.

కేరళలో ఈమధ్య మడ అడవులమీద ఒక ప్రయత్నం జరిగింది. కేరళ సాహిత్య పరిషత్ అనే ఒక సంస్థకి అక్కడున్న ప్రభుత్వం మడ అడవుల్ని పెంచడానికి ఒక ప్రాజెక్టులాంటిది ఇచ్చింది. ఆ ఆర్గనైజేషన్ మాకు జనవిజ్ఞాన వేదికకు సోదర ఆర్గనైజేషన్. ఆ వివరణ కావలంటే మంత్రిగారికి కానీ, గౌరవ సభ్యులకు కానీ ఇస్తాను. ఇరవై ఏళ్ళకు ముందర పాత మడ అడవులు ఎన్ని ఉన్నాయో అందులో 80 శాతం అడవుల్ని కేవలం నాలుగున్నర సంవత్సరాలలో తిరిగి తీసుకురావడం జరిగింది. ఇటీవలి కాలంలో భారతదేశంలో మడ అడవుల పునరుద్ధరణకు సంబంధించినంత వరకూ ఇది ఒక పెద్ద ప్రయోగం, పెద్ద ప్రయత్నం, పెద్ద సక్సెస్ స్టోరీ. ప్రభుత్వం కూడా ఈదిశగా ఆలోచించాలని నేను కోరుతున్నాను.

కోస్తాకు సంబంధించి సముద్రానికీ, పట్టణానికీ మధ్య ఉన్న సరుగుడుచెట్లన్నింటినీ కూడా ధ్వంసం చేశారు. తీరంలో దొంగలు పడ్డారనే విధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు సముద్రతీరంలో తీరంలో పడి అక్కడ ఇష్టారాజ్యంగా దానిని ధ్వంసం చేశారు. ఆ విధంగా చేయడంవల్ల గాలులు ఒకేసారి తీరంమీద నుంచి పట్టణాలమీద పడి విధ్వంసానికి కారణమైంది. ఇదొక పెద్ద గుణపాఠంగా తీసుకోవాలని నేను మొదట చెప్తున్నాను. ఇప్పుడు విశాఖపట్నంలో చెట్లు మొత్తం ధ్వంసమైనాయి. భూమిచుట్టూ మూడువరుసలచెట్లు నాటినట్లయితే ఎన్ని అవసరమో, అన్ని వృక్షాలు ఒక్క విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రాంతంలోనే ఉన్నాయనేది ఒక అంచనా. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ విస్తారమైనటువంటి భూమి ఉన్న ప్రాంతం. దాంట్లో పెద్ద ఎత్తున చెట్లు పెంచారు. విశాఖపట్నానికి అంత ప్రత్యేకత ఉందంటే అది తమాషా అయిన వ్యవహారం కాదు. ఇప్పుడు ఈ చెట్లన్నీ పోయాయి. గతంలో ఎవరైనా ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఉన్న చెట్ల కింద కొంచెంసేపు కూర్చుని ఉన్నట్లయితే ఆ చెట్ల ప్రాధాన్యత ఏమిటో తెలిసి ఉండేది. ఇప్పుడు మొక్కలు నాటాలని మనం ప్రారంభించాము. ఈ మొక్కలు అలాంటి వృక్షాలు కావాలంటే ఎన్నేళ్ళు పడతాయనేది చూడాల్సిన విషయం. ఈ విషయంలో నేను ఒక సూచన చేయదలచుకున్నాను. చైనాలో మొక్కలు నాటడం కాకుండా చెట్లు నాటడమనే ఒక కొత్త ప్రక్రియను తీసుకొచ్చారు. పెద్ద పెద్ద వృక్షాలనే పెళ్ళగించి ఒక ప్రత్యేకమైన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వాటిని పెంచడమనేది చైనాలో చాలా పెద్ద ఎత్తున చేస్తున్నారు. ఎందుకంటే చాలా పెద్ద పెద్ద డ్యామ్స్ కట్టడం, పెద్ద పెద్ద రహదార్లను నిర్మించడం, పెద్ద పెద్ద నగరాలను నిర్మించడమనే పనులు చేస్తున్న కారణంతో చైనా ప్రభుత్వం చాలా ప్రణాళికాబద్ధంగా ఈ వ్యవహారాన్ని చేస్తోంది. విశాఖపట్నాన్ని ఒక మోడల్ సిటీగా, స్మార్ట్‌సిటీగా, అత్యాధునికమైన సిటీగా మార్చాలని చాలా పెద్ద పెద్ద ఆలోచనలు జరుగుతున్న సందర్భంలో ఒక సవాలుగా తీసుకుని ఐదారు ఏళ్ళలో ఈ మహావృక్షాలు మళ్ళీ అక్కడ చిగురించే విధంగా ఆ ఆధునిక చైనా సాంకేతిక పరిజ్ఞానాన్ని, అనుభవాల్ని వినియోగించుకోవాలని నేను కోరుతున్నాను. ఇక రెండవ అనుభవం ఏమంటే ఇంత తుఫాను వచ్చిన తరువాత చంద్రబాబునాయుడుగారు అక్కడే కూర్చుని మొత్తం ఈ టెలీకమ్యూనికేషన్‌కు సంబంధించిన సి.ఇ.ఓలందరితో మాట్లాడారు. టెలిఫోన్‌లను పునరుద్ధరించడానికి అందరూ చేతులెత్తేసిన మాట

వాస్తవం. అందరికంటే ముందుగా బి.ఎస్.ఎన్.ఎల్ వాళ్ళే పునరుద్ధరించారు. ఏ బి.ఎస్.ఎన్.ఎల్‌నైతే మనం అన్ని విధాల కిల్ చేస్తున్నామో ఆ బి.ఎస్.ఎన్.ఎల్ వాళ్ళు మాత్రమే మొట్టమొదట కమ్యునికేషన్ సిస్టమ్‌ను పునరుద్ధరించారు. ఎయిర్‌టెల్‌వాళ్ళు, మిగతా కంపెనీలవాళ్ళు ముఖ్యమంత్రిగారి దగ్గరకు రావాలంటేనే మొహం చాటేశారు. ఇది వాస్తవం.

మ. 01.40

అలాగే, విశాఖపట్టణం పోర్టు ఆస్తులను కాపాడుకోవడంలో అద్భుతమైనటువంటి చాకచక్యాన్ని, నైపుణ్యాన్ని ప్రదర్శించింది. విశాఖపట్టణం పోర్టులో చాలాపెద్ద ఎత్తున క్రేనులు, రూ. 50 కోట్లు, 60 కోట్లు విలువ చేసే సామాగ్రి ఉంది. ముందుగానే ఈ సామాగ్రినంతా దూర ప్రాంతాలకు తరలించుకుని, ఒకదానితో మరొకటి లింకులు పెట్టుకుని, గొలుసులతో కట్టేసుకుని వాటిని కాపాడుకున్నారు. అలా చేసి ఉండకపోతే విశాఖపట్టణం పోర్టుకు దాదాపు రూ. 400 కోట్లరూపాయలు నష్టం వచ్చి ఉండేది. ఒక కలెక్టర్, ఒక సాధారణ ఇంజనీరు కలిసి ఇంత నష్టాన్ని నివారించగలిగారంటే వారిని మనం గౌరవించాలి. ఒక సాధారణ ఇంజనీరు ఇచ్చిన సలహావలన, ఆ సలహాను కలెక్టర్ గారు అంగీకరించడం వలన విశాఖపట్టణం పోర్టులో ఇలాంటిది జరిగింది. ఈ రెండూ ప్రభుత్వరంగ సంస్థలేనని గుర్తుంచుకోవాలని కోరుతున్నాను. కేంద్రప్రభుత్వం సహకారం ఎంత అనే అంశం గురించి పెద్ద చర్చ జరిగింది. ప్రస్తుతం ఉన్న భయం ఏమిటంటే కోస్తా ఆంధ్రా ఆధారంగా ఉన్న రాష్ట్రాన్ని మనం ఏర్పాటు చేసున్నాము. కోస్తా ప్రాంతంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు పెంచుకోవాలని అనుకుంటున్నాము. విశాఖపట్టణంలో వచ్చిన తుఫాను బయటి నుండి వచ్చిన పారిశ్రామిక వేత్తలకు విశాఖపట్టణం తుఫాను ప్రభావిత ప్రాంతం అని గనుక ముద్రపడిపోతే దాని విషయంలో కేంద్రం ఇచ్చిన సహాయం కాని, మనం తీసుకునే జాగ్రత్తలు కాని అనుకున్నట్లుగా లేవనే సమాచారం గనుక పోయినట్లయితే మనం కన్న కలలన్నీ కలలుగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఖచ్చితంగా ఒక సవాలుగా రాష్ట్ర కేంద్రప్రభుత్వాలు ఎటువంటి విలయాలు వచ్చినా కూడా కోస్తా ప్రాంతం తట్టుకునే రాజనీతిజ్ఞత, సాంకేతిక పరిజ్ఞానం ఉంది, కేంద్రం కూడా సహకరిస్తుందనే సమాచారాన్ని పంపించలేకపోయినట్లయితే తీవ్రమైన నష్టం వస్తుందని నేను మనవి చేస్తున్నాను.

ఇకపోతే, చాలా పెద్దఎత్తున రకరకాలైన పునరావాస కార్యక్రమాలు జరిగాయి. విశాఖపట్టణం ప్రజలు దానిని అంగీకరించారు. దానిలో ఎటువంటి సందేహం లేదు. మేమూ మా బంధుమిత్రులతో మాట్లాడినప్పుడు ముఖ్యమంత్రిగారి గురించి మంచి అభిప్రాయమే వచ్చింది. కానీ సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటి? ఉదాహరణకు మత్స్యకారులు. వారికి వచ్చిన సమస్య ఏమిటంటే ఈ హుద్ హుద్ తుఫాను తర్వాత చేపలన్నీ వలసలు వెళ్లి పోయాయి. అవి గుడ్లు పెట్టడానికి తగిన వాతావరణం లేదని భయపడిపోయి, వాటికున్న విజ్ఞత, అనుభవం దృష్ట్యా they have their own technology to survive, పిల్లల్ని పెట్టే ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున వలసలు పోయాయి. మీరు బోటులు ఇచ్చినా మరొకటి ఇచ్చినా వాళ్లు చేపలు పట్టడానికి వెళితే గతంలో విపరీతంగా చేపలు పడే పరిస్థితి నుండి ఇప్పుడు కేవలం యాభై, అరవై కేజీల చేపలు మించి ఎక్కువగా పడడం లేదు. ఐదారుగురు కలిసి బోటు వేసుకుని చేపలు పట్టడానికి వెళితే ఒక్కొక్కరికీ పది కిలోలకు మించకుండా వస్తున్నాయి. ఇదేమీ సాంకేతిక పరిజ్ఞానంతో చేసేది కాదు. మనం బోట్లు, వలలు ఇస్తే సమస్య పరిష్కారం కాదు. చేపలకు మళ్లీ నమ్మకం కుదరాలి, అవి తిరిగి వచ్చి

పిల్లల్ని పెడితేనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది. దానికి మన వద్ద ఎటువంటి టెక్నాలజీ లేదు. మనం చేయాల్సింది వాళ్లకు బోట్లు ఇస్తే సరిపోదు, ఇంకా రెండు నెలల పాటు చేపలు చిక్కవు వాళ్ల జీవనం చిన్నాభిన్నం అవుతుంది. ఈ రెండు నెలలు వాళ్లను ఆదుకోవడానికి తగిన ప్రణాళిక ఉండాలి. అదేవిధంగా అటువంటి వర్గాల వారికి సహాయం చేయాలి. కొబ్బరి చెట్లు మొత్తం పడిపోయాయి. మళ్లీ వాటిని నాటి, పెరిగి కాయలు వచ్చే సరికి చాలా సమయం పడుతుంది. కాబట్టి ఆ ప్రాంతాలలో ఇటువంటి ప్రత్యేకంగా దెబ్బతిన్న వర్గాల వారిని గుర్తించి వారందరికీ సహాయం చేయాలి.

మిస్టర్ ఛైర్మన్ : మన ప్రిమిసెస్‌లో ఏదైనా మందుగుండు సామాగ్రి ఉందని సమాచారం వస్తే పోలీసుల కంటె ముందుగా కుక్కలను తీసుకుపోతాము. ఆ కుక్కకు ఏ టెక్నాలజీ లేకుండానే మందుగుండు సామాగ్రి ఎక్కడుందో అక్కడికి వెళ్లిపోతుంది. టెక్నాలజీ ఉన్న పోలీసులు, సెక్యూరిటీ కుక్కలను తీసుకుని వెళ్లి మందుగుండు సామాగ్రిని పట్టుకుంటారు.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : కుక్కలు మనల్ని కాపాడుతున్నాయి. కానీ వాటిని మనం కాపాడడం లేదు. మున్సిపాలిటీ వాహనాలలో తీసుకుపోయి వాటిని లేకుండా చేస్తున్నాము.

మిస్టర్ ఛైర్మన్ : మీరు ఉపాధ్యాయులు, బయోడైవర్సిటీ, జీవ సంరక్షణను వెలుగులోకి తీసుకురావాలి.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : అలాగేసార్, చివరిసారిగా నేను చెప్పేదేమంటే ఇంత పెద్ద విపత్తు జరిగి, ప్రజలంతా అల్లకల్లోల్లానికి గురయ్యి, భయోత్పాతం జరిగి ఫోన్లు రాక ఆందోళన పడుతున్న సందర్భంలో ఈ అవకాశాలను కూడా వీలైనంత వరకూ వ్యాపారాలకు, దోపిడీకి వినియోగించుకునే ఒక దుర్మార్గమైన సెక్షన్ ఉంది అంటే అది సిగ్గుచేటు. వీరిపట్ల అత్యంత కఠినంగా వ్యవహరించి ఉండాల్సింది. పాల ప్యాకెట్ రూ. 120 నుండి రూ. 150 వరకూ అమ్మారు. రూ. 1, రూ. 2 ఉండే మంచినీటి ప్యాకెట్స్ రూ. 20 నుండి రూ.30 వరకూ అమ్మారు. ఇటువంటి చీడపురుగులు ఈ సమాజంలో ఉన్నారు. అదే సందర్భంలో హుద్ హుద్ తుఫాను వచ్చిన సందర్భంగా మొత్తం ఆంధ్రదేశ సమాజం మొత్తం ఒకటిగా నిలబడిన మాట కూడా వాస్తవం. సాధారణ ప్రజలకు ఆ విజ్ఞత ఉంది. సాధారణ సమాజానికి ఆ బాధ్యత ఫీలయ్యే లక్షణం ఉంది. ఒక చిన్న సెక్షన్ నుండి వచ్చిన, ఇంగ్లీషులో చెప్పాలంటే లంప్‌లో వచ్చిన వారు ఎలాంటి కరువులు, తుఫానులు, వరదలు, యుద్ధాలు, భూకంపాలు వచ్చినా ప్రతీ ఒక్కటీ అవకాశంగా వినియోగించుకుంటారు. శ్రీ పాలగుమ్మి సాయినాథ్ గారు అనంతపురం జిల్లాలో వచ్చే కరువులను కొంతమంది ఏవిధంగా వినియోగించుకుంటారనే దాని గురించి వివరిస్తూ రాసిన ఆర్టికల్స్‌కు మెగసెస్ అవార్డు వచ్చింది. వాటిని చదవాల్సిన అవసరం ఉంది. మనకు ఒక అనుభవం ఉంది అధ్యక్ష, దానిని చెప్పి ముగిస్తాను. మనం ప్రజల్ని ఆ రకంగా ఆవేశపర్చాల్సిన అవసరం ఉంది. కూడగట్టాలి, సమీకరించాలి. లేకుంటే ఇటువంటి వాటిని తట్టుకోలేము. కర్నూలులో పెద్ద ఎత్తున బురద కొట్టుకు వచ్చి పాఠశాల అంతా దెబ్బతిని పిల్లలు చదువుకోవడానికి పుస్తకాలు లేకుండా పోయాయి. అప్పుడు మేము చిత్తూరు జిల్లాలో పిల్లలందరికీ ఒక పిలుపునిచ్చాము. మీతోటి పిల్లలు చదువుకోవడానికి పుస్తకాలు, పెన్నులు లేక ఇబ్బంది పడుతున్నారు. మీ అమ్మానాన్నలను అడిగి ఒక పెన్ను గాని, పుస్తకాన్ని గాని అడిగి తీసుకువచ్చి దానిమీద మీ పేరు, మీ ఊరి పేరు, మీ

ఫోన్ నెంబరు రాసివ్వండి అని అడిగితే మీరు నమ్ముతారో లేదో కాని రూ. 24 లక్షల రూపాయల విలువచేసే నోట్ పుస్తకాలను పిల్లలు తెచ్చి ఇచ్చారు. నాకు ఇప్పటికీ కళ్లల్లో నీళ్ల తిరుగుతున్నాయి అధ్యక్ష.

మిస్టర్ ఛైర్మన్ : 2009లో కర్నూలులో ఇది జరిగింది కదా.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : అవును సార్, జన విజ్ఞాన వేదిక ద్వారా చేశాము. ఈ పుస్తకాలను ఆ పిల్లలకు తెచ్చి ఇస్తే తీసుకున్న పిల్లలు దానిమీద ఉండే ఫోన్ నెంబరుకు ఫోన్ చేసి మీరు పంపించిన నోట్ పుస్తకాలు మాకు అందాయని చెబితే వారి మధ్య కుదిరిన స్నేహ సంబంధాలు చూస్తే భవిష్యత్తులో ఎంతటి ప్రమాదం వచ్చినా కూడా తట్టుకోవాలంటే మన పిల్లలు, మన సమాజం అనుబంధాలు పెంచుకున్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది తప్ప శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో చాలా చిన్న చిన్న పనులను చేయగలం తప్ప పెద్ద పెద్ద పనులు చేయడం సాధ్యం కాదని తమ ద్వారా మనవిచేస్తున్నాను.

MR. CHAIRMAN : Character building is more important than building.

SRI VITAPU BALA SUBRAHMANYAM : Heart is more important than building. కాబట్టి ఈ రకమైన భావావేశాన్ని, సహాయం చేసే విధానాన్ని పెంచడం ఎలా అనే దాని గురించి ఈ సందర్భంలో మాట్లాడుకోవాలని కోరుకుంటూ నాకు ఈ అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : సమాజంలో తమ స్వార్థం కోసం ప్యాకెట్స్‌ని ఎక్కువ ధరకు అమ్ముతారు. మరి "వృధాన్యార్థ భంగము గావించు వారు ఎవరో ఎరుంగన్ శక్యమే ఏరికిన్" మరి దానిని ఏమంటారు. భర్తృహరి చెప్పినదాని గురించి చెబుతున్నాను. ఇది ఆరవ తరగతిలోని పద్యం. మీరు దాని గురించి చెప్పరు.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : కానీ వారు వృథాగా ఏం చేయలేదు సార్, వాళ్ళు లాభాపేక్ష కోసం చేశారు.

మిస్టర్ ఛైర్మన్ : ఏదో ఆసామి, ధర్మం కోసం ఎండాకాలంలో చలివేంద్రం పెడతాడు, ఎవరో ఒక రాయి వేసి పోతారు, ఉపయోగం ఏముంటుంది? కాబట్టి మంచి సమాజాన్ని నిర్మించాలి.

మ. 1.50

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు : అధ్యక్షా, 12-10-2014 వ తేదీ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు అది ఒక చీకటి రోజుగా జీవితాంతం గుర్తుండిపోయేవిధంగా ఈ హుద్-హుద్ తుఫాను నిలిచిపోయిందని మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను. 1891 తరువాత నేటివరకూ ఆంధ్రా తీరాన్ని దాటిన తుపానుల సంఖ్యలో ఇది 77వది. అతి పెద్ద తుపానుగా ఇది మనకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. మిమిక్రీ ఆర్టిస్టులు చిన్నప్పటి నుంచి కూడా తుఫాను, తుఫాను తీవ్రత ఈ రకంగా ఉంటుందని చెపుతూ ఉంటే, ఆ రకంగా ఉంటుందా అని అందరూ అనుకుంటూ ఉంటారు.

వాతావరణ కేంద్రాలు తుఫాను వస్తుందని ముందుగానే హెచ్చరికలు చేసినప్పుడు, ఆ రకంగా జరగకపోయిన కొన్ని సంఘటనలను ఉదహరించుకుని తుపాను నిజంగా వస్తుందా అని అజాగ్రత్తగా ఉండే సందర్భం కూడా ఉంది. కానీ, ఇక ముందు మాత్రం తుఫాను హెచ్చరికలు వస్తే ముందుగా జాగ్రత్తపడాలనేంతగా ఈ హుద్-హుద్ తుఫాను మా మూడు జిల్లాలను కుదిపేసింది. ఈ తుఫాను గాలుల తీవ్రతతో ఇంకా రెండు సెకన్లు కనుక పెరిగి ఉంటే అనగా 220 నుంచి 250 కి.మీ. తారాస్థాయి కన్నా ఎక్కువ వేగంతో గాలులు వీచి ఉంటే, అవి ఇంకా రెండు సెకన్లపాటు కొన సాగితే, చెట్లతోపాటు అపార్టుమెంట్లు కూడా కూలిపోయే పరిస్థితి వచ్చి, ఎంతో ప్రాణ నష్టం జరిగి ఉండేది. కానీ, గాలి వేగం 220 కిలో మీటర్లే ఉండడం వలన కేవలం చెట్ల వరకే నష్టం జరిగింది. అపార్టుమెంట్లలో నివసిస్తున్న ఎంతోమంది కుటుంబాలు ఈ గాలుల తీవ్రతకు ఆ శబ్దాలకు భయాందోళనలు చెంది, క్రింద సెల్లార్‌లోకి వచ్చి ప్రాణభీతితో నిల్చున్న సంఘటనలు ఎన్నో జరి గాయి. అటువంటి భయానక వాతావరణంలో ప్రభుత్వ పరంగా రాష్ట్ర ముఖ్యమంత్రిగారు తుఫాను తాలూకు తీవ్రతని ముందుగానే గ్రహించి, భారత వాతావరణ కేంద్ర హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని, 11వ తారీఖు నాటికే ట్రాన్స్‌పోర్టు మొత్తాన్ని మాకు బోర్డర్ అయిన తుని దగ్గర, ఒరిస్సా దగ్గర ఎక్కడా వాహనాలు తిరగకుండా ట్రాఫిక్‌ని నియంత్రణ చేయడం జరిగింది. అలాగే కంపెనీ లలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆ కంపెనీలలోనే ఉండిపోయే విధంగా ఆదేశాలు జారీ చేశారు. కర్ఫ్యూ సమయంలో ప్రజలు బయటకు రాకుండా ఇళ్ళల్లో ఏ విధంగా ఉంటారో, ఆ రకమైన కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయడం వల్ల, ఎక్కువ ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని తమ ద్వారా సభకు తెలియజేస్తున్నాను. ఈ రకమైన చర్యలు చేపట్టడం వల్ల కేవలం 22 మంది మాత్రమే మృతిచెందడం జరిగింది. సుమారు 7,000లకు పైగా ఇళ్ళు ధ్వంసమ య్యాయి. సుమారు 18 పెద్ద కాలువలు దెబ్బతిన్నాయి. 1800లకు పైగా పెద్ద పశువులు, 4,400 చిన్న పశువులు మరణించాయి. లక్షలాది కోళ్ళు చనిపోయాయి. సుమారు 20,000ల విద్యుత్తు స్థంభాలు నేలకొరిగాయి. అదేవిధంగా, 220కె.వి సబ్ స్టేషన్లు 10, 400 కె.వి. సబ్ స్టేషన్లు 2 నేలకొ రిగాయి. సుమారు 7,073 చెట్లు పడిపోయాయి. ఇంత విపత్తు ఎప్పుడూ రాకుండా పెద్దలు చెప్పినట్లుగా ముందుగానే మనం పర్యావరణాన్ని పెంచుకుంటూ, తగు చర్యలు తీసుకోవలసిన అవ సరం ఎంతైనా ఉందని మీ ద్వారా తెలియజేస్తున్నాను.

మన ముఖ్యమంత్రిగారు అక్టోబరు 11వ తారీఖు నుండే ప్రజలను హెచ్చరిస్తూ, వారు రోడ్డు మార్గంలో విశాఖపట్టణానికి రావడం జరిగింది. నేను, చైతన్యరాజుగారు, పద్మరాజు గారు మీరు పంపించినట్లుగా క్యాంపుకు చేరుకుంటున్న ఒంటిగంట సమయంలో ముఖ్యమంత్రిగారి నుంచి మాకు డైరెక్టుగా ఫోన్‌కాల్ రావడం జరిగింది. ఈ ప్రాంతంలో తుఫాను రావడం జరిగింది. మీరందరూ సహాయం చెయ్యండని అన్నారు. అర్ధరాత్రి ఒంటిగంటకు ముఖ్యమంత్రిగారు మాట్లా డిన అనుభవాన్ని మేమందరం అనుభవించామని ఈ సందర్భంగా మీ అందరికీ చెపుతున్నాను. ఆ రకంగా మన కుటుంబసభ్యులకు నష్టం జరిగితే మనం ఏ రకంగా తల్లడిల్లిపోతామో, మన ప్రజ లకు కష్టం వచ్చింది, వారిని కాపాడాలనే తపనతో వారు పనిచేస్తూ, బస్సులోనే నివసించారు. ఆ యన సుమారు 15 రోజులపాటు విశాఖలోనే ఉంటూ, అధికారులను అప్రమత్తం చేస్తూ అన్నిరకాల చర్యలు తీసుకోవడం జరిగింది. అదేవిధంగా మంత్రులు కూడా జిల్లాలను దత్తత తీసుకుని అన్ని ప్రాంతాలలో రెవ్యూలను పరిశీలించి తిరిగి సంఘటన స్థలాలకు వెళ్ళి అన్నీ పరిశీలించారు. ఆ సంఘ టనకు సంబంధించిన కార్యక్రమంలో మంత్రులందరూ పాలుపంచుకుని అందరికీ మార్గదర్శకంగా నిలిచారని ఈ సందర్భంగా నేను తమ ద్వారా తెలియజేస్తున్నాను. ఈ తుఫానును జయించడం

కోసం ప్రజలలో మనోనిబ్బరం కలిగించడం కోసం ప్రభుత్వం తరఫున ఒక ర్యాలీని కూడా నిర్వహించడం జరిగింది. దానివల్ల ఎంతోమందికి ప్రభుత్వం అండగా ఉందని, ఈ కష్టాన్ని తాము జయించగలము, ఈ తుఫాను వల్ల కలిగిన నష్టాన్ని అధిగమించగలమనే నమ్మకాన్ని,భరోసాని ప్రజలలో కలిగించారు. అయితే, ఆ సందర్భంగా దీపావళి పండగ వస్తే – తుఫానుకు పడిపోయిన చెట్లన్నీ ఎండిపోవడంతో, అగ్నిప్రమాదం జరగి పెను నష్టం జరగడానికి అవకాశం ఉంది కాబట్టి, ఆ ప్రాంత ప్రజలందరూ ఒక్క టపాకాయ కాల్చకుండా పండగ చేసుకున్న సంఘటనలను కూడా నేను ఈ సందర్భంగా తమ ద్వారా మనవిచేస్తున్నాను. దీనికి సంబంధించి నేను సైతం అనే కార్యక్రమానికి ఎంతోమంది సంఘీభావం తెలియజేశారు. ఉద్యోగస్తులు తమ వేతనాల నుంచి సుమారు రూ.125 కోట్లు బాధలలో ఉన్న ప్రజానీకానికి అందించడానికి ప్రభుత్వానికి సహాయపడడం జరిగింది. అలాగే తానా ఫౌండేషన్ వారు కూడా లక్ష డాలర్లు విరాళంగా ఇవ్వడం జరిగింది. కార్పొరేట్ కంపెనీలు, సంపన్న వర్గాలు, సామాన్య ప్రజానీకం అందరూ కూడా తమకు తోచిన విధంగా మరియు యావత్తు ప్రపంచం పెద్దమనసుతో ఈ తుఫాను బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. కాబట్టి, వారందరికీ కూడా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా మాకు వచ్చిన ఈ కష్టాన్ని తమ కష్టంగా భావించి ఆదుకున్నందుకు వారందరికీ మరియు ముఖ్యమంత్రి గారు దగ్గరుండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించినందుకు ఆయనకి మంత్రులకు అందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ప్రత్యేకించి మన కౌన్సిల్ తరఫున మీరు డెప్యూటీ ఛైర్మన్ గారు పర్యటన చేసి, ఆ ప్రజల కష్టాలను తెలుసుకుని మేము ఈ రకంగా సహాయపడతామని, శాసన మండలి కూడా బాధితులకు సహాయపడుతుందని చెప్పడం ఈ కౌన్సిల్ గౌరవాన్ని పెంచిందని ఈ సందర్భంగా తమ ద్వారా మనవిజేస్తున్నాను. మన చీఫ్‌విప్ శ్రీమతి నన్నపనేని రాజకుమారి గారు, విప్‌గారు చైతన్యరాజుగారు కూడా ఆ ప్రాంతాలలో పర్యటనలు జరిపి అన్ని రకాల అంచనాలను తయారు చేసి ఇవ్వడంలో ప్రభుత్వానికి సహాయపడ్డారని తమ ద్వారా మనవిచేస్తున్నాను. కౌన్సిల్ తరఫున మనం ఆ రకంగా తుఫాను సమయంలో ఆ ప్రాంతాన్ని పర్యటించడం, బాధితులకు సంబంధించిన అంశాలను కేంద్రప్రభుత్వానికి ఇది జాతీయ విపత్తుగా గుర్తించేటట్లుగా, మనం తీర్మానం చేసి పంపిస్తామని భరోసా ఇవ్వడం, వాటి కష్టసుఖాలన్నింటినీ మనం మానవతాకోణంలో కౌన్సిల్‌లో చర్చించి, మీ ద్వారా మేము ఆ ప్రాంతాలను ఆదుకోవడం, కలెక్టర్లు కూడా వారి వారి జిల్లాల నుంచి ఏ నివేదికలయితే పంపించారో, ఆ నివేదికలన్నీ మేము ప్రభుత్వం ద్వారా మంజూరయ్యేట్లుగా చేసి, నష్టపరిహారాన్ని కానీ, సహాయ చర్యల ద్వారా కానీ ఆ ప్రాంతాన్ని యధాతథస్థితికి తీసుకురావడానికి కృషిచేస్తామని, మీరు ఇచ్చిన భరోసాను ఆ ప్రాంత ప్రజలు ఎప్పటికీ మరచిపోరని తమ ద్వారా తెలియజేస్తున్నాను. ఇటువంటి కార్యక్రమాలన్నీ చేసి, వారి ఆశలను సజీవంగా ఉంచాలని మీ ద్వారా నేను కోరుకుంటున్నాను. అదేవిధంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు ఏ తేడాలు లేకుండా ఈ హుద్ హుద్ తుఫాన్ వల్ల నష్టపోయిన దానిని తిరిగి యధాతథస్థితికి తీసుకురావడానికి వారి వంతు సహాయం చేస్తూ కేడర్లతో సంబంధం లేకుండా, రాత్రిపగలు తేడా లేకుండా అందరూ ఎంతో బాగా పనిచేశారనే పేరు తెచ్చుకోవడం ఉద్యోగస్తుల ప్రతినిధులుగా మాకు ఎంతో సంతోషాన్నిచ్చింది. ఆ కష్టంలో ఆదుకున్నామనే తృప్తిని కూడా ఈ తాఫాను మాకు ఇచ్చిందని తమ ద్వారా మనవిచేస్తున్నాను.

చార్‌థామ్ యాత్రలో ప్రయాణికులు మరణించినప్పుడు మేము ప్రతిపక్షనాయకులుగా ఉన్నప్పటికీ కూడా చంద్రబాబునాయుడు గారు ఆ రోజు స్పెషల్ ఫ్లైట్లు ఏర్పాటు చేసి, అనేక రకాల కుటుంబాలను ఆదుకుని, ఇటువంటి విపత్కర పరిస్థితులలో వారు చక్కగా ఆదుకుంటారనేదానికి

ఇది ఒక ఉదాహరణ మాత్రమే. అలాగే ఇప్పుడు జరిగిన ఈ విపత్తుకు సంబంధించి ఈ మూడు జిల్లాలు ప్రభావితమైనప్పుడు ఆయన మాలో ఒకరై ఈ ప్రాంతంలో ఉండి అనేక కార్యక్రమాలను చేపట్టి వీరందరినీ ఆదుకోవడం జరిగిందని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అలాగే, భవిష్యత్తులో ఇటువంటివి జరిగినప్పుడు ఏ రకంగా ఎదుర్కోవాలనే దానిపైన మరియు పర్యావర ణాన్ని కాపాడుకోవాలనే దానితోపాటు, నేషనల్ ఫారెస్ట్ లా ప్రకారంగా, ప్రతిజిల్లాలో 33 శాతం పచ్చ దనం ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలో ఆ రకంగా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో చెట్లు నాటడం, వాటిని కాపాడుకోవడం కోసం ప్రత్యేక నిధులు కేటాయించి ముందుగానే ఈ రకమైన వాతావరణంలోకి తీసుకురావలసిందిగా మీ ద్వారా నేను తెలియజేస్తున్నాను. కంపెనీలలో చాలా మంది ఉద్యోగులు ఈ మూడు రోజులు ప్రభుత్వ హెచ్చరికల వల్ల డ్యూటీలో ఉన్న వాళ్లు డ్యూటీలో ఉండిపోయారు. షిఫ్ట్‌లో రావలసినవారు ట్రాన్స్‌పోర్ట్ లేకపోవడం వల్ల వారు రాలేకపోయారు. అందువల్ల ఆ డ్యూటీలో ఉన్న వాళ్లు అక్కడే ఉండిపోయారు.

మ. 02.00

కాబట్టి, ట్రాన్స్‌పోర్టు లేక ఉండిపోయిన వాళ్లకి ఓడీ ఇస్తూ, షిఫ్ట్‌ల్లో ఉండే వాళ్లకి అలెవెన్స్‌లు ఇస్తూ ఉత్తర్వులు రాలేదని కొన్ని కంపెనీలు ఇంకా వాళ్లకి డబ్బులు చెల్లించడంలేదు. మన సభ ద్వారా వారిని కూడా ఆదుకోవాలని కోరుతున్నాను. అదే విధంగా, ఈ రోజున తుఫాను వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు గానీ, చిన్న, పెద్ద పరిశ్రమలు పెట్టుకుని జీవనాధారంగా ఉన్న పరిశ్రమల తాలూకు పైకప్పు రేకులు విరిగిపోయి, మిషనరీ పాడైపోయి, కొన్ని యంత్రాలకు ఇన్సూరెన్స్ కూడా లేక చాలా తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారు. కాబట్టి, ఇన్సూరెన్స్ ఉన్న వాళ్లకి తక్కువ పరిహారమిచ్చినా సరిపోతుంది. మరి ఇన్సూరెన్స్ లేని కంపెనీలకు తిరిగి పునరుజ్జీవనం కల్పించి, వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించేలా, తిరిగి పరిశ్రమలు పని చేసేలా ప్రభుత్వం పెద్ద మనస్సుతో ఈ ఆర్థిక సాయాన్ని పెంచాలని తమ ద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, మా ప్రాంతాల్లో పౌల్ట్రీ ఫారాలు ఎక్కువగా ఉంటాయి. కానీ, వాటి నిర్వాహకులను ప్రభుత్వం ఫార్మర్ల క్రింద గుర్తించలేదు. తమను కూడా ఫార్మర్ల క్రింద గుర్తించాలని ఆ పౌల్ట్రీ యజమానులందరూ మంత్రి గారి వద్దకు వచ్చి కోరితే, ఆ విషయం ముఖ్యమంత్రి గారికి తెలియజేసి, ఆ పౌల్ట్రీ వారందర్నీ ఫార్మర్లగా గుర్తిస్తూ ఆర్థిక సాయం అందించడమనేది ఎంతో సంతోషదాయకమైన విషయం. మళ్లీ వాళ్లు ధైర్యంగా పౌల్ట్రీ నిర్వహించుకునే శక్తినివ్వడమనేది, కష్టంలో ఆదుకోవడమనేది వారి గొప్ప మనస్సుకు నిదర్శనమని ఈ సందర్భంగా నేను మనవి చేస్తున్నాను.

మా దగ్గర పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో గానీ, సీతమ్మపేట ఏజెన్సీలో గానీ కాఫీ తోటలున్నాయి. పాడేరులో కాఫీ తోటలు బాగా దెబ్బతిన్నాయి. అక్కడ చూడటానికి చెట్టు మాత్రమే ఉంటుంది. కానీ, కాఫీ చెట్టు నుండి ఉత్పత్తి రావాలంటే, మళ్లీ మూడు, నాలుగు సంవత్సరాలు పట్టే పరిస్థితి ఉంది. దానివల్ల కాఫీ ఉత్పత్తుల మీద ఆధారపడిన చిన్న, పెద్ద గిరిజన రైతులు ఎంతోమంది నష్టపోయే పరిస్థితి ఉన్నది. ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో కాఫీకి సంబంధించి పేర్కొనబడలేదు. కాబట్టి, కాఫీకి సంబంధించి ప్రత్యేకంగా దృష్టి పెట్టి, గిరిజన రైతాంగాన్ని కాపాడాలని మీ ద్వారా నేను కోరుతున్నాను.

అధ్యక్షా, విశాఖ పర్యటనలో భాగంగా తమరు భోగాపురం దగ్గర కొబ్బరి చెట్లను పరిశీలించారు. చూడటానికి చెట్లు పడిపోయి ఉంటే మనం డబ్బులిస్తున్నాము గానీ, చెట్టు నిలబడి ఉంటే మాత్రం వాళ్లు డబ్బులు ఇచ్చేలా రికార్డుల్లో ఎక్కడా మెన్షన్ చేయలేదు. అలాంటి రైతులందరూ సభ దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లమని అక్కడి రైతులు మీకు రిప్రజెంటేషన్ కూడా ఇవ్వడం జరిగింది. వారు చెబుతున్నదేమంటే, ఆ చెట్టు పడిపోకపోయినా, ఆ చెట్టు మొవ్వ పోతే మళ్లీ కాపు రావడానికి మూడు, నాలుగు సంవత్సరాల సమయం పడుతుంది కాబట్టి, అటువంటి పరిస్థితుల్లో మేం కొబ్బరి చెట్ల కాయిల మీద బ్రతికే రైతాంగం కాబట్టి, మమ్మల్ని ప్రత్యేకంగా మొవ్వ పోయినా సరే నష్ట పరిహారం ఇవ్వాలని మీ దృష్టికి తెచ్చారు. కాబట్టి, మీరు ఆ విషయాన్ని సభ దృష్టిలో పెట్టి, ప్రభుత్వానికి రిప్రజెంట్ చేసి, పడిపోకుండా ఉన్న కొబ్బరి చెట్లకు కూడా లాభం కలిగేలా కృషి చేయాలని మీ ద్వారా కోరుతున్నాను.

అధ్యక్షా, మనం శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో పౌల్ట్రీ ఫారాలను చూసేందుకు వెళ్లినప్పుడు, ఆ పౌల్ట్రీ ఫారాల యాజమాన్యాలు తమ సమస్యలను మీ దృష్టికి తీసుకువచ్చారు. ఒక పౌల్ట్రీ షెడ్ వేయడానికి కేవలం పది వేల రూపాయల వరకు మాత్రమే ప్రభుత్వ సాయంగా ప్రకటించింది. అది గతంలో కంటే ఎక్కువగానే వచ్చింది. కానీ, వారు షెడ్ వేయించుకునే శక్తి ఆ పది వేల రూపాయలు ఇవ్వదు కాబట్టి, దాని మీద కూడా ప్రత్యామ్నాయంగా కొంచెం పెద్ద మనస్సుతో ఆ నష్ట పరిహారాన్ని పెంచాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అలాగే, మత్స్యకారులకు సంబంధించిన బోట్ల విషయంలో కూడా ప్రభుత్వం పెద్ద మనస్సుతో నష్టపరిహారాన్ని ఇస్తోంది. కానీ, ఆ బోట్లకు నష్టపరిహారం కాకుండా, వాళ్ల దగ్గర నుండి కొంత డబ్బు తీసుకుని, కొత్తగా బోట్లు కొనిస్తేనే తప్ప, ఆ బోట్లనేవి సముద్రంలోకి వెళ్లవు. మనమిచ్చే నష్టపరిహారం సరిపోనందువల్ల బోటు కొనక, బోట్లు లేక సముద్రంలోకి వెళ్లక వారు జీవనోపాధి కోల్పోయే ప్రమాదముంది. కాబట్టి, మనం సబ్సిడీ పైన ఇచ్చే మొత్తం డబ్బు రూపంలో కాకుండా, బోట్ల రూపంలో వారికి అందజేసి, మళ్లీ మత్స్యకారులు జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ముందుకు వెళ్లే విధంగా కృషి చేయాలని మీ ద్వారా కోరుకుంటున్నాను.

మీరు చేపట్టిన పర్యటనలో మరెంకెన్నో విషయాలు మీ దృష్టికి వచ్చాయి కాబట్టి, వాటన్నింటినీ కూడా మీరు గ్రహించగలరు. ఏదేమైనా మా మూడు జిల్లాలకు సంబంధించి ఉత్తరాంధ్రలో ఈ తుఫాను సమయంలో మన మంత్రివర్యులు అందరూ అక్కడ మకాం వేసి పని చేశారు. విద్యుచ్ఛక్తి విషయంలో ప్రభుత్వానికి నిజంగా జోహార్లు చెప్పాలి. ఎందువల్లనంటే, ఆ తుఫాను తాకిడి వల్ల నెల రోజులైనా కరెంటు రాదనుకునే తరుణంలో కేవలం 5 రోజుల్లోనే స్థంభాలు పడిపోయినా సరే, వేరే టెక్నాలజీని ఉపయోగించి కరెంటుని పునరుద్ధరించడమనేది చేశారు. విశాఖపట్నంలో గానీ, విజయనగరంలో గానీ, శ్రీకాకుళంలో గానీ రాత్రుళ్లు మకాం వేసి, అధికారులను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ, ఎన్నో రకాల నిర్ణయాలు అక్కడికక్కడే తీసుకుంటూ జన జీవన స్రవంతికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశారు. కరెంటనేది ఎంత అవసరమో ఆ మూడు, నాలుగు రోజుల్లోనే మాకు తెలిసింది. కరెంటు లేకపోవడం వల్ల సెల్‌ఫోన్ చార్జింగులే కాదు, వాటర్ మోటార్లు పని చేయక చాలా ఇబ్బంది వచ్చింది. దాన్ని అధిగమించి, అన్నింటినీ యథాస్థితికి తీసుకు రావడానికి కృషి చేసినందుకు గాను మా మూడు జిల్లాల ప్రజల తరఫున నేను ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ముఖ్యమంత్రి గారు క్రైసిస్ మేనేజ్‌మెంట్ బాగా చేయగలరు. ఇటువంటి కష్టాల్లో ఉన్నప్పుడు వారు ప్రజలను బాగా ఆదుకున్నందుకు, వారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్ః పూర్తిగా పడిపోయిన ఇళ్లకు నష్టపరిహారం పూర్తిగా ఇస్తున్నారు. పాక్షికంగా పడిపోయిన ఇళ్లకు రూ.5000 మాత్రమే ఇస్తున్నారు. అది తక్కువ కాబట్టి, దాన్ని కొంచెం పెంచమని అడిగారు. ఆ విషయం మీకు గుర్తుందా?

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడుః ఔను సార్. గుర్తుంది. ఇళ్లు కూడా కావాలని అడిగారు. కాబట్టి, ప్రభుత్వం తరఫున ఒక తీర్మానం చేసి, అక్కడి బాధితులను ఆదుకోవాలని నేను కోరుకుతున్నాను. ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు.

మిస్టర్ ఛైర్మన్ః ఇంకా శ్రీకాకుళం జిల్లా నుండి సభ్యులు శ్రీ పీరుకట్ల విశ్వ ప్రసాదరావు, విజయనగం జిల్లా నుండి సభ్యులు శ్రీ డి.వి.సూర్యనారాయణ రాజు గార్లు కూడా మాట్లాడాల్సి ఉంది.

శ్రీ అంగర రామ మోహన్ః ఇంకా ముగ్గురు, నలుగురు సభ్యులు మాట్లాడాల్సి ఉంది. కాబట్టి సోమవారం కూడా చర్చించి, అప్పుడు ప్రభుత్వాన్ని రిప్లై ఇవ్వమనండి సార్.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడుః అధ్యక్షా, ప్రభుత్వం తరఫున కేంద్రానికి హుద్‌హుద్ తుఫాన్‌ని జాతీయ విపత్తుగా గుర్తించాలని తీర్మానం చేయడం. అదేవిధంగా మన కౌన్సిల్ నుండి ఒక బృందాన్ని కేంద్రం వద్దకు పంపించి, కేంద్ర సహాయం ఎక్కువగా వచ్చేలా కృషి చేయడం. (మైకు లేకుండా)

మిస్టర్ ఛైర్మన్ః మినిస్టర్ గారూ.. మిగతా వారితో సోమవారం చర్చను కొనసాగిద్దామని ప్రభుత్వ విప్ గారు విజ్ఞప్తి చేశారు.

శ్రీ సి.హెచ్.అయ్యన్న పాత్రుడుః సార్, కేంద్ర ప్రభుత్వం ఇంకా నిధులివ్వాలని కౌన్సిల్‌లో కూడా తీర్మానం చేసి పంపిస్తే బాగుంటుంది.

మిస్టర్ ఛైర్మన్ః తప్పకుండా ఆ తీర్మానం సోమవారం టేకప్ చేసి, తరువాత రిప్లై తీసుకుందాము.

శ్రీ సి.హెచ్. అయ్యన్న పాత్రుడుః రిప్లై అయిపోయాక తీర్మానం పెడదాము సార్.

మిస్టర్ ఛైర్మన్ః అలాగే చేద్దాం. ఆ తీర్మానం కూడా గవర్నమెంటు వైపు నుండి వస్తే బాగుంటుంది. ఛైర్ నుండి అయినా సరే, గవర్నమెంటు నుండైనా సరే. సోమవారం టేకప్ చేద్దాము.

Now, the House is adjourned to meet again on Monday, the 22nd December, 2014 at 10-00 a.m.

(Then, the House adjourned at 2-07 p.m)

---